
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 20-10-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 290 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50

అంతా గోప్యమే...!
అటకెక్కుతున్న సర్వే ఫలితాలు
- మరుగునపడుతున్న వాస్తవాలు
- బలహీనపడుతున్న గణాంక వ్యవస్థ



నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా వాస్తవాలను కప్పిపెడు తోంది. అధికారిక సమాచారాన్నే తారుమారు చేస్తూ ప్రజలను మభ్యపెడుతోంది. గణాంకాలను రాజకీయ ఆయుధాలుగా మలచుకుంటూ ఎన్నికలలో ప్రయోజనం పొందేందుకు ప్రయత్నిస్తోంది. ఒకప్పుడు దేశానికే పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టిన జాతీయ గణాంక వ్యవస్థ ఇప్పుడు ప్రభుత్వ చర్యల కారణంగా బలహీనపడింది.విశ్వసనీయతను కోల్పోతోంది.

-జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్, ఆర్థికవేత్త జయతీ ఘోష్

భారత్‌లో పేదరికం తగ్గలేదు
ఐదేండ్ల క్రితం నాటి స్థాయిలోనే ఉంది



గడచిన ఐదు సంవత్సరాల కాలంలో దేశంలో పేదరికంలో ఎలాంటి మార్పు రాలేదు. 2019, 2020 సంవత్సరాలలో పేదరికం బాగా పెరిగినప్పటికీ 2021లో కొంత తగ్గింది. కానీ 2018లో ఏ స్థాయిలో ఉన్నదో గత సంవత్సరం కూడా అదే స్థాయిలో ఉన్నదని ప్రపంచబ్యాంక్ తాజా నివేదిక తెలిపింది. కోవిడ్ సమయంలో ప్రపంచంలోని అనేక దేశాలలో పేదరికం బాగా పెరిగింది. అయితే మన దేశంలో 2019 లోనే దాని పెరుగుదల ధోరణి కన్పించింది.

5లో..

న్యూఢిల్లీ : పాలకులకు ప్రజల జీవన స్థితిగతులపై కనీస పరిజ్ఞానం ఉండి తీరాలి. ఎందుకంటే వారి జీవితాలను బాగు చేయాలంటే ఆ అవగాహన అవసరం. ప్రజలు ఎలా జీవిస్తున్నారు, వారు ఏం పని చేస్తున్నారు, ఎంత ఆర్జిస్తున్నారు, ఆదాయం-సంపదలో అసమానతలు, కనీస సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా, విద్య-నైపుణ్యం ఏ స్థాయిలో ఉన్నాయి వంటి వివరాలన్నీ ప్రభుత్వాలకు తెలియాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ పాలకులు జరిపిన జనగణనలో కొంత మౌలిక సమాచారం లభించేది. 1950 తర్వాత గణాంక సేకరణలో పద్ధతులు మారాయి. స్థూల దేశీయోత్పత్తి వంటి జాతీయాదాయ సూచికలను అభివృద్ధి చేశారు. అలాగే ఆర్థిక ప్రణాళికలను రూపొందించారు. వినియోగ సర్వేల ఆధారంగా పేదరిక సూచికలను తయారు చేసి వెనుకబాటుతనాన్ని గుర్తించారు.

సర్వే ఫలితాలలో గోప్యత

అయితే 2014 తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అత్యవసర సమాచారం లభ్యత, విశ్వసనీయతలో పలు నాటకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. జాతీయ ఆదాయ లెక్కింపునకు ప్రాతిపదికగా తీసుకోవాల్సిన సంవత్సరాన్ని మార్చడంతో ...5లో

కాంగ్రెస్‌దే విజయం
బీఆర్ఎస్‌కు భంగపాటు తప్పదు



- ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేస్తాం
- బీఆర్ఎస్, బీజేపీ,ఎంఐఎం ఒక్కటే..
- కులగణన చేసేందుకు ఆ పార్టీలు జంకుతున్నాయ్ : ప్రచార యాత్రలో రాహుల్‌గాంధీ

నవతెలంగాణ-భూపాలపల్లి/ కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / పెద్దపల్లి టౌన్/ కరీంనగర్

'తెలంగాణలో సునామిలా కాంగ్రెస్ సర్కారు ఏర్పడబోతోంది. వచ్చేది మన ప్రజల ప్రభుత్వమే. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు గోస పడుతున్నారు.. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం ఒక్కటేనన్న విషయాన్ని ప్రజలు గుర్తించారు. పేదల ప్రభుత్వం కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ ప్రజానీకం కాంగ్రెస్‌వైపే ఉంది.. కుల గణన చేపట్టేందుకు బీఆర్ఎస్, బీజేపీ జంకుతున్నాయ్.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన చేపడుతాం. ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతాం..' అని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణలో పాదయాత్ర, రోడ్‌షోల్లో పాల్గొంటున్న రాహుల్‌గాంధీ సహా పలువురు నేతలు గురువారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా నుంచి కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోకి ప్రవేశించారు. కాటారం, పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బహిరంగ సభల్లో పాల్గొన్నారు. అనంతరం కరీంనగర్ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. నగరంలోని రాజీవ్‌చౌక్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఆయా సభలు, కార్నర్‌మీటింగ్‌లలో రాహుల్‌గాంధీ ప్రసంగించారు. ఈ ప్రాంతంతో తమకు ప్రేమతో కూడిన కుటుంబ సంబంధం ఉందన్నారు. ఇక్కడ తమ పార్టీకి రాజకీయంగా నష్టం జరుగుతుందని తెలిసినా ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను గౌరవించి సోనియాగాంధీ రాష్ట్రాన్ని ఇచ్చారని తెలిపారు. అయితే, తెలంగాణ ప్రజల కలలను కాలరాస్తూ ఇక్కడి బీఆర్ఎస్ ప్రభుత్వం దోపిడీకి తెగబడిందన్నారు. కాళేశ్వరంతో ఎక్కడైనా నీళ్లు వచ్చాయా? కనీసం ఎవరికైనా లాభం జరిగిందా?, రూ.లక్ష రుణమాఫీ ఏ రైతుకైనా వచ్చిందా? అంటూ ...5లో

కాంగ్రెస్‌తోనే కార్మిక సమస్యలు పరిష్కారం
సింగరేణి ప్రవేటీకరణను అడ్డుకుంటాం : రేవంత్

3లో



రాహుల్ జీ.. దేశానికే టీచింగ్ పాయింట్ తెలంగాణ
మంత్రి కేటీఆర్ ట్వీట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



"మంథని దాకా వెళ్లారు.. పక్కనే కాళేశ్వరం. .ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టును సందర్శించండి" అని మంత్రి కేటీఆర్ గురువారం ట్విట్ చేశారు. 'దేశ సాగునీటి రంగ చరిత్రలోనే..అతి గొప్ప మానవ నిర్మిత ఇంజినీరింగ్ అద్భుతాన్ని చూసి తరించండి. సముద్రంలో కలుస్తున్న గోదావరిని ఒడిసిపట్టి.. బొట్టుబొట్టును ఎలా తెలంగాణ మాగాణాల్లోకి మళ్లిస్తున్నామో అర్థం చేసుకోండి. నీళ్ల పల్లమే కాదు.. బలమైన సంకల్పం ఉంటే... ఎత్తుకు ఎలా పరుగులు పెడతాయో తెలుసుకోండి. పాతాళంలో ఉన్న గోదావరి నీటిని.. ఆకాశానికి ఎత్తిపోసే బాహుబలి మోటార్ల బలాన్ని స్వయంగా బేరీజు వేసుకోండి. మొగులు వైపు చూసే దిగులు లేకుండా.. లక్షలాది మంది రైతులకు కొండంత ధీమా ఇచ్చిన కాళేశ్వరంపై పసలేని విమర్శలు ఇకనైనా మానుకోండి .కాంగ్రెస్ హయాం నాటి ఆకలి కేకల తెలంగాణ బీఆర్ఎస్ పాలనలో దేశం కడుపు నింపే అన్నపూర్ణగా ఎలా ఎదిగిందో కళ్లారా చూడండి' అంటూ ట్విటర్ వేదికగా రాహుల్‌కు సూచించారు.

ఎదురు దాడులకు కేరాఫ్ అడ్రస్ డ్రామారావు
మంత్రి కేటీఆర్‌కు రేవంత్ కౌంటర్ ట్వీట్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బస్సుయాత్ర తుస్సుమనడం ఖాయమంటూ మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్‌కు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి కౌంటర్ ట్వీట్ చేశారు. నిస్సిగ్గు మాటలకు, ఎదురుదాడులకు కేరాఫ్ అడ్రస్ డ్రామారావు అంటూ కేటీఆర్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. 10 ఏండ్లు అధికారంలో ఉండి అంట కాగింది మోడీ- కేడీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు పరిశ్రమకు పాతరేసింది బీజేపీ, బీఆర్ఎస్ ...13లో

మధ్య ప్రాచ్యంలో సుస్థిరత నెలకొనాలి
హింస, ఘర్షణలు పెచ్చరిల్లకుండా చూడాలి
- నెతన్యాహుతో రిషి సునాక్ భేటీ
- ఈజిప్ట్‌తో కలిసి పనిచేస్తామన్న జిన్‌పింగ్
- 27టన్నుల సాయంతో రష్యా విమానం
- అబ్బాస్‌కు మోడీ ఫోన్



గాజా, జెరూసలేం, న్యూఢిల్లీ : ఇజ్రాయిల్, హమస్ మధ్య ఘర్షణలు పెచ్చరిల్లి ప్రాంతీయ ఘర్షణలుగా విస్తరించకుండా చూడడం చాలా ముఖ్యమని బ్రిటీష్ ప్రధాని రిషి సునాక్ పేర్కొన్నా రు. ఇందుకోసమే పశ్చిమాసియా ప్రాంతవ్యాప్తంగా పలువురు నేతలను కలిసి మాట్లాడాలనుకుంటు న్నట్లు చెప్పారు. అందులో భాగంగానే ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో రిషి సునాక్ గురువారం భేటీ అయి చర్చలు జరిపారు. అనంతరం ఇజ్రాయిల్ అధ్యక్షుడు ఇజాక్ హెర్జోగ్‌తో కూడా సమావేశమయ్యారు. హింస మరిన్ని ప్రాంతాలకు జరిపారు. అనంతరం ఇజ్రాయిల్ అధ్యక్షుడు ఇజాక్ హెర్జోగ్‌తో కూడా సమావేశమయ్యారు. హింస మరిన్ని ప్రాంతాలకు విస్తరించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మొత్తంగా మధ్య ప్రాచ్యంలో హింస, ఘర్షణలు పెచ్చరిల్లకుండా చూడాల్సిన అవసరాన్ని ఇరువురు నేతలు నొక్కి చెప్పారని బ్రిటన్ ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

రష్యా నుంచి 27 టన్నుల సాయం

27టన్నుల సాయాన్ని గాజాకు పంపుతున్నట్టు రష్యా తెలిపింది. మాస్కో నుండి ప్రత్యేక విమానం ఈజిప్ట్‌కు చేరుతుందని, అక్కడ రష్యా మానవతా సాయాన్ని ఈజిప్ట్ రెడ్‌క్రీసెంట్ అధికారులకు అందజేస్తామని డిప్యూటీ మంత్రి ఇలియా డెనిసొవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

మధ్యప్రాచ్యంలో సుస్థిరత కోసం ఈజిప్టుతో కలిసి పనిచేస్తాం : జిన్‌పింగ్

మధ్య ప్రాచ్యంలో మరింత సుస్థిరత నెలకొనేలా చూసేందుకు ఈజిప్ట్‌తో కలిసి పనిచేస్తామని చైనా నేత జిన్‌పింగ్ చెప్పారు. గురువారం ఈజిప్ట్ ప్రధానితో ఆయన మాట్లాడారు. ఈజిప్ట్‌తో ...13లో

వినాశనం అంచున పాలస్తీనా : ఏచూరి



కొచ్చి : పాలస్తీనా దశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. పాలస్తీనీయులను నిర్మూలించే దిశగా దాడులు సాగుతున్నాయని ఏచూరి ఆందోళన వ్యక్తం చేశారు. కొచ్చిలో జరిగిన పాలస్తీనా సంఘీభావ సదస్సును గురువారం నాడిక్కడ ఆయన ప్రారంభించారు. గాజా ఆస్పత్రిపై దాడి అత్యంత దుర్మార్గమైనదని ఏచూరి ఖండించారు. ఈ దాడికి సంబంధించి ఇజ్రాయెల్ తప్పుడు వార్తలను ప్రచారంలో పెడుతోందన్నారు.

ఆస్పత్రిపై క్షిపణి దాడి చేసింది తాము కాదని, హమాస్ డిఫెన్సివ్ క్షిపణుల వల్ల ఆస్పత్రి ధ్వంసమైందంటూ ఇజ్రాయిల్ తప్పుడు ప్రచారం చేస్తోందని, ఇలాంటి బోగస్ వార్తల వెనుక అంతర్యాన్ని గుర్తించాలని ఆయన కోరారు.



న్యూస్‌క్లిక్ కేసులో ఢిల్లీ పోలీసులకు
సుప్రీం నోటీసులు
తదుపరి విచారణ 30కి వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

న్యూస్‌క్లిక్ కేసులో ఢిల్లీ పోలీసులకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. తమపై నమోదైన చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (యూఏపీఏ) కేసును సవాల్ చేస్తూ న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్త, న్యూస్ వెబ్‌సైట్ హెచ్‌ఆర్ విభాగం హెడ్ అమిత్ చక్రవర్తి దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ పోలీసుల స్పందనను సుప్రీంకోర్టు కోరింది. గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. తదుపరి విచారణను అక్టోబర్ 30కి వాయిదా వేసింది.ప్రబీర్ తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ "ప్రబీర్ లోపల ఉన్నారు. ఆయన ...13లో



విద్యారంగాన్ని గాలికొదిలిన
రాజకీయ పార్టీలు
సర్కారు బడుల్లో ప్రీప్రైమరీని ప్రారంభించాలి
- తరగతికొక టీచర్, గది, బడికో హెచ్‌ఎం ఉండాలి
- విద్యపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించే అభ్యర్థులనే ఎన్నుకోవాలి : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యారంగాన్ని రాజకీయ పార్టీలు గాలికొదిలేశాయని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విమర్శించారు. పార్టీల మ్యానిఫెస్టోల్లో విద్యకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో మళ్లీ అధికారంలోకి వస్తే అసెంబ్లీ ...13లో



సైబర్ నేరగాళ్లపై సీబీఐ
11 రాష్ట్రాల్లో 76 చోట్ల సోదాలు
- క్రిప్టో మోసాలపైనా దృష్టి

న్యూఢిల్లీ : సైబర్ నేరగాళ్లపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) మరోమారు గురి పెట్టింది. ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న వారిని లక్ష్యంగా చేసుకుని జాతీయ, అంతర్జాతీయ ఏజెన్సీల సహకారంతో 11 రాష్ట్రాల్లోని 76 చోట్ల సోదాలు నిర్వహించింది. ఆర్థిక మోసాలకు సంబంధించి ఐదు వేర్వేరు కేసులు నమోదు చేసిన సీబీఐ ఆపరేషన్ "చక్రా-2" పేరుతో దాడులు చేసింది. ఫైనాన్షియల్ ఇంటలిజెన్స్ ...13లో

వేడెక్కిన ఎన్నికలు
రాహుల్ రాకతో పెరిగిన కాక
విమర్శలు, ప్రతివిమర్శలతో బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల ప్రచారహోరు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్



రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు గత వారం, పది రోజుల నుంచి మారిపోతున్నాయనీ, కాంగ్రెస్ పుంజుకుంటున్నదనే సర్కారీ వేగుల సమాచారంతో బీఆర్ఎస్ అప్రమత్తమైంది. గతంలో తమకు బీజేపీనే ప్రత్యర్థి అన్న బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్‌పై విరుచుకుపడుతుండటం పట్ల రాజకీయ విశ్లేషకులను సైతం ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. ఇందుకు ప్రభుత్వ ఇంటెలిజెన్స్ నుంచి వస్తున్న హెచ్చరికలే కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పైగా ప్రస్తుతం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తన సోదరి ప్రియాంకాగాంధీతో కలిసి సంధిస్తున్న విమర్శలు గులాబీ కోటకు గట్టిగానే తగులుతున్నాయి. అందుకే సీఎం కేసీఆర్‌సహా అన్నాచెల్లెళ్లు కేటీఆర్,కవితలు సైతం రాహులపై విరుచుకుపడుతున్నారు. దీంతో రాజకీయా ఒక్కసారిగా వెడేక్కాయి.

అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముమ్మరమైంది. మాటల తూటాలు పేలుతున్నాయి. శూలాల్లాంటి విమర్శలు సంధిస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చేసుకుంటున్న పరస్పర విమర్శలు అప్పుడే జనంలో చర్చకు దారితీస్తున్నాయి. ఇరుపార్టీలు నేతలు వ్యక్తులుగా, మ్యానిఫెస్టోలపైనా విమర్శలు, ప్రతివిమర్శలకు దిగుతున్నారు. బస్సుయాత్ర పేర తెలంగాణలో అడుగుపెట్టిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలు ఆలస్యం, గులాబీ సర్కారుపై పదునైన విమర్శలు ...13లో

పాలస్తీనాపై ఇజ్రాయిల్‌ది క్రూర దాడి

వందలాది పసివాళ్లను చంపేయడం దుర్మార్గం

- సహజవనరులపై పట్టు కోసమే నెతన్యాహుకు అమెరికా వత్తాసు: సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఆర్.అరుణ్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సహజవనరులు పుష్కలంగా ఉన్న పశ్చిమాసియాపై పట్టు సాధించడంలో భాగంగా ఇజ్రాయిల్‌కు పెట్టుబడిదారీ దేశాలు మద్దతు పలుకుతున్నాయని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఆర్.అరుణ్‌కుమార్ విమర్శించారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని క్రూరమైనదిగా వ్యాఖ్యానించారు. పైగా, పాలస్తీనీయులపైనే పెద్ద ఎత్తున విష ప్రచారం జరుగుతున్న విషయాన్ని గుర్తుచేశారు. చారిత్రక పరిణామాలను చూడకుండా పాలస్తీనీయులదే తప్పు అని చిత్రీకరించడం తగదన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం- కారణం- పరిష్కారం అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. దీనికి ఎస్వీకే ట్రస్టు కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. అరబ్ దేశాల్లో పెరుగుతున్న సోషలిస్టు భావజాలాన్ని తొక్కిపెట్టేందుకు ఆ ప్రాంతంలో తమకు అనుకూలమైన దేశం, ప్రభుత్వం ఉండాలనే, అపారమైన సహజవనరులను కొల్లగొట్టాలనే ఎత్తుగడలో భాగంగానే సామ్రాజ్యవాదులు ఇజ్రాయిల్‌కు వత్తాసు పలుకుతూ వస్తున్న తీరును వివరించారు. గాజాలోని ఆస్పత్రిపై దాడిలో 500 మందికిపైగా చనిపోయారనీ, వందలాది మంది క్షతగాత్రులు, మృతులు శిథిలాల కింద ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల ఏడో తేదీ నుంచి ఇప్పటిదాకా 51 సార్లు దాడులు జరిగాయనీ, అందులో 3,400 మందికిపైగా పాలస్తీనీయులు చనిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. హమాస్ చేసిన దాడిలో తమ పౌరులు, పిల్లలు, మహిళలు పెద్ద ఎత్తున చనిపోయారనీ, దానికి ప్రతీకారంగానే పాలస్తీనీయులపై దాడులు చేస్తున్నా మని చెప్పడంలో పూర్తి వాస్తవం లేదన్నారు. అవకాశం



కోసం చూస్తూ సమయం దొరికిందని తమ పైశాచికత్వాన్ని ఇజ్రాయిల్ ప్రభుత్వం ప్రదర్శిస్తున్నదన్నారు. ఇజ్రాయిల్ దాడిలో ప్రతి 15 నిమిషాలకు ఒకరు చొప్పున పాలస్తీనా పిల్లలు చనిపోతున్నారని వాపోయారు. పైగా, పాలస్తీనీయులపై ఇంగ్లాండ్, అమెరికాలోని యూదు మత చాంధసవాసులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. గతంలో 33 శాతం జనాభా ఉన్న ఇజ్రాయిల్ దేశస్తులకు 55 శాతం భూమిని, పాలస్తీనాకు 42 శాతం ప్రాంతాన్ని, యూదులు, క్రిస్టియన్లు, ముస్లింల పవిత్రస్థలాలున్న జెరూసలెం ప్రాంతంలోని మూడు శాతం భూమిని అంతర్జాతీయ భూభాగంగా ఉంచేలా జరిగిన ఒప్పందాన్ని వివరించారు. కానీ, తదనంతర కాలంలో ఇజ్రాయిల్ దేశం పాలస్తీనాను ఆక్రమించుకుంటూ పోయిందనీ, 1947-49 మధ్యలో పాలస్తీనాలో ముఖ్యమైన 500 పట్టణాలు, గ్రామాలను మొత్తంగా 78 శాతం భూభాగాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించుకున్నదని చెప్పారు. తమ భూభాగాన్ని రక్షించుకునే క్రమంలోనే పాలస్తీనా లిబరేషన ఆర్గనైజేషన్(పీఎల్‌ఓ) పుట్టుకొచ్చిందని గుర్తుచేశారు. ల

శాంతియుత పోరాటానికి ఇజ్రాయిల్ తలొగ్గకపోవ డంతో సాయుధ పోరాటం ద్వారానే తమ దేశాన్ని రక్షించుకోవాలనే దాని నుంచే పలు సంస్థలు పుట్టుకొచ్చా యన్నారు. అందులో ఒకటే హమాస్ అన్నారు. గాజా ప్రాంతంలో హమాస్ ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. ఇజ్రాయిల్, పాలస్తీనా ప్రాంతం యూదులకు మాత్రమే చెందిందనే విషయంలో వాస్తవం లేదని ఇజ్రాయిల్‌లోని ప్రఖ్యాత టెల్‌అవీవ్ విశ్వవిద్యాల యంలో ప్రొఫెసర్లు, ఆర్కిటెక్టులు రాసిన పుస్తకాలను అధ్యయనం చేస్తే అర్థమవుతుం దన్నారు. యూదులు అక్కడి వారు అని చెప్పడానికి ప్రస్తుత రాజకీయ పరిస్థితులు తప్ప చారిత్రక ఆధారాలు లేవన్నారు.

ఆర్టీసి కార్మికులపై వేధింపులు ఆపాలి

- అక్రమ ట్రాన్స్ ఫర్లు, సస్పెన్షన్లు నిలిపివేయాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీ ఆధ్వర్యంలో గురువారం అన్ని డిపోల్లో ఆందోళనలు నిర్వహించామని జేఏసీ చైర్మెన్ కె రాజిరెడ్డి, కన్వీనర్ వీఎస్‌రావు,కో కన్వీనర్ కె యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ ఇవ్వకుండా కార్మికులను అనధికారికంగా బదిలీలు చేస్తున్నారని తెలిపారు.రాఖీ పౌర్ణమి రోజున మహిళా కండక్టర్లకు అదనపు డ్యూటీలతో పాటు నైట్ డ్యూటీలు వేస్తూ వేధిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికైనా వేధింపులు, అక్రమ సస్పెన్షన్లు ఆపాలనీ, నిబంధనలకు విరుద్ధంగా ట్రాన్స్ ఫర్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వేదింపులతో కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాడి సమస్యలు పరిష్కరించుకునేందుకు సిద్ధం కావాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

అభ్యర్థులకు అవగాహనా సదస్సు నిర్వహించండి

- ఏన్సీపీ అధికార ప్రతినిధి వైద్య ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌ని ఎన్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వైద్య ప్రవీణ్‌కుమార్ గురువారం కలిశారు. ఎన్నికల గురించి పలు కార్యక్రమంలు చేపట్టాలని విజ్ఞప్తి చేయడం జరిగింది అలాగే ఏన్సీపీ 119 నియోజకవర్గంలో పోటీ చేస్తునట్టు తెలిపారు. ఈవీఎంలపై జాతీయ పార్టీల తర్వాత ఎన్సీపీకి క్రమ సంఖ్య ను కేటాయించాలని కోరారు. అభ్యర్థులకు జిల్లాల వారీగా శిక్షణ కల్పించాలని సూచించారు. ఓటు హక్కు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

బహుజన రాజ్యాధికారమే మా లక్ష్యం

- ఏస్సీపీ బీఎల్ఎఫ్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్
- ఏస్సీపీ రెండో జాబితాలో 16 మందికి సీట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారమే తమ లక్ష్యమని బీఎల్ఎఫ్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్ అన్నారు. వారికి రాజ్యాధికారం వచ్చినప్పుడే ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో ఉన్న ఓంకార్ భవన్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 16 మంది అభ్యర్థులతో కూడిన బీఎల్ఎఫ్ రెండో జాబితాను ఆయన విడుదల చేశారు. మొదటి జాబితాలో 18 మంది, రెండో జాబితాలో 16 మంది కలిపి మొత్తం 34 మంది జాబితా ఇప్పటి వరకు విడుదలైంది. ఈ సందర్భంగా బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు గాదగోని రవి, దండి వెంకట్, పాండురంగ చారి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు బహుజనులను మోసం చేస్తున్నాయని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ సామాజిక న్యాయానికి వందశాతం పాతరేశాయని చెప్పారు. బీసీల జనాభాకు అనుగుణంగా సీట్లు ఇవ్వకుండా వారిని ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బహుజనులకు వ్యతిరేకంగా ఉండే పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఎఫ్ నాయకులు వనం సుధాకర్, వల్లెపు ఉపేందర్ రెడ్డి, కుంభం సుకన్య, కె మధు, మారోజు సునీల్, వి తుకారాం నాయక్, గడ్డం నాగార్జున, తాండ్ర కళావతి, పల్లె మురళి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర సచివాలయంలో గురువారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేవిధంగా బతుకమ్మ ఉత్సవాలను చేపట్టారు. ఉత్సవాలలో సచివాలయంలోని ఉన్నతాధికారుల నుంచి అన్ని స్థాయిల్లోని మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. ఉద్యోగుల పిల్లలు, చిన్నారులతో ఆటపాటలతో సంబురాలు చేశారు.

కొనసాగుతున్న తనిఖీలు

- రూ.2,43,76,19,296 పట్టివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు కొనసాగుతున్నాయి. అక్టోబర్ 9 నుంచి 19వ తేదీ ఉదయం వరకు తనిఖీల్లో మొత్తం రూ.2,43,76,19,296 విలువైనవి ఖస్వాధీనం చేసుకున్నారు. దీంట్లో రూ.87,92,49,540 నగదు, రూ.10,21,19,390 విలువైన మద్యం, రూ.7,72,97,130 విలువైన మత్తు పదార్థాలు, రూ.1,20,40,71,205 విలువైన బంగారం, వెండి, వాటితో చేసిన ఆభరణాలు, వస్తువులు, రూ.17,48,81,471 విలువైన ల్యాప్‌టాప్‌లు, వాహనాలు, కుక్కర్లు, చీరలు, క్రీడా సామాగ్రి తదితర వస్తువులున్నాయి.

ఏపీకి విద్యుత్ బకాయిలపై కేంద్ర ఆదేశాలు సరికాదు : హైకోర్టు

నవతెలంగాణ -హైదరాబాద్

ఏపీకి విద్యుత్ బకాయిలు చెల్లించాలని తెలంగాణకు కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేసిన కేసులో హైకోర్టు గురువారం తీర్పు చెప్పింది. ఈ నెల 4న హైకోర్టులో వాదనలు ముగియగా, నేడు చీఫ్ జస్టిస్ ఆలోక్ ఆరాదే, జస్టిస్ ఎన్ వి. శ్రవణ్ కుమార్‌తో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. ఏపీకి విద్యుత్ బకాయిలు రూ.3,441. 78 అసలు చెల్లించకపోవడంతో సర్ చార్జి రూ.3,315. 14 కోట్లతో కలిపి మొత్తం రూ. 6,756.92 కోట్లను 30 రోజుల్లో చెల్లించాలంటూ 2022 ఆగస్ట్ 20న కేంద్రం ఉత్తర్వులు ఇచ్చింది. దీనిని తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ విద్యుత్ సంస్థలు హైకోర్టులో సవాల్‌చేశాయి. గతంలో హైకోర్టు స్టే ఇచ్చింది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు తలెత్తితే వాటిని ఇరు ప్రభుత్వాలు చర్చలు, సంప్రదింపులతో పరిష్కరించుకోవాలనీ, అప్పటికీ కొలిక్కి రాకపోతే ఆర్బిట్రేషన్ ద్వారా తేల్చుకోవాలనే నిబంధనను హైకోర్టు ప్రముఖంగా ప్రస్తావించింది. ఈ కారణం గానే కేంద్ర ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్టు వెల్లడించింది. ఆర్బిట్రేషన్ వంటి ఇతర మార్గాలు ఉండగా కేంద్రం నేరుగా వివాద పరిష్కారానికి ఉత్తర్వులు జారీ చేయడం చెల్లదని వెల్లడించింది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 12 ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య వివాదం ఏర్పడితే కేంద్రం జోక్యానికి వీల్లేదని రాష్ట్రం, విద్యుత్ సంస్థలు వాదించాయి. దక్షిణ ప్రాంత మండలిలో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని చెప్పాయి. ఏపీ నుం చి తమకు కూడా వైద్య శాఖ నుంచి బకాయిలు రావాలని చెప్పాయి. కేంద్రం పెత్తనం చేసే క్రమంలోనే ఉత్తర్వులు ఇచ్చిందని,.ఆ ఉత్తర్వులను రద్దు చేయాలన్న వినతిని హైకోర్టు ఆమోదించింది. రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా అంతకు పూర్వం మాదిరిగా విద్యుత్‌ను తెలంగాణకు ఇవ్వాలని కేంద్రం చెప్పినట్లుగా చేశామని, విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో తమ విద్యుత్ సంస్థలు ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిపోతున్నాయని ఏపీ విద్యుత్ సంస్థలు ప్రతివాదన చేశాయి. కేంద్రం చెప్పిందని 2017 వరకు ఏపీ విద్యుత్ సరఫరా చేస్తే తెలంగాణ బకాయిలు ఇవ్వలేదని చెప్పాయి. విద్యుత్, బొగ్గు వంటి అంశాలపై వివాదం ఏర్పడితే కేంద్రం జోక్యం చేసుకోవచ్చునని కేంద్రం వాదించింది. వాదనలపై హైకోర్టు తీర్పు చెబుతూ, తెలంగాణ వాదనలు వినేందుకు కేంద్రం నోటీసు కూడా ఇవ్వలేదని, ఇది చట్ట వ్యతిరేకమని, పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 92 ప్రకారం కేంద్రం ఆదేశాలు, మార్గదర్శకాలు ఇవ్వొచ్చునని, అయితే, ఈ వివాదంలో కేంద్రం ఏకపక్షంగా వ్యవహరించిందని తీర్పు చెప్పింది.

మైనార్టీలకు రూ. 5,000 కోట్ల బడ్జెట్ : సబ్ ప్లాన్ ఏర్పాటు

- కాంగ్రెస్ డిక్లరేషన్ కమిటీ చైర్మెన్ షబ్బీర్ అలీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వచ్చే ఎన్నికల్లో మైనార్టీలకు రూ.5వేల కోట్ల బడ్జెట్‌తోపాటు ఎస్సీ, ఎస్టీ తరహాలో మైనార్టీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేస్తామని టీపీసీసీ మైనార్టీ డిక్లరేషన్ కమిటీ చైర్మెన్ షబ్బీర్ అలీ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మైనార్టీల సాధికారతకు కాంగ్రెస్ మైనార్టీ డిక్లరేషన్ హామీ ఇస్తోందన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఓ హోటల్ మైనార్టీ నాయకులు సమావేశమై... డిక్లరేషన్‌పై వారు చర్చించారు. అనంతరం టీపీసీసీ ఉపాధ్యక్షులు, కమిటీ కన్వీనర్ జాఫర్ జవీన్, ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీఖాన్, షేక్ అబ్దుల్లా సోహైల్, బి. ఎజెకిల్, ఉజ్మా షకీర్, రహీద్ ఖాన్, ఫహీం ఖురేషి, ఎండీ అజ్మతుల్లాతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 150కి పైగా సూచనలు వచ్చాయని వివరించారు. అందులో 15 ప్రముఖ ముస్లిం సంస్థలు నుంచే అందినట్టు తెలిపారు. మత ప్రాతిపదికన వివక్షను అరికట్టడానికి ప్రత్యేక చట్టం చేస్తామన్నారు.

టీఎన్జీవో నూతన అధ్యక్షులుగా మారం జగదీశ్వర్?

- ఎన్నిక లాంఛనమే...
- 30 వరకు సిటీ సివిల్ కోర్టు స్టే
- రాజేందర్ వీఆర్ఎస్‌కు ప్రభుత్వ ఆమోదం
- రేపు కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ల రాజేందర్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ (వీఆర్ఎస్)కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ జి శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శుక్రవారం ఆయన ఉద్యోగం నుంచి రిలీవ్ అవుతారు. టీఎన్జీవో అధ్యక్ష బాధ్యతల నుంచి రాజేందర్ గురువారమే తప్పుకున్నారు. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో ఆ పార్టీలో శనివారం చేరనున్నారు. అయితే టీఎన్జీవో కొత్త అధ్యక్షుని ఎంపిక కోసం గురువారం కార్యవర్గ సమావేశాన్ని సైతం నిర్వహించారు. టీఎన్జీవో అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఎన్నిక చేపట్టకూడదంటూ మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్ ప్రతాప్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. ఈనెల 30 వరకు టీఎన్జీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్నిక చేపట్టొద్దంటూ సంబంధిత కోర్టు స్టే విధించింది. దీంతో ఆ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. అయితే టీఎన్జీవో కేంద్ర సంఘం ఆనవాయితీ ప్రకారం ప్రస్తుతం ప్రధాన కార్యదర్శిగా ఉన్న మారం జగదీశ్వర్ అధ్యక్షులుగా ఎన్నికవుతారని తెలుస్తున్నది. అంతకుముందు కార్యవర్గంలోనూ మారం జగదీశ్వర్ పేరును ఖరారు చేసేందుకు అంతా సిద్ధం చేసినట్టు సమాచారం. కోర్టు స్టే విధించడంతో అధికారికంగా ప్రకటించలేదు. ఆయన ఎన్నిక లాంఛనమేనని తెలుస్తున్నది. ఈనెల 30న మరోసారి టీఎన్జీవో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించి అందులో నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకునే అవకాశమున్నదని ఆ సంఘం సీనియర్ నేతలు చెబుతున్నారు. ఆ తర్వాతే అధికారికంగా ప్రకటిస్తారు. అయితే ప్రస్తుత ప్రధాన కార్యదర్శిగా ఉన్న జగదీశ్వర్ అధ్యక్ష బాధ్యతలను చేపడతారని సమాచారం.

ప్రధాన కార్యదర్శిగా కె లక్ష్మణ్?

టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి పదవిని ఆశించే వారు భారీగానే పోటీ పడుతున్నట్టు తెలుస్తున్నది. ఈనెల 30న టీఎన్జీవో అధ్యక్షులుగా మారం జగదీశ్వర్ ఎన్నిక లాంఛనమే కానుంది. అయితే ప్రధాన కార్యదర్శి పదవి ఎవరిని వరిస్తుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ పదవి కోసం చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నారు. వారిలో కె లక్ష్మణ్, రామినేని శ్రీనివాసరావు, ముజీబ్, ముత్యాల సత్యనారాయణగౌడ్, కస్తూరి వెంకటే శ్వర్లు తదితరులు ఉన్నారు. అయితే సీనియార్టీ ఆధారంగా ప్రధాన కార్యదర్శి పదవిని ఇవ్వాలని కొందరు సీనియర్లు కార్యవర్గం దృష్టికి తెచ్చే అవకాశమున్నది. ప్రస్తుత రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కె లక్ష్మణ్ అందరికంటే సీనియర్‌గా ఉన్నారు. కాబట్టి ఆయనకు ప్రధాన కార్యదర్శి ఇవ్వాలం టూ కొందరు సీనియర్లు, కార్యవర్గ సభ్యులు అభిప్రాయపడుతున్నట్టు తెలిసింది. అయితే పోటీ చేసే వారు అందరూ అంగీకరిస్తే లక్ష్మణ్ ప్రధాన కార్యదర్శి అయ్యే అవకాశాలున్నాయి.

త్వరలో జాబితా విడుదల చేస్తాం

- అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించాం
- రాజాసింగ్ వ్యవహారం పార్టీ అంతర్గత విషయం
- సస్పెన్షన్ ఎత్తివేస్తే పోటీలో ఉంటారు : కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ పార్టీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించామనీ, త్వరలోనే జాబితా ప్రకటిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ముఖ్యనేతలతో సమావేశమవుతామనీ, శుక్రవారం పార్టీ జాతీయ అధ్యక్షులు నడ్డాతో భేటీ ఉంటుందని చెప్పారు. అధిష్టానం సమయమిస్తే పార్లమెంట్ బోర్డు ముందుకి అభ్యర్థుల ఎంపిక అంశం తీసుకెళ్తామన్నారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఎవరో రాసిచ్చిన పేపర్లు చదివారని విమర్శించారు. బీఆర్ఎస్‌కు బీజేపీ బీ టీం అనేది పచ్చి అబద్ధమన్నారు. 2004 ఎన్నికల్లో టీఆర్ఎస్, కాంగ్రెస్ పొత్తు పెట్టుకొని అధికారాన్ని పంచుకున్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్సే.., బీఆర్ఎస్‌కు బీ టీం అన్నారు. సీఎం కేసీఆర్ కుటుంబంతో సహా వెళ్లి సోనియా గాంధీ కాళ్లు మొక్కింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఓటుకు నోటు ఎందుకు తొక్కిపెట్టారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మజ్లిస్‌ను మధ్యవర్తిగా పెట్టుకొని బీఆర్ఎస్ వ్యతిరేక ఓటు బీజేపీకి రాకుండా ప్రయత్నాలు చేస్తున్నారనీ, మూడు పార్టీల డీఎన్ఏ ఒక్కటేనని ఆరోపించారు. ఎవరు ఎవరికి బీ టీం, ఎవరి ఓటు వేస్తే ఎవరికి వెళ్తుందో అనే అంశం పై రాహుల్ గాంధీ చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. టైం, ప్లేస్ చెప్తే తాను వచ్చేందుకు సిద్ధమన్నారు. రాజాసింగ్ వ్యవహారం పార్టీ అంతర్గత అంశమన్నారు. సస్పెన్షన్ ఎత్తివేస్తే ఆయన పోటీలో ఉంటారని చెప్పారు.

శాండ్విక్‌లో సీఐటీయూ ఘన విజయం

భారీ మెజార్టీతో జయ కేతనం

- ఎర్రజెండా పక్షాన కార్మికులు ఉంటారనడానికి ఈ విజయం నిదర్శనం
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, శాండ్విక్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు

ఈ విజయం కార్మికులకే అంకితం



నవతెలంగాణ-పటాన్‌చెరు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ పరిశ్రమలో గురువారం జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ ఘన విజయం సాధించింది. ప్రత్యర్థి హెచ్ఎంఎస్‌పై 106 ఓట్ల మెజార్టీతో విజయ కేతనం ఎగురవేసింది. పరిశ్రమలో మొత్తం 194 ఓట్లకు గాను 192 ఓట్లు పోలయ్యాయి. అందులో 149 ఓట్లు సీఐటీయూకు, 43 ఓట్లు హెచ్ఎంఎస్‌కు వచ్చాయి. దాంతో కార్మికులు పరిశ్రమ ఎదుట విజయోత్సవ సంబురాలు జరిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు మాట్లాడుతూ.. ఈ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో చుక్క గుర్తుకు ఓటు వేసి.. 106 ఓట్ల భారీ మెజార్టీతో గెలిపించిన కార్మికులందరికీ విప్లవ జేజేలు, అభినందనలు తెలిపారు. శాండ్విక్ పరిశ్రమ కార్మిక వర్గానికి రాష్ట్రంలో, పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో ఒక మంచి గుర్తింపు ఉందన్నారు. చారిత్రాత్మక వేతన ఒప్పందాలతో కార్మికుల సంక్షేమం కోసం సీఐటీయూ నిరంతరం పనిచేస్తున్నదన్నారు. కానీ కొంత మంది యాజమాన్యంతో కుమ్మక్కై పోటీ యూనియన్‌ని స్థాపించారని, వారి ఎత్తుగడలు, మోసపూరిత మాటలను కార్మికులు నమ్మలేదని తెలిపారు. యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చి మరిన్ని చారిత్రాత్మకమైన ఒప్పందాలు, సంక్షేమం కోసం పనిచేస్తామన్నారు. ఈ విజయం ప్రత్యర్థు లకు ఒక గుణపాఠం కావాలని, వారి ఆరోపణలు అవాస్తవ మని కార్మికులు గుర్తించారన్నారు. కార్మికులు ఎర్రజెండా పక్షాన ఉన్నారనటానికి ఇదే నిదర్శనమన్నారు. కార్య క్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్, జిల్లా అధ్యక్షులు మల్లేశం, రాష్ట్ర కమిటీ సభ్యులు పాండు రంగారెడ్డి, జిల్లా నాయకులు సాయిలు, నరసింహారెడ్డి, రాజయ్య, వాజిద్ అలీ, శాండ్విక్ యూనియన్ ప్రధాన కార్య దర్శి మనోహర్, వివిధ పరిశ్రమల సీఐటీయూ కార్మికనాయ కులు, కార్మికులు సాండ్విక్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



తెలంగాణ పూల పండుగ దేశానికే ఆదర్శం

- ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు

నవతెలంగాణ-అమీన్‌పూర్/మియాపూర్

తెలంగాణ పూల పండుగ 'బతుకమ్మ' దేశానికే ఆదర్శమని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి అన్నారు. సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్ మున్సిపాల్టీలోని బీరంగూడ శివాలయం చౌరస్తాలో సీఐటీయూ, ఐద్వా కమిటీల ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ వేడుకలో మల్లు లక్ష్మి పాల్గొని స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు మహిళలకు తగినంత గౌరవం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సింహారెడ్డి, వివిధ కాలనీల మహిళలు పాల్గొన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక నెమలినగర్, పీజేఆర్‌నగర్, గచ్చిబౌలి ప్రాంతాల నుంచి మహిళలు పాల్గొని బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా పాల్గొన్న అరుణజ్యోతి మాట్లాడుతూ.. బతుకమ్మ గొప్పతనాన్ని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై జరుగుతున్న హింసలను అరికట్టడంలో వెనకబడ్డాయని విమర్శించారు. అందుకు ఉదాహరణే మణిపూర్ ఘటన అని తెలిపారు. మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం అవసరం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిర్వహణ బాధ్యులు మంజుల, సుజాత, సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు విజయ్ కుమార్, రవీందర్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే కార్మిక సమస్యలు పరిష్కారం

- సింగరేణి ప్రయివేటీకరణను కాంగ్రెస్ అడ్డుకుంది
- సింగరేణి ఎన్నికలు జరగాలంటే.. కాంగ్రెస్ అధికారంలోకి రావాలి
- భూపాలపల్లిలోని సింగరేణి 1వ ఇంక్లైవ్ వద్ద.. : టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-భూపాలపల్లి

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే కార్మిక సమస్యలు పరిష్కారం అవుతాయని, తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర మరువలేనిదని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి అన్నారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లాలోని 1వ ఇంక్లైన్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని జెండాలను ఎజెండాలను పక్కనబెట్టి పోరాడితేనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కల సాకారమైందని గుర్తుచేశారు. కార్మికుల త్యాగాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. కార్మికుల వైపు ఉన్నామనేది వాళ్లే, ప్రభుత్వంలో ఉన్నది వాళ్లే, సమస్యలు పరిష్కరించకుండా జాప్యం చేస్తున్నది వాళ్లే అనేది గుర్తుంచుకోవాలన్నారు. ఒకే ఒక్క అధికారిని సింగరేణికి పెట్టి, దివాళా తీయించారని, ఇప్పటికీ ఆ తప్పులను కప్పిపుచ్చుకుంటున్నారని ఆరోపించారు. సింగరేణిని ప్రయివేటుపరం చేయడానికి బీఆర్ఎస్ ఒప్పుకుంది నిజం కాదా అని ప్రశ్నించారు. అరబిందోకు మైన్ అప్పగించి, తాడిచర్ల మైన్‌ను వారి అనుయాయులకు అప్పగించి, నైని కోల్‌మైన్‌ను అదానీకి కట్టబెట్టాలని చూసింది నిజం కాదా అని ప్రశ్నించారు. మైన్‌ను ప్రయివేట్‌పరం చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డుకున్నదని తెలిపారు. డిసెంబర్ 27న సింగరేణి ఎన్నికలు జరగాలంటే డిసెంబట్ 3న కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, తెలంగాణ సాధించిన కార్మికులుగా మిమ్మల్ని గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకుందని తెలిపారు. తెలంగాణను గుల్ల చేసిన రాష్ట్రంలోని పందికొక్కుల పని పట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావును అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు, మధుయాష్కీ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఐఎన్‌టీయూసీ నాయకులు జోగబుచ్చయ్య, వసునూటి రాజేందర్‌తోపాటు కార్మిక సంఘాల నాయకులు, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

ఐసెట్‌లో 27,075 మందికి సీట్ల కేటాయింపు

- ఇంకా మిగిలిన సీట్లు 5,224
- ఎంబీఏలో 84.15 శాతం, ఎంసీఏలో 82.20 శాతం సీట్లు భర్తీ
- 29 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్‌కు గడువు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం ఐసెట్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఐసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంబీఏ, ఎంసీఏ కలిపి ఐసెట్‌లో 32,299 సీట్లుంటే, 27,075 (83.83 శాతం) మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. ఐసెట్‌లో ఇంకా 5,224 (16.17 శాతం) సీట్లు మిగిలిపోయాయని వివరించారు. ఎంబీఏలో 26,951 సీట్లుంటే, 22,679 (84.15 శాతం) మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. ఇంకా 4,272 (15.85 శాతం) సీట్లు మిగిలిపోయాయని పేర్కొన్నారు. ఎంసీఏకు సంబంధించి 5,348 సీట్లుంటే, 4,396 (82.20 శాతం) మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. 952 (17.8 శాతం) సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద 1,032 మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు తప్పనిసరిగా వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. అందుకోసం ఈనెల 29 వరకు గడువుందని పేర్కొన్నారు. లేదంటే ఆ సీట్లు రద్దయిపోతాయని తెలిపారు. కేటాయించిన కాలేజీల్లో ఈనెల 30,31 తేదీల్లో రిపోర్టు చేయాలని కోరారు. ఇతర వివరాలకు https://tsicet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

వికలాంగులపై కేటీఆర్ వ్యాఖ్యలు అనుచితం

- అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక అధ్యక్షులు కె నాగేశ్వరరావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగులపై మంత్రి కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశారనీ, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిలభారత వికలాంగుల హక్కుల వెదిక జాతీయ అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వికలాంగుల కృతజ్ఞతా సభలో కేటీఆర్ మాట్లాడుతూ వికలాంగులను కేవలం పెన్షన్‌తో ముడిపెట్టి మాట్లాడారని తెలిపారు. అనేక మంది వికలాంగులు నిరుద్యోగంతో బాధపడుతున్నారని తెలిపారు. స్వయం ఉపాధి లేక , ఉద్యోగాలు లేక తీవ్ర కష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో వికలాంగులకు ఐదు శాతం ఇవ్వకుండా దాటవేశారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో 5.7లక్షల మంది వికలాంగుల సమస్యలను పరిష్కరించేవారికే ఓటు వేస్తామని తెలిపారు.



లంచం తీసుకుంటూ పట్టుబడిన ఇండస్ట్రియల్ మేనేజర్

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రగతిభవన్ వద్ద ఇండస్ట్రియల్ మేనేజర్ గంగాధర శ్రీనివాస్ గురువారం రూ.15,000 లంచం తీసుకుంటుండగా అధికారులు దాడులు చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ములుగుకు చెందిన గుగులోతు లచ్చిరాం జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా గతేడాది రూ.53 లక్షలకు అశోక్ లేలాండ్ వాహనాన్ని కొనుగోలు చేశారు. దానికి సంబంధించి సబ్సిడీ కోసం లచ్చిరాం కొద్ది రోజుల కిందట జిల్లా పరిశ్రమల శాఖలో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస్. లచ్చిరాం నుంచి మొదట రూ. 50వేలు తీసుకున్నాడు. అనంతరం మళ్లీ రూ.60 వేలు కావాలని డిమాండ్ చేయడంతో లచ్చిరాం ఏసీబీ అధికారులను సంప్రదించారు. ఈ క్రమంలో గురువారం లచ్చిరాం రూ.15వేలు ఇస్తుండగా జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతడిని హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్టు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట.. తండ్రి కొడుకుల ఆత్మహత్యాయత్నం



నవతెలంగాణ-రఘునాథపాలెం

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం తహసీల్దార్ అక్రమంగా తమ భూమిని రిజిస్ట్రేషన్ చేస్తున్నారంటూ తండ్రీ కొడుకులు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుడిదంపాడు గ్రామ పంచాయతీకి చెందిన దుదుకురి షాజీరావు, అతని కుమారుడు విద్యాసాగర్ 2005లో మంచుకొండ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 231/ఆ/1లోని 1.26 ఎకరాలు, 233/అ లోని 2.39 ఎకరాలతో కలిపి మొత్తం 4.24 ఎకరాల భూమిని కొనుగోలు చేసి, రెవెన్యూ కార్యాలయం నందు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అప్పటి నుంచి ఈ భూమి వారి ఆధీనంలో ఉంది. నాటి నుంచి భూమిని కౌలుకు ఇస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం 2017లో ప్రతి రైతుకు సాగులో ఉన్న భూముల కొత్త పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయగా.. దాని కోసం ఈ తండ్రి కొడుకులు అప్పటి వీఆర్వోకు దరఖాస్తు చేసుకున్నారు. కాగా కేవలం 3 ఎకరాలకే పట్టాదారు పాస్ పుస్తకాన్ని మంజూరు చేశారు. మిగతా 1.24 ఎకరాల భూమి పాసుపుస్తకంలో ఎక్కలేదు. అప్పటి నుంచి రఘునాథపాలెం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్నా పని కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా 2017లో ఈ తండ్రి కొడుకులు అదే గ్రామానికి చెందిన తుమ్మలపల్లి మోహన్ రావు దగ్గర కొత్త డబ్బు అప్పుతీసుకున్నారు. దానికోసం ఖాళీ దస్తావేజుపై సంతకాలు పెట్టించుకున్నారు. ఆ వ్యక్తి ఆ దస్తావేజులపై 2 ఎకరాల భూమి రాయించుకొని అక్రమంగా సాదా బైనామా ద్వారా పట్టాదారు చేయించుకున్నాడని ఆరోపిస్తున్నారు.

ఈ భూములు కోర్టు కేసులో ఉన్నాయని తహసీల్దార్‌కి అభ్యంతరాలు పెట్టామన్నారు. కానీ ఆ సర్వే నెంబర్‌లోని 22 గుంటల భూమిని గురువారం వేరే వ్యక్తికి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించడానికి అప్పిచ్చిన వ్యక్తి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. విషయం తెలుసుకున్న తండ్రి కొడుకులు ఇద్దరూ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి అడ్డుకున్నా వినకపోవడంతో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీధర్‌ను కలిసి ఉన్న విషయాన్ని వివరించారు. కాగా, దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. తుమ్మలపల్లి మోహన్ రావు అనే వ్యక్తికి పట్టాదారు పాసు పుస్తకం ఉన్నది. కాబట్టి రిజిస్ట్రేషన్ చేస్తున్నామని తెలిపారు. స్లాట్ బుకింగ్ చేసిన దానిలో సర్వే నెంబర్లు వేరే ఉన్నాయని, తండ్రీకొడుకులు చెబుతున్న సబ్ నెంబర్లు వేరే అని తెలిపారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారు చెప్పిన విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

లీడర్లు కలిసిండ్రు.. క్యాడర్‌ను మరిసిండ్రు..

ప్రచారానికి దూరంగా ఎమ్మెల్సీ అనుచరులు

- గులాబీ కోటలో ఆరని మంటలు
- అసంతృప్తి వాదులతో ఎమ్మెల్సీ సమాలోచనలు
- దసరా నాటికి సమస్య పరిష్కారంపై దృష్టి



నవ తెలంగాణ మహబూబాబాద్

గులాబీ కోటలో అసంతృప్తి మంటలు రగులుతూనే ఉన్నాయి. నాయకుల మధ్య వైరం ముగిసినప్పటికీ కార్యకర్తల్లో కయ్యం కొనసాగుతోంది. మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్‌ను తిరిగి అభ్యర్థిగా సీఎం కేసీఆర్ ప్రకటించి బీఫారం ఇచ్చినప్పటికీ అసమ్మతివాదులు ఏ మాత్రం తగ్గడం లేదు. తమను అనేక అవమానాల పాలు చేసి గాలికి వదిలేసిన ఎమ్మెల్యే శంకర్ గెలుపు కోసం ఎలా పనిచేయాలని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

మహబూబాబాద్ నియోజకవర్గంలో 2014, 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ వరుసగా గెలుపొందారు. 2023 ఎన్నికల్లో కూడా హ్యాట్రిక్ కొట్టి, మంత్రి పదవి సాధించాలనే జోరు మీద శంకర్ నాయక్ ఉన్నారు. అయితే నియోజకవర్గంలో దశాబ్ద కాలంగా ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావు మధ్య ఉన్న విభేదాలు పలు సందర్భాల్లో బట్టబయలయ్యాయి. గతేడాది దసరా సందర్భంగా ఎంపీ అనుచరులు కట్టిన బ్యానర్లను ఎమ్మెల్యే అనుచరులు చించి వేశారు. దాంతో ఎంపీ అనుచరుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా జరిగిన గులాబీ పార్టీ ధర్నాలో ఎంపీ, ఎమ్మెల్యే పరస్పరం మైక్ విషయంలో గొడవపడ్డారు. ఈ గొడవ సద్దుమణిగిందనుకునే లోపే ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అనుచరుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి వచ్చింది. దానికి తోడు మానుకోటలో తెలంగాణ ఉద్యమాకారులు ఎమ్మెల్యే శంకర్ నాయక్‌పై సమావేశాల్లో బహిరంగంగానే అసంతృప్తి వెళ్లగక్కారు. మూడు నెలలుగా ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావు అనుచరులు మహబూబాబాద్, కేసముద్రం, నెల్లికుదురు మండలాల్లో సమావేశాలు నిర్వహించారు. ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌కు టికెట్ ఇవ్వొద్దంటూ సర్పంచులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వివిధ ప్రజా సంఘాల పార్టీ అనుబంధ సంఘాల నాయకులు బహిరంగంగానే విమర్శలు చేశారు. అనూహ్యరీతిలో ఎమ్మెల్యే శంకర్ నాయక్ టికెట్ సాధించి బీఫారం తెచ్చుకున్నారు. ఎమ్మెల్యే, మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీ నాయకులను కలిసి వారి మద్దతు కోరారు. ఇందుకు వారు కూడా సంఘీభావం తెలిపి ప్రచారంలో పాల్గొంటామని హామీనిచ్చారు.

ఎమ్మెల్యే గెలుపునకు ప్రయత్నించేనా?

మహబూబాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మంత్రి సత్యవతి రాథోడ్, కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు నియమితులయ్యారు. ఇల్లందులో నవంబర్ 1న సీఎం బహిరంగ సభ ఉన్నందున ఎంపీ మాలోత్ కవిత అక్కడి ఏర్పాట్లలో ఉన్నారు. ఈ క్రమంలో భవిష్యత్‌లో ఆ ముగ్గురు ఇక్కడ ప్రచారంలో పాల్గొనే పరిస్థితి లేదు. కాగా, ఇక్కడ వారి అనుచరులు ఎమ్మెల్యే శంకర్ నాయక్ గెలుపు కోసం ఏ మేరకు ప్రయత్నం చేస్తారు.. ప్రచారం చేస్తారా.. లేదా.. అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల జరిగిన రెండు, మూడు ప్రచార సభల్లో ఎంపీ, ఎమ్మెల్సీ హాజరై మాట్లాడారు. ఆ సభలూ సమావేశాలకు అసంతృప్తివాదులు, ఉద్యమకారులు, ఎమ్మెల్సీ అనుచరులు హాజరు కాలేదు. కొంతమంది కౌన్సిలర్లు కూడా డుమ్మా కొట్టారు. ఈ విషయాన్ని శంకర్ నాయక్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం.

కక్ష సాధింపులకు పోతే పరిస్థితేంటీ?

అప్రమత్తమైన ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు తన అనుచరులు, ఉద్యమకారులతో సమావేశం నిర్వహించారు. వారంతా తమకు జరిగిన అవమానాలను ఏకరువు పెట్టారు. అధికార పార్టీలో ఉన్నప్పటికీ తమ వార్డు సమావేశాల్లో అభివృద్ధి పనుల్లో ఎమ్మెల్యే తమకు నిధులు కేటాయించకుండా అడ్డుకున్నారని, కేసులు నమోదు చేయించారని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. భవిష్యత్తులోనూ ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలు చేపడితే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు తమకు స్పష్టమైన హామీ వస్తే తప్ప ఎమ్మెల్యేకు అనుకూలంగా ప్రచారంలోకి దిగేది లేదంటూ తేల్చి చెప్పారు. నాయకులందరూ కలిసిపోయారని, తమ పరిస్థితి ఏంటంటూ ప్రశ్నించారు. ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి దసరా తర్వాత అసంతృప్తి వాదులందరినీ ఏకతాటి పైకి తీసుకురావడానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ భావి స్తున్నట్టు సమా చారం. కాగా ఎమ్మెల్సీ తక్కెళ్ళ పల్లి రవీందర్‌రావు బుజ్జగింపు చర్యలు ఏ మేరకు పనిచేస్తాయి? అసంతృప్తి నేతలు, ఉద్యమకారులకు ఎలాంటి హామీలు ఇస్తారనేది వేచి చూడాల్సిందే.

రూ. కోటి 11 లక్షల గంజాయి పట్టివేత

మరోచోట రూ.60లక్షల గంజాయి స్వాధీనం



నవతెలంగాణ-హయత్ నగర్

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాచకొండ కమిషనరేట్ పరిధిలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఎల్బీ నగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను రాచకొండ సీపీ దేవేందర్ సింగ్ చౌహన్ వెల్లడించారు.

కర్ణాటకకు చెందిన మోహన్ రాథోడ్ గతంలో గంజాయి కేసులో నిందితుడు. అయితే నాచారానికి చెందిన పెద్ద బాబురావు, సికింద్రాబాద్‌కు చెందిన మద్దెల రమేష్, కర్ణాటకకు చెందిన బహుళ్య లీలావతి అలియాస్ గంగరాజు, సంతోష్‌తో కలిసి మోహన్ విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తరలిస్తున్నాడు. హైదరాబాద్‌లో అధిక ధరకు విక్రయించేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు.

ఒడిశా నుంచి హైదరాబాద్‌కు, ఆ తర్వాత కర్ణాటక, ఇతర రాష్ట్రాలకు చేరవేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం అందుకున్న మల్కాజిగిరి ఎస్ఓటీ, కీసర పోలీసులు కలిసి ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద పట్టుకున్నారు. వారి నుంచి 430 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ కోటి 11లక్షల రూపాయలు ఉంటుందని సీపీ చెప్పారు. ఇద్దరు నిందితుల నుంచి 430కేజీల గంజాయి, కారు, ఇనుప రాడ్లు, రూ.2170, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్టు సీపీ చెప్పారు. సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ జానకి, మల్కాజిగిరి ఎస్ఓటీ డీసీపీ గిరిధర్, కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, మల్కాజిగిరి ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ రాములు, వాసుదేవ్, పరమేశ్వర్ తదితరులు ఉన్నారు.

మరోచోట 200 కేజీల గంజాయి పట్టివేత

మరో చోట ఒడిశా ఒరిస్సా నుంచి ఢిల్లీకి 200 కేజీల గంజాయి తరలిస్తుండగా హయత్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను సీపీ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నానికి చెందిన ప్రధాన సూత్రధారి అయిన నూకరాజు, ఇదే రాష్ట్రానికి చెందిన గంట శ్రీనుబాబు, ఈస్ట్ గోదావరికి చెందిన అక్కబాతుల లక్ష్మణ కుమార్‌తో కలిసి గంజాయిని వ్యర్థ రసాయన డీసీఎం(కెమికల్ ట్యాంక్)లో పూణే, మహారాష్ట్ర, రంపచోడవరానికి తరలించారు. గురువారం ఒడిశా నుంచి ఖమ్మం, సూర్యాపేట మీదుగా ఢిల్లీకి తరలిస్తుండగా హయత్‌నగర్ వద్ద పట్టుబడ్డారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పెద్ద అంబర్‌పేట ఓఆర్ఆర్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించగా డీసీఎం ట్యాంకర్‌లో 200కేజీల గంజాయి లభ్యమైంది. దాని విలువరూ. 60 లక్షల 10వేలు ఉంటుందని సీపీ తెలిపారు. ఈ సమావేశంలో ఎల్బీనగర్ జోన్ డీసీపీ సాయిశ్రీ, ఎల్బీ నగర్ జోన్ ఎస్ఓటీ డీసీపీ మురళీధర్, వనస్థలిపురం ఏసీపీ భీమ్ రెడ్డి ఉన్నారు.

అనుమతుల్లేని వెలిగొండ

ప్రాజెక్టు నిర్మాణం ఆపాలి ...

- కృష్ణాబోర్డుకు సర్కారు మరో లేఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

భవిష్యత్తులో ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేసేసమయంలో బేసిన్‌లోని ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని కృష్ణా ట్రిబ్యునల్-1 (బచావత్ ట్రిబ్యునల్) అవార్డులో పేర్కొన్నా ఏపీ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని రాష్ట్ర ప్రభుత్వం కృష్ణాబోర్డుకు రెండోసారి లేఖ రాసింది. ఈమేరకు రాష్ట్ర సాగునీటి పారుదల, ఆయకట్టు శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.మురళీధర్ నాలుగు పేజీల లేఖను ఇటీవల కృష్ణాబోర్డు చైర్మెన్‌కు పంపారు. . తదనుగుణంగానే, బచావత్ ట్రిబ్యునల్ సెప్టెంబర్ 1960 తరువాత చేపట్టిన ప్రాజెక్టులకు కేటాయింపులు చేసినప్పుడు, కేవలం కృష్ణా నది బేసిన్ లోపలి ప్రాజెక్టులకు మాత్రమే నీటి కేటాయింపులు చేసిందని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, బచావత్ ట్రిబ్యునల్ అవార్డుకు వ్యతిరేకంగా, వెలిగొండ ప్రాజెక్టు లాంటి కృష్ణా బేసిన్ ఆవలి ప్రాజెక్టులను, మిగులు జలాలను కేటాయించిందని లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల వల్ల, బేసిన్ లోని కరువు ప్రాంతాలకు నీరందించే తెలంగాణ ప్రాజెక్టులు (ఇప్పటికే నిర్మించినవి, నిర్మాణంలో ఉన్నవి) నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల శ్రీశైలం రిజర్వాయర్ నుంచి రోజుకు ఒక టీఎంసీ చొప్పున బేసిన్ ఆవలకు నీటిని మళ్లించే వెలిగొండ ప్రాజెక్టును వెంటనే నిలువరించాలని కృష్ణా బోర్డుని తెలంగాణ కోరింది. ఏపీ చర్య మూలంగా నాగార్జునసాగర్, శ్రీశైలం పరిధిలోని స్థిరికరించిన ఆయకట్టుతోపాటు హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలకు నష్టం జరుగుతుందని తెలియజేశారు. కేంద్రం గతంలో చెప్పినా ఏపీ అలాగే ముందుకుపోవడాన్ని ఖండించారు. బచావత్ ట్రిబ్యునల్, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం, అనుమతులన్నీ లభించాకే వెలిగొండ ప్రాజెక్టును చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం బోర్డును కోరింది. పరిపాలన ఇనుమతులు ఇవ్వడాన్ని తప్పుబట్టింది.

ఏసీబీకి చిక్కిన టౌన్ ప్లానింగ్ అధికారి

- ఇంటి నిర్మాణ అనుమతికి రూ.1.5లక్షల లంచం

నవతెలంగాణ -ఎల్బీనగర్

ఇంటి నిర్మాణ అనుమతుల కోసం వెళ్లిన ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటున్న టౌన్ ప్లానింగ్ అధికారిని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి..

రంగారెడ్డి జిల్లా గుర్రంగూడకు చెందిన జక్కిడి సుధాకర్ రెడ్డి వనస్థలిపురంలో వద్ద ఓ ఇంటిని నిర్మిస్తున్నాడు. ఈ మేరకు నిర్మాణ అనుమతుల కోసం హయత్‌నగర్ సర్కిల్‌టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ఉమను కలిశాడు. అందుకు ఆమె రూ.2 లక్షలు డిమాండ్ చేయగా రూ 1.5 లక్షలకు ఒప్పందం కుదిరింది. అనంతరం సుధాకర్ రెడ్డి ఏసీబీ అధికారులను సంప్రదించాడు.

వారు చెప్పినట్టు పథకం ప్రకారం సరూర్‌నగర్‌లోని జీహెచ్ఎంసీ కార్యాల యంలో డబ్బులను గురువారం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి లక్ష్మణ్‌కు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. టీపీఓ ఉమ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి లక్ష్మణ్‌ను అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అనంతరం వారిని కోర్టులో హాజరు పరిచారు. టౌన్ ప్లానింగ్ అధికారులు లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు.

సంపాదకీయం


ఇజ్రాయెల్ మారణకాండ!

పాలస్తీనాలోని గాజా ప్రాంతంపై మారణకాండ సాగిస్తున్న ఇజ్రాయెల్‌కు మద్దతు పలికేందుకు బుధవారం నాడు అమెరికా అధినేత జో బైడెన్ వచ్చి వెళ్లాడు. అతగాడి అడుగులో అడుగు వేస్తూ బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ గురువారం నాడు వెళ్లి, మేము కూడా మీతోనే ఉన్నాము అని చెప్పాడు. పశ్చిమదేశాల వారు రోజూ హక్కుల గురించి పేజీలకు పేజీలు సుభాషితాలు, మానవత్వం గురించి కడవల కొద్దీ కన్నీరు కారుస్తుంటారు. పచ్చి దుర్మార్గాలకు

> 1947లో ఐరాస తీర్మానం చేసినప్పటి నుంచి అంతకు ముందే శిక్షణ పొంది సిద్ధంగా ఉన్న ఇజ్రాయెల్ సాయుధ మూకలు పాలస్తీనా ప్రాంతాలపై దాడులకు దిగి అరబ్బులను తరిమివేసి వేలాది మందిని హత్య చేసిన దుర్మార్గం తెలిసిందే. దొంగే దొంగ అన్నట్లుగా తానే దాడులు చేస్తూ, ప్రాంతాలను ఆక్రమిస్తూ తనకు రక్షణ కావాలంటూ అప్పటి నుంచి ఆడుతున్న నాటకాలకు అమెరికా మొదటి నుంచీ మద్దతు ఇస్తోంది. ఇప్పటికీ అదే పాట పాడుతోంది. భారీ ఎత్తున నిధులు, ఆయుధాలు అందచేస్తున్న ఏకైక దేశంగా ఉన్న సంగతి తెలిసిందే.

పాల్పడతారు, దురాగతాలను సమర్థిస్తారు. గాజా లోని ఒక ఆసుపత్రి మీద ఇజ్రాయెల్ విమానాలు బాంబులు వేసి 471 మంది రోగులు, సిబ్బందిని చంపిన తరువాత కూడా మేము మీతోనే ఉన్నాము, మీరింకా మరిన్ని జాగ్రత్తలు తీసుకొని పెద్దఎత్తున మరిన్ని తీవ్ర దాడులు చేయండి, హమాస్ సాయుధులను అణచి వేయండి అని యూదు దురహంకారులకు వత్తాసు పలకటంకంటే మరొక అమానుషం లేదు. ఇలాంటి వారు గనుకనే మానవతా కారణాలతో దాడులను ఆపివేయాలని భద్రతా మండలిలో గడచిన మూడు రోజుల్లో పెట్టిన రెండు తీర్మానాల్లో ఒకటి వీగిపోగా, రెండవ దాన్ని అమెరికా వీటో చేసింది. ఇజ్రాయెల్ దాడులను పూర్తిగా సమర్థిస్తున్నట్లు బైడెన్ నిస్సిగ్గుగా చెప్పాడు. 2001లో న్యూయార్క్ ప్రపంచ వాణిజ్య కేంద్రంపై దాడి సందర్భంగా తాము చేసిన పొరపాట్లను పునరావృతం కానివ్వవద్దని కూడా సలహా ఇచ్చాడు.

గాజా ప్రాంతంలోని అల్ అహిల్ ఆసుపత్రి మీద పాలస్తీనా తీవ్రవాదులే దాడి చేశారంటూ ఇజ్రాయెల్ చేస్తున్న ప్రచారాన్ని పశ్చిమదేశాల మీడియా అందుకుంది. ఆసుపత్రి మీద దాడి అంతర్జాతీయ యుద్ధనేరం గనుక అలాంటి ప్రకటనను ముందే సిద్ధం చేసి పెట్టుకుందన్నది స్పష్టం. దాని చరిత్ర తెలిసిన వారికి ఆశ్చర్యం కలిగించటం లేదు, కట్టుకథలను ఎవరూ నమ్మటం లేదు. ఆసుపత్రిపై బాంబులతో సహా తాజా దాడుల్లో మొత్తం 750 మంది పిల్లలు మరణించినట్లు చెబుతున్నారు. బైడెన్ వచ్చి వెళ్లిన తరువాత ఇజ్రాయెల్ దాడులను పెంచింది, దానికి ప్రతిగా ఇతర ప్రాంతాల్లో ఉన్న పాలస్తీనియన్ల బృందాలు కూడా దాడులు చేస్తున్నట్లు వార్తలు. తన అష్టదిగ్బంధంలో ఉన్న గాజాలోని 23లక్షల మంది పౌరులకు విద్యుత్, మంచినీటితో సహా అన్ని రకాల సరఫరాలను ఇజ్రాయెల్ నిలిపివేసింది. బాంబు దాడుల్లో వందలాది మరణించగా వేలాది మంది గాయపడ్డారు. వారికి అవసరమైన ఔషధాలు, ఇతర సరఫరాలు చేసేందుకు మానవతా పూర్వకంగా దాడులను నిలిపివేయాలని ఇజ్రాయెల్‌ను ఆదేశించేందుకు భద్రతా మండలిలో బుధవారం నాడు బ్రెజిల్ పెట్టిన తీర్మానాన్ని మొత్తం 15కు గాను 12 మంది సమర్థించగా దాన్ని చెల్లకుండా అమెరికా వీటో చేసింది. అంతకుముందు సోమవారం నాడు మానవతా



పూర్వక కారణాలతో దాడులను నిలిపి వేయాలని కోరుతూ రష్యా ప్రవేశపెట్టిన తీర్మానానికి చైనా మరో మూడు దేశాలు మద్దతు పలకగా నాలుగు దేశాలు వ్యతిరేకించాయి, ఆరుగురు ఓటింగ్‌లో పాల్గొనకపోవటంతో అది వీగిపోయింది. బ్రెజిల్ ప్రవేశ పెట్టిన తీర్మానంలో పౌరులపై దాడులు ఆపాలని, కాల్పులను విరమించాలనే అంశం లేదంటూ వాటిని చేర్చాలని రష్యా ప్రతిపాదించిన రెండు సవరణలు వీగిపోయాయి. దాంతో తీర్మానం వృథా అంటూ ఓటింగ్‌కు వెళ్లలేదు. ఇజ్రాయెల్ ఆత్మరక్షణ హక్కు గురించి పేర్కొనలేదు గనుక తాము వీటో చేస్తున్నట్లు అమెరికా పేర్కొన్నది. ఆ సాకునే చెబుతూ బ్రిటన్ ఓటింగ్‌లో పాల్గొనలేదు.

1947లో ఐరాస తీర్మానం చేసినప్పటి నుంచి అంతకు ముందే శిక్షణ పొంది సిద్ధంగా ఉన్న ఇజ్రాయెల్ సాయుధ మూకలు పాలస్తీనా ప్రాంతాలపై దాడులకు దిగి అరబ్బులను తరిమివేసి వేలాది మందిని హత్య చేసిన దుర్మార్గం తెలిసిందే. దొంగే దొంగ అన్నట్లుగా తానే దాడులు చేస్తూ, ప్రాంతాలను ఆక్రమిస్తూ తనకు రక్షణ కావాలంటూ అప్పటి నుంచి ఆడుతున్న నాటకాలకు అమెరికా మొదటి నుంచీ మద్దతు ఇస్తోంది. ఇప్పటికీ అదే పాట పాడుతోంది. భారీ ఎత్తున నిధులు, ఆయుధాలు అందచేస్తున్న ఏకైక దేశంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈజిప్టు నుంచి మానవతా పూర్వక సాయాన్ని అందించేందుకు ఇజ్రాయెల్‌ను ఒప్పించినట్లు, జో బైడెన్ తిరుగు ప్రయాణంలో విలేకర్లతో చెప్పాడు. ప్రపంచ మంతటా పెరుగుతున్న ఒత్తిడి మేరకు విధిలేక జరిగింది తప్ప అమెరికా మారుమనసు పుచ్చుకొన్న ఫలితం కాదు. చివరికి ఇజ్రాయెల్‌ను సమర్థిస్తున్న భారత ప్రధాని నరేంద్రమోడీ కూడా కారకులు ఎవరో చెప్పకుండా ఆసుపత్రిపై బాంబుదాడిని ఖండించాల్సి వచ్చింది. అరబ్బు దేశాలలో ఉన్న చీలిక కారణంగానే అమెరికా, ఇజ్రాయెల్ ఆటలు సాగుతున్నాయి. పాలస్తీనియన్లు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోంది. ఎంతగా అణచివేసినా వారిలో స్వాతంత్ర్య కాంక్షను అణచటం ఎవరి తరమూ కాదు. యావత్ నాగరిక ప్రపంచమూ వారికి అండగా ఉంటుంది.



'సుప్రీం' తీర్పునూ గౌరవించరా!?

ఇల్లు.. జర్నలిస్టులకు చిరకాల స్వప్నం. జీవితంలో స్థిర పడ్డారని చెప్పుకోవడానికి సాధారణంగా అందరూ ఇంటినే గీటురాయిగా భావిస్తారు. పరస్పరం కలిసి కరచాలనం చేసే క్రమంలోనూ 'ఇల్లు' కట్టుకున్నావా? అని అడుగుతుంటారు. ఇది అందరికీ తెలిసిందే. ఉమ్మడి రాష్ట్రంతో పాటు తెలంగాణలోనూ జర్నలిస్టులకు ఇండ్లు, ఇంటిస్థలం కలే అవుతున్నది. తెలంగాణ సాకారమై దాదాపు పదేండ్లు పూర్తవుతున్నది. కాగా తెలంగాణ జర్నలిస్టులు ఇండ్లు కట్టుకుని తమ జీవనయానాన్ని కొంతలో కొంతైన కుటుంబంతో కలిసి విలాసంగా కాకపోయినా, సంతోషంగా ఉండాలని ఓ చిన్ని ఆశ. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర ఎనలేనిది. మరువలేనిది. ఎవరూ కాదనలేనిది. ప్రాణాలకు సైతం వెరవకుండా ప్రజల ఆకాంక్షను నిజం చేయడంలో పాత్రికేయుల సాహసం అంతా ఇంతా కాదు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియా, జర్నలిస్టులను పట్ల ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదు. కానీ రాష్ట్రంలోని జర్నలిస్టులకు నివాసం నేతిబీర చందమవుతున్నది. దాదాపు 60 వేల మందికి పైగా జర్నలిస్టులు ఉంటే, వారిలో సగం మందికి కూడా అక్రిడిటేషన్ కార్డులు లేవు. వారి కుటుంబాలతో కలిసి లక్షన్నరకు పైగా జనాభా ఉంది. వారంతా ఇంటి అద్దెలు కట్టలేక తీవ్రమైన ఆర్థిక భారాన్ని ఏండ్లతరబడి మోస్తున్నారు. ఇక చిన్న, మధ్యతరహా పత్రికల్లో పనిచేసే జర్నలిస్టుల పరిస్థితి వర్ణణాతీతం. మహిళా జర్నలిస్టుల ఇబ్బందులు చెప్పనలవి కాదు. ఉమ్మడి రాష్ట్రంలో మూడు సార్లు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించారు. 1978, 1982, 1994లో దాదాపు 850 మందికి అప్పటి ప్రభుత్వాలు ఇచ్చాయి.



బి.బసవపున్నయ్య
9490099108

కాగా తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కొంతమేర ప్రయత్నం చేసినా అది కార్యరూపం దాల్చలేదు. వేలాదిమంది అర్హులైన జర్నలిస్టులు కండ్లు కాయలు కాసేలా ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. హైదరాబాద్‌తో పాటు జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ఈ దయనీయమైన వాతావరణం ఉంది. అయితే జిల్లాల్లో అక్కడక్కడా ఇప్పుడు ఇండ్ల స్థలాలిస్తున్నారు. ఇందుకు ఆయా జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లకు ధన్యవాదాలు. సుప్రీంకోర్టులో కేసు పేరుతో హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం పదేండ్లుగా కాలయాపన చేస్తూ వచ్చింది. ఆరునెలల క్రితం సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ నేతృత్వంలోని ధర్మాసనం జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇవ్వొచ్చని తీర్పునిచ్చింది. అయినప్పటికీ బీఆర్ఎస్ సర్కార్ మాత్రం చడీచప్పుడు చేయడం లేదు. అయినా, సర్కారు కనీసం తన విధానాన్ని ప్రకటించలేదు. జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమం కోసం దీర్ఘకాలికంగా పని చేస్తున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఏండ్ల తరబడి ఇండ్లస్థలాల కోసం పోరాటాలు చేస్తున్నది. ఉద్యమాలు నిర్వహిస్తున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ జర్నలిస్టుల ఇండ్లస్థలాల కోసం పలుమార్లు జర్నలిస్ట్ సంఘాలతో భేటీ అయ్యారు. హైదరాబాద్ శివార్లలో స్థలాలు వెతికారు. మీడియా అకాడమీ ద్వారా అభిప్రాయ సేకరణ చేశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రత్యేక చట్టం ద్వారా స్థలాలు కేటాయిస్తామని చెప్పు కొచ్చారు. ఒక్కోసారి ఒక్కోలా తన హామీ అమలును వాయిదా వేస్తూనే వస్తున్నారు. అయినా అడుగు ముందుకు పడటం లేదు. రాష్ట్రంలో అనేక జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలు ఉన్నాయి. జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ, జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ, గ్రేటర్ హైదరాబాద్ హౌసింగ్ సొసైటీ, దక్కన్ హౌసింగ్ సొసైటీ, తెలంగాణ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీతో పాటు ఇంకా చాలానే ఉన్నాయి. వీటితో సభ్యత్వం ఉన్న వారు, లేని వారూ అనేక మంది జర్నలిస్టులు ఉన్నారు. మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టులతో పాటు హైదరాబాద్‌లోని పాత్రికేయులకు ఇండ్ల స్థలాలు కచ్చితంగా ప్రభుత్వం కేటాయించాల్సిన అవసరం ఉంది. బాధాకరమైన విషయం ఏమిటంటే, బీఆర్ఎస్ సర్కారు పూటకోమాట చెప్పి చివరకు ఎన్నికల కోడ్ వచ్చేదాకా పెండింగ్‌లో పెట్టింది. సీఎం కేసీఆర్ రెండువారాలు అందుబాటులో లేరు. దీంతో ఎన్నికల ముందు చెప్పుకునే కూడా అవకాశం లేకుండా పోయింది.

చావుకబురు చల్లగా చెప్పినట్టు మంత్రి కేటీఆర్ ఇటీవల తనను కలిసిన విలేకర్లతో జర్నలిస్టులకు ఇండ్లస్థలాలతో పాటు పెన్షన్ సౌకర్యం కూడా కల్పిస్తామంటూ మరోసారి చెప్పారు. ఆయన ఈ విషయమై పదే పదే మాట్లాడుతున్నా, ఆచరణలోకి రావడం లేదు. చివరకూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వొచ్చంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడం బాధాకరం. కేసు పేరుతో ఏండ్ల తరబడి జాప్యం చేసిన ప్రభుత్వం, తీర్పు వచ్చాక మిన్నకుండిపోయింది. కాగా జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం ఫెడరేషన్ దశలవారిగా ఆందోళనా కార్యక్రమాలు చేపట్టింది. తొలిదశలో నియోజకవర్గాలు, జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టులతో సంతకాల సేకరణ చేపట్టింది. రెండో దశలో స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు సమర్పించింది. మూడో దశలో జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ల ముందు రిలే దీక్షలు చేసింది. నాలుగో దశలో హైదరాబాద్‌లో గత మే 18న వందలాది మంది జర్నలిస్టులతో 'మహాధర్నా' నిర్వహించింది. ఇండ్లస్థలాలు వచ్చే వరకు ఫెడరేషన్ ఉద్యమాలు కొనసాగిస్తామని ప్రకటించింది. కోరి తెచ్చుకున్న తెలంగాణలో కూడా జర్నలిస్టుల ఇండ్లు, ఇండ్లస్థలాల కోసం దాదాపు 35 ఏండ్లుగా ఎదురుచూడాల్సి రావడం ఆవేదనాభరితం. కనీసం సుప్రీంకోర్టు తీర్పునూ కేసీఆర్ సర్కారు గౌరవించదా? ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలి. లేదంటే ఉద్యమాలు, ఓటు ద్వారానే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారు.

అంబేద్కర్ బౌద్ధం ఎందుకు స్వీకరించారు?



డాక్టర్ దేవరాజు మహారాజు

'హిందువుగా పుట్టాను కానీ హిందువుగా మరణించను' - అని డా.బి.ఆర్. అంబేద్కర్ యోలా సభలో ప్రకటించారు. ఆ తర్వాత-1956 అక్టోబర్ 14న బర్మా భిక్షువు చంద్రమణి ద్వారా నాగ్‌పూర్‌లో బౌద్ధం స్వీకరిం చారు. అలా ఎందుకు చేయాల్సి వచ్చిందో పూర్తిగా అర్థం చేసుకోవాలంటే ఆయన పుట్టి పెరిగిన పరిస్థితుల్ని పరిశీలించాలి. ఇప్పుడు ఈ 21వ శతాబ్దంలో ఉన్న పరిస్థితులు ఆనాడు దేశంలో 20వ శతాబ్దంలో లేవు. అంతకుముందు 19,18 శతాబ్దాలలో అణగారిన వర్గాల జీవితం ఇంకా చాలా దయనీయంగా ఉండేది. ఉదాహరణకు అంబేద్కర్ స్కూలు విద్యార్థిగా ఉన్నప్పుడు, స్కూల్లో తాగేందుకు మంచినీళ్ళు దొరికేవి కావు. దళితులకు నిర్దేశించిన కుండలోని నీరే వారు తాగాలి. ఎట్టి పరిస్థితులలోనూ పక్కనే ఉన్న అగ్రవర్ణం వారి కుండ ముట్టుకోగూడదు. నల్లాలో నీళ్ళు వస్తున్నా స్వతంత్రంగా వెళ్ళి నీళ్ళు తాగే పరిస్థితి లేదు. దాహంగా ఉందని అభ్యర్థిస్తే, స్కూలు బంట్రోతు కరుణించి వచ్చి, నల్లా తిప్పితే దూరంగా ఉండి దోసిలి పట్టి తాగి, పక్కకు జరగాల్సిందే. క్లాసు బయట కింద కూర్చుని పాఠాలు వినాల్సిందే తప్ప, తోటి విద్యార్థులతో కలిసి క్లాసులో బెంచి మీద కూర్చునే పనిలేదు. అంబేద్కర్ తెలివైన వాడు గనుక, విషయాలు సులభంగానే గ్రహించేవాడు. ఒకసారి మేస్టారు ఒక లెక్కను ఎవరైనా వచ్చి బోర్డు మీద చేసి చూపండి అంటే - అంబేద్కర్ చేస్తానని లేచి నిలబడ్డాడు. కాని, క్లాసులోని పిల్లలంతా గోల చేశారు. ఎందుకంటే, అంబేద్కర్ దళిత బాలుడు గనుక బోర్డు ముట్టుకుంటే బోర్డు వెనకాల ఉన్న అగ్రవర్ణ పిల్లల అన్నం మూటలు మైలబడి పోతాయని బాధపడిపోయారు. ఆనాటి పరిస్థితులు అలా ఉండేవి.

పాఠశాలల్లో ప్రథమశ్రేణి కేవలం బ్రాహ్మణ పిల్లలకే రావాలి. శూద్రులకు రాకూడదన్న అప్రకటిత నియమం ఉండేది. ఆ రోజుల్లో బనారస్, అలీఘర్ విశ్వవిద్యాలయాల్లో దళితులకు విద్య కోసం కేటాయించిన గ్రాంట్ ఆపేశారు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య విద్యార్థులకు అన్ని సదుపాయాలుండేవి. ఈ మూడు వర్గాల వారికి సేవ చేయడమే శూద్రుల ధర్మమని మనుస్మృతి చెప్పిన దాని ప్రకారమే అంతా జరుగుతూ ఉండాలని కోరుకునే వారు. అందుకు ప్రయత్నిస్తూ ఉండేవారు కూడా! మనిషికి మనసు ఉంది. జంతువులుగా లేరు కాని, తమకు ఉన్న మన సును సంస్కారవంతంగా, నైతికతతో ఉంచుకోవాలన్న ఆలోచన అగ్రవర్ణాల వారికి ఉండేది కాదు. హిందూధర్మం అధిక సంఖ్యాకులైన శూద్రుల్ని, దళితుల్ని నిరుత్సాహ పరిచేది. నిమ్నజాతుల వారి జీవితాల్లో ఆశ ఉండేది కాదు. అభ్యుదయం ఉండేది కాదు. వారు నిరాశలో పుట్టి పెరగాల్సిందే. ఎదిగే అవకాశాలు ఎంత మాత్రమూ ఉండేవి కావు. అసహ్యం, నిరాదరణ, కోపతాపాలు ఎదుర్కొంటూ, అవమానాల పాలవుతూ శూద్రులు, దళితులు బలవంతంగా జీవనం కొనసాగిస్తున్న రోజులవి. అలాంటి కాలంలో అంబేద్కర్ పుట్టి పెరిగారు. అన్ని రకాల వివక్షల్ని ఎదుర్కొంటూ, ఓపికగా పోరాడుతూ, ఒక్కొక్క మెట్టూ పైకి ఎదుగుతూ వచ్చారు.

ధనికులకు ధర్మం అక్కరలేదు. పీడితులకు మాత్రం ధర్మం వైపు నిలబడాల్సి ఉందన్న విషయం అంబేద్కర్ గ్రహించారు. ఆ రోజుల్లో మహిళలకు గుర్తింపు లేదు. వైదిక మతం ప్రకారం మహిళలంతా శూద్రులే. వారికి స్వేచ్ఛలేదు, విద్యలేదు, సమాజంలో గుర్తింపూ, గౌరవం లేదు, సతీ సహగమనం మాత్రం ఉంది. కాలే కడుపుకు తిండి పెట్టాలంటే వ్యభిచారం చేసుకోవాల్సిందే. ఆ రోజుల్లో బొంబాయిలో వ్యభిచారులు సులేమాన్ హోటల్లో భీమాప్లేట్ రోటీ తినగలిగే వారు. సంసారం చేసే గృహిణులకు అది కూడా ఉండేది కాదు. నాగ్‌పూర్‌లో ఆరెస్సెస్ వారి ప్రధాన కార్యాలయం ఉంది. వారి ప్రభావం తగ్గించడానికి అంబేద్కర్ ధమ్మదీక్ష అక్కడ తీసుకున్నారని కొందరు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దానికి ఆయన తగిన సమాధానమే చెప్పారు. ఆరెస్సెస్ అనే సంస్థ అసలు తన దృష్టిలోనే లేదని, తను నాగ్‌పూర్‌ను ఎన్నుకోవడానికి బలమైన కారణాలు చాలా ఉన్నాయని చెప్పారు. నాగ్‌పూర్ పట్టణానికి ఆ పేరు ఎందుకొచ్చిందంటే అది నాగజాతికి చెందిన ఆదివాసులకు నిలయం. వారంతా బుద్ధుని అనుయాయులు ఒకప్పుడు వీరే బుద్ధుడికి రక్షణగా ఉన్నారు. ఈ నాగజాతి ఆర్యుల ఆగడాలకు బలైపోయిన జాతి. అక్కడ నాగనది కూడా ఉంది. వీటన్నింటి కారణంగా తను బౌద్ధం స్వీకరించడానికి ఈ పట్టణాన్ని ఎన్నుకున్నానని అంబేద్కర్ వివరణ ఇచ్చారు.

ఆ రోజుల్లో లోకమాన్య బాలగంగాధర తిలక్ 'కేసరి' అనే పత్రిక వెలువరించేవారు. ఈయన అంబేద్కర్‌ను విమర్శిస్తూ వ్యాసాలు ప్రకటించేవారు. పేదలైన అస్పృశ్యలను అంబేద్కర్ తప్పుదారి పట్టిస్తున్నారనీ, వారిని బౌద్ధంలోకి తీసుకుపోవడం అన్యాయమనీ రాసేవారు. మృతకళేబరాలు తొలగించడం వల్ల మెహర్ (మాల-మాదిగ)లకు రూ.500 ఆదాయం లభిస్తోంది కదా? అది లేకుండా అంబేద్కర్ వారి నోట్లో మట్టి కొడుతున్నాడని విమర్శించారు. అంతే కాదు, రిజర్వేషన్‌తో వచ్చే యం.ఎల్.ఏ/యం.పీ సీట్లు పోతాయి కదా? దళితుల అవకాశాలకు అంబేద్కర్ గండి కొడుతున్నాడని తిలక్ అతని సహచరులు ఆక్రోషించారు. అంబేద్కర్ అందుకు చెంపపెట్టు లాంటి సమాధానం ఇచ్చారు. బ్రాహ్మణులు మెహర్లుగా మారి, జంతు మృత కళేబరాలు తొలగిస్తూ, దాని మీద వచ్చే ఆదాయం వారు తీసుకోవచ్చు కదా? ఎందుకంత ఉక్రోషం?అని ప్రశ్నించారు. దళితుల రిజర్వేషన్ స్థానాల్లో కూడా అసెంబ్లీకి, పార్లమెంటుకు అగ్రవర్ణం వారే పోటీచేసి గెలుచుకోవచ్చు కదా అందులో ఉన్న ఇబ్బంది ఏమిటీ? అని ప్రశ్నించారు అసలు విషయం ఏమిటంటే సమనత్వానికి అగ్రవర్ణాల వారు అంగీకరించకపోవడమే! అధిక సంఖ్యాకులైన శూద్రులు, దళితులు తమకు బానిసలుగా పడి ఉండాలని వారు కోరుకోవడమే. ఆ పరిస్థితి మారిపోతూ ఉందంటే వారు భరించలేరు కదా? అధిక సంఖ్యాకులైన బహుజనులు తమ గుప్పిట్లోంచి ఎగిరిపోతున్నారని బెంబేలు పడిపోయారు. హిందుత్వ వాది అయిన తిలక్ బాధ కూడా అదే-

తమిళ బౌద్ధ ఉద్యమకారుడు పండిత అయోతీథాస్ అంబేద్కర్ బౌద్ధం స్వీకరించక ముందే ఒక మాట చెప్పారు. పీడిత కులస్తులంతా అస్తిత్వ పోరాటాలు చేయాలే గాని, కాందిశీకుల్లాగా అగ్రకులాలను అనుకరించగూడదని వాదించాడు. అలాగే మన తెలుగువాడు; ఫిజిక్స్ ప్రొఫెసర్, నవ బౌద్ధుడూ అయిన లక్ష్మీ నరసు రాసిన ESSENCE OF BUDDISM గ్రంథ ప్రభావం అంబేద్కర్‌పై బాగా పడిందని చెపుతారు. ఎందుకంటే 1948లో అంబేద్కర్ ఆ పుస్తకానికి ముందుమాట రాసి, తనే స్వయంగా బొంబాయిలో మలి ముద్రణ వేయించారు. ఇవన్నీ ఒక్కొక్కటిగా అంబేద్కర్ బౌద్ధం వైపు ఆకర్షింపబడడానికి కారణాలయ్యాయి. బౌద్ధం సముద్రం లాగా విశాలమైంది. లోతైంది. సముద్రంలో చేరిన నదుల నీటికి గుర్తింపు ఉండదు. బౌద్ధం స్వీకరించిన తర్వాత కులమతాల గుర్తింపులుండవు. అందరూ సమానమే! వైదిక ధర్మం అసమానతలపై ఆధారపడి ఉంటే, బౌద్ధం సమానత్వంపై ఆధారపడి ఉంది. అందుకే అది ప్రపంచంలోకి 128 దేశాలకు వ్యాపించింది. ఒక ధర్మక్రాంతి విలసిల్లింది. లోతుగా పరిశీలిస్తే మన రాజ్యాంగంలో బౌద్ధం ఉంది. బుద్ధుడు చెప్పిన కార్యకారణ సంబంధంలో నుంచే ప్రపంచ వైజ్ఞానిక పరిశోధనలు సాగాయి. బుద్ధుడి బోధనలు లేకపోతే గాంధీ అహింసా సిద్ధాంతం ఉండేది కాదు. పండిట్ నెహ్రూ పంచశీలా ఉండేది కాదు. కొంచెం లోతుగా ఆలోచిస్తే అన్నింటిలో బౌద్ధం మూలాలు కనిపిస్తాయి.



> ఆ రోజుల్లో లోకమాన్య బాలగంగాధర తిలక్ 'కేసరి' అనే పత్రిక వెలువరించేవారు. ఈయన అంబేద్కర్‌ను విమర్శిస్తూ వ్యాసాలు ప్రకటించేవారు. పేదలైన అస్పృశ్యలను అంబేద్కర్ తప్పుదారి పట్టిస్తున్నారనీ, వారిని బౌద్ధంలోకి తీసుకుపోవడం అన్యాయమనీ రాసేవారు. మృతకళేబరాలు తొలగించడం వల్ల మెహర్ (మాల-మాదిగ)లకు రూ.500 ఆదాయం అభిస్తోంది కదా? అది లేకుండా అంబేద్కర్ వారి నోట్లో మట్టి కొడుతున్నాడని విమర్శించారు. అంతే కాదు, రిజర్వేషన్‌తో వచ్చే యం.ఎల్.ఏ/యం.పీ సీట్లు పోతాయి కదా? దళితుల అవకాశాలకు అంబేద్కర్ గండి కొడుతున్నాడని తిలక్ అతని సహచరులు ఆక్రోషించారు. అంబేద్కర్ అందుకు చెంపపెట్టు లాంటి సమాధానం ఇచ్చారు. బ్రాహ్మణులు మెహర్లుగా మారి, జంతుమృత కళేబరాలు తొలగిస్తూ, దాని మీద వచ్చే ఆదాయం వారు తీసుకోవచ్చు కదా? ఎందుకంత ఉక్రోషం? అని ప్రశ్నించారు.

అశోక చక్రమైనా, సారనాథ్ స్థూపమైనా, దేశ వ్యాప్తంగా ఊరూరా ఎన్నో బౌద్ధ చిహ్నాలు కనిపిస్తున్నాయి. ఒక రకంగా బౌద్ధ చిహ్నలే దేశ చిహ్నలయ్యాయి. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్, దర్బార్ హాలులో నిలువెత్తు బౌద్ధ విగ్రహం ఉంది. దాని ముందే కేంద్ర మంత్రులంతా ప్రమాణ స్వీకారం చేస్తారు. భారతరత్న, పద్మశ్రీ, వంటి బిరుదులు ఇచ్చేదీ అక్కడే. అక్కడి బుద్ధ విగ్రహం పాదాలు ఏ ఎత్తులో ఉన్నాయో - రాష్ట్రపతి భవన్‌కి కింద కి.మీ. దూరంలో ఉన్న ఇండియా గేట్ పై భాగం అంతే ఎత్తులో ఉంటుంది. మన దేశంలోని రాజ్యాంగాన్ని వ్యవస్థలూ ప్రజలూ సరిగా పాటిస్తే - ఇప్పటికీ మన దేశం బౌద్ధ దేశంగానే కొనసాగుతూ ఉండేది. మానవహక్కులు, ఆత్మగౌరవం బౌద్ధంలో దక్కుతాయి. అది దైవ భావన మీద, అసమానతల మీద, ఆధార పడిలేదు.

> ఇతర మతాల్ని, ధర్మాల్ని ప్రవేశ పెట్టినవారు, తాము దేవతలమనో, దేవదూతలమనో ప్రకటించుకున్నారు. కానీ, బుద్ధుడు అలా ప్రకటించుకోలేదు. కనీసం తన వారసుణ్ణి ప్రకటించమని శిష్యులు కోరినప్పుడు బుద్ధుడు అందుకు సమ్మతించలేదు. ధమ్మమే తన వారసుణ్ణి ప్రకటించుకుంటుందని చెప్పాడు. అందుకే భగవాన్ (పరిపూర్ణ మానవుడు) అయ్యాడు. అన్నింటినీ కాపీ కొట్టి తమలో కలిపేసుకున్నట్టుగానే ఈ పదాన్ని కూడా వైదికులు స్వీకరించారు. పైగా ఎక్కడా అస్థిత్వంలో లేనివాణ్ణి భగవంతుడని ప్రార్థిస్తూ వచ్చారు. ఇంకా ప్రార్థిస్తున్నారు. సర్వ జీవరాసుల్ని ప్రేమించాలని చెప్పిన బౌద్ధం - మానవజాతి అంతా ఒకటేనని, నేటి ఆధునిక జన్యుశాస్త్రం చెప్పిన విషయాన్ని శతాబ్దాలకు ముందే బౌద్ధం చెప్పింది. బౌద్ధం మనుషులైన వారందరికీ నచ్చుతుంది.

ఇతర మతాల్ని, ధర్మాల్ని ప్రవేశ పెట్టినవారు, తాము దేవతలమనో, దేవదూతలమనో ప్రకటించుకున్నారు. కానీ, బుద్ధుడు అలా ప్రకటించుకోలేదు. కనీసం తన వారసుణ్ణి ప్రకటించమని శిష్యులు కోరినప్పుడు బుద్ధుడు అందుకు సమ్మతించలేదు. ధమ్మమే తన వారసుణ్ణి ప్రకటించుకుంటుందని చెప్పాడు. అందుకే భగవాన్ (పరిపూర్ణ మానవుడు) అయ్యాడు. అన్నింటినీ కాపీ కొట్టి తమలో కలిపేసుకున్నట్టుగానే ఈ పదాన్ని కూడా వైదికులు స్వీకరించారు. పైగా ఎక్కడా అస్థిత్వంలో లేనివాణ్ణి భగవంతుడని ప్రార్థిస్తూ వచ్చారు. ఇంకా ప్రార్థిస్తున్నారు. సర్వ జీవరాసుల్ని ప్రేమించాలని చెప్పిన బౌద్ధం - మానవజాతి అంతా ఒకటేనని, నేటి ఆధునిక జన్యుశాస్త్రం చెప్పిన విషయాన్ని శతాబ్దాలకు ముందే బౌద్ధం చెప్పింది. బౌద్ధం మనుషులైన వారందరికీ నచ్చుతుంది. అందుకే, అంబేద్కర్ స్వీకరించి ఈ దేశ ప్రజలకు ఒక వెలుగుదారి చూపించారు. తన జీవితమంతా ఎదుర్కుంటూ వచ్చిన అణిచివేతను, అవమానాలను జీవిత చరమాంకంలో ఆయన బౌద్ధంతో తుడిపేసుకున్నారు. నవయాన నవబౌద్ధుడిగా మారారు. దేశానికి ఆదర్శమూర్తిగా నిలిచారు.

బౌద్ధం స్వీకరించడానికి డా.బి.ఆర్. అంబేద్కర్ నాగపూర్‌లో రామ్‌దాస్‌పేట్ ప్రాంతాన్ని ఎన్నుకున్నారు. ప్రస్తుతం అది నాగపూర్‌లోని అభయాంకర్‌నగర్‌లో ఉంది. ధమ్మదీక్ష తీసుకున్న తర్వాత ఒక నెల పదిహేను రోజులకు అంబేద్కర్ మరణించారు (6 డిసెంబర్ 1956) ఆయన మరణం తర్వాత ఇరవై మిలియన్ల మంది మార్చి 1959లో బౌద్ధం స్వీకరించారు. అంబేద్కర్ స్మారక సమితి ఏర్పడి నాలుగు ఎకరాలలో అక్కడ ఒక స్థూపం నిర్మించారు. గొప్ప బౌద్ధ దర్శనీయ స్థలంగా తీర్చిదిద్దారు.

- సుప్రసిద్ధ సాహితీవేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్
(మెల్బోర్న్ నుంచి)

'న్యూస్‌క్లిక్'పై యథేచ్ఛగా దాడి!

'న్యూస్ క్లిక్'పై దాడి, ఆ సంస్థ వ్యవస్థాపక సంపాదకులు ప్రబీర్ పుర్కాయస్థ, మానవ వనరుల విభాగాధిపతి అమిత్ చక్రవర్తిలను అక్రమ కార్యకలాపాల నిరోధక చట్టం-యుఎపిఎ నిబంధనల కింద అరెస్టు చేయడం చూస్తుంటే మోడీ ప్రభుత్వాన్ని, ఆ ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించే ఆ న్యూస్ పోర్టల్‌ను అణచివేసేందుకు చేసిన దారుణమైన ప్రయత్నంగా వుంది.

'న్యూస్ క్లిక్'పై చేపట్టిన ఈ అనూహ్యమైన చర్య మొత్తంగా స్వతంత్ర మీడియాకు చేసిన హెచ్చరికగా వుంది. అవసరమనుకుంటే స్వతంత్ర మీడియా గొంతు నొక్కివేయడానికి మోడీ ప్రభుత్వం ఎంతకైనా తెగిస్తుందనే సంకేతాలు పంపుతోంది. 'న్యూస్ క్లిక్'కు చెందిన 46 మంది జర్నలిస్టులు, సిబ్బంది, పార్ట్‌టైమ్ ఉద్యోగుల నివాసాలపై దాడులు జరిపి.. పుర్కాయస్థ, చక్రవర్తిలను అరెస్టు చేశారు. వీరందరి ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని పదే పదే ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ కార్యాలయంలో ప్రశ్నిస్తున్నారు.

వీరికి సంధిస్తున్న ప్రశ్నావళి తీరు చూస్తుంటే, ఢిల్లీ పోలీసుల ఉద్దేశ్యాలు, వాటి వెనుక గల కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆలోచనలు అర్థమవుతున్నాయి. సిఎఎ వ్యతిరేక ఆందోళనలు, ఈశాన్య ఢిల్లీ అల్లర్లు, మతోన్మాద హింసాకాండకు సంబంధించిన వార్తలు, 2020-21లో రైతుల ఆందోళన కవరేజీలో పాల్గొన్నారా అంటూ జర్నలిస్టులను ప్రశ్నిస్తున్నారు. ఈ అంశాల గురించి రాసినా, వీడియోలు తీసినా... వారిని చట్ట వ్యతిరేక కార్యకలాపాల పరిధిలోకి తీసుకువచ్చారు. ఢిల్లీ పోలీసుల దృష్టిలో జర్నలిజం కూడా నేరమే!

కేంద్ర ప్రభుత్వం 2021లోనే 'న్యూస్ క్లిక్'ను లక్ష్యంగా చేసుకుంది. వెబ్‌సైట్ కార్యాలయంపై, ప్రమోటర్, ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి) దాడి జరిపింది. వారిపై మనీ లాండరింగ్ అభియోగాలు మోపింది. ఆ సమయంలోనే 'న్యూస్ క్లిక్' తమ కంపెనీలో పెట్టుబడులుపెట్టిన వారి వివరాలను అందచేసింది. ఆర్‌బిఐ అనుమతితో అమెరికాలోని కొన్ని సంస్థలు, కంపెనీలు నిబంధనల ప్రకారం ఎలా నిధులు అందచేశాయో కూడా వివరించింది. 'న్యూస్ క్లిక్' సంపాదకులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించి, కోర్టు నుండి రక్షణ కూడా పొందారు. పుర్కాయస్థపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దంటూ ఢిల్లీ హైకోర్టు ఇ.డి.ని ఆదేశించింది.

'న్యూస్ క్లిక్' నిధులు, పెట్టుబడుల క్రమంలో ఎలాంటి అక్రమాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగాయని నిరూపించలేకపోవడంతో మోడీ ప్రభుత్వం తన రూటు మార్చింది. ఇందులో భాగంగా, ఆగస్టు 5 నాటి 'న్యూయార్క్ టైమ్స్' వ్యాసాన్ని తనకు అనుకూలంగా వాడుకుంది. అమెరికా పౌరుడు, టెక్ కంపెనీ మాజీ యజమాని అయిన నెవిల్లె రాయ్ సింగమ్ పెట్టుబడులు, నిధులు అందచేసిన సంస్థలు, మీడియా సంస్థల నెట్‌వర్క్ వివరాలు ఆ వ్యాసంలో వున్నాయి. భారత్‌లోని 'న్యూస్ క్లిక్' గురించి అసమగ్రమైన ప్రస్తావన మాత్రమే అందులో వుంది. భారత అధికారులు ఆ సంస్థపై దాడి చేశారన్నది వాస్తవం. అంతేకానీ ఆ సంస్థ ఎలాంటి తప్పులు చేసిందనే ప్రస్తావనే లేదు. అయితే, 'న్యూస్ క్లిక్'పై విషపూరితమైన దాడి చేయడానికి బిజెపి దీన్నొక సంకేతంగా వాడుకుంది. పైగా ఈ వెబ్‌సైట్‌కు చైనా నుండి నిధులు అందుతున్నాయని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి తప్పుడు ఆరోపణలు చేశారు. దాంతో, 'న్యూస్ క్లిక్'ను లక్ష్యంగా చేసుకోవడానికి చైనా కార్డును వాడుకోవాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించేసింది. ఆ వెంటనే ఢిల్లీ పోలీసుల కార్యాచరణ ఆరంభమైంది.

ప్రబీర్ పుర్కాయస్థ తదితరులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీని ఎట్టకేలకు అరెస్టు చేసిన నిందితులకు అందచేశారు. అది కూడా పోలీసులను కోర్టు ఆదేశించిన తర్వాతనే జరిగింది. ఎఫ్ఐఆర్‌లో నిరంకుశమైన యుఎపిఎ, ఐపిసి సెక్షన్లు 153-ఎ, 120-బి లను (మతం, నేరపూరితమైన కుట్ర ప్రాతిపదికగా వివిధ వర్గాల మధ్య మతపరమైన శతృత్వాన్ని పెంపొందించినందుకు) వారిపై మోపారు.

ఆ ఎఫ్ఐఆర్ అంతా ఆరోపణలతో నిండిపోయింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసమ్మతి, అసంతృప్తులను సృష్టించాలనే, దేశ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతలను దెబ్బ తీయాలనే లక్ష్యంతో శత్రు శక్తులు ఏ విధంగా విదేశీ నిధులను భారత్‌లోకి అక్రమంగా చొప్పించారో సాధారణ వర్ణనలు వున్నాయి. అరుణాచల్ ప్రదేశ్, కాశ్మీర్‌లను భారత్‌లో అంతర్భాగం కాదని చూపించేందుకు కుట్ర జరిగిందని కూడా ఆ ఎఫ్ఐఆర్ పేర్కొంది. అయితే ఈ ఆరోపణల్లో వేటినీ నిరూపించే సాక్ష్యాధారాలను అందచేయలేదు. పైగా, 2020-21లో ప్రజల



> 'న్యూస్ క్లిక్' నిధులు, పెట్టుబడుల క్రమంలో ఎలాంటి అక్ర మాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగాయని నిరూపించ లేకపోవడంతో మోడీ ప్రభుత్వం తన రూటు మార్చింది. ఇందులో భాగంగా, ఆగస్టు 5 నాటి 'న్యూయార్క్‌టైమ్స్' వ్యాసాన్ని తనకు అనుకూలంగా వాడు కుంది. అమెరికా పౌరుడు, టెక్ కంపెనీ మాజీ యజమాని అయిన నెవిల్లె రాయ్ సింగమ్ పెట్టుబడులు, నిధులు అంద చేసిన సంస్థలు, మీడియా సంస్థల నెట్ వర్క్ వివరాలు ఆ వ్యాసంలో వున్నాయి. భారత్‌లోని 'న్యూస్ క్లిక్' గురించి అసమగ్రమైన ప్రస్తావన మాత్రమే అందులో వుంది.

నిత్యావసరాల సరఫరాలు, సేవలకు అంతరాయం కలిగేలా రైతాంగ ఆందోళనను సుదీర్ఘంగా పొడిగించేందుకు ప్రయత్నించారనే విపరీతమైన ఆరోపణలు చేశారు. ఇలా చేయడం ద్వారా, రైతుల ఆందోళనకు అప్రతిష్ట పాల్జేశారు. దాన్నొక విధ్వంసకర కార్యకలాపంగా ముద్రవేశారు. జియోమి, వివో వంటి చైనా టెలికం కంపెనీల నుండి అందుకున్న ప్రయోజనాలకు ప్రతిగా ఆ కంపెనీలపై నమోదైన కేసుల్లో వాదించడానికి గానూ లీగల్ కమ్యూనిటీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి, దాని కోసం ప్రచారం చేయడానికి కుట్ర పన్నారంటూ నిందితులపై వింతైన అభియోగాలు మోపారు. అక్కడితో ఆగకుండా, ఈ కుట్రను మరింత ముందుకు తీసుకెళ్ళేందుకు భారత్‌లోకి అక్రమంగా విదేశీ నిధులను చొప్పించడం కోసం...ఈ రెండు చైనా టెలికం కంపెనీలు పిఎంఎల్ఎ, ఫెమా నిబంధనలను ఉల్లంఘించి భారత్ లోకి వేలాది బూటకపు కంపెనీలను చొప్పించాయంటూ ఆరోపించారు. ఇంత తీవ్రమైన ఆరోపణలు చేసినా కూడా, ఈ కంపెనీలకు, 'న్యూస్ క్లిక్'కు లేదా నిందితులకు సంబంధాలున్నాయని చూపించలేకపోయారు.

పైన చెప్పినట్టుగా, చైనా వనరుల నుండి నిధులు అందుతున్నాయన్న తప్పుడు ఆరోపణలతో 'న్యూస్ క్లిక్' ప్రతిష్ఠను మసకబరచాలని లక్ష్యంగా పెట్టుకున్న మోడీ ప్రభుత్వ రాజకీయ ఉద్దేశ్యాలను ఎఫ్ఐఆర్ వెల్లడించింది. పైగా యుఎపిఎ నిబంధనలను మోపడాన్ని సమర్థించుకోవడానికి జాతి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న అభియోగాలను దీనితో ముడిపెట్టారు. ఈ 'న్యూస్ క్లిక్' వెబ్‌సైట్ వామపక్షాల భావజాలంతో పని చేసే, రైతులు, కార్మిక వర్గం ఉద్యమాలకు బలంగా నిలిచే వార్తా వెబ్‌సైట్ కావడమే ఇంతటి విషపూరితమైన దాడి జరగడం వెనుక గల ప్రధాన వాస్తవంగా వుంది. ఇటీవలే, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, భారతదేశంలో వామపక్ష అనుకూల శక్తులపై నిరంతరం పోరాడాలని పిలుపిచ్చారు.

'న్యూస్ క్లిక్'పై దాడి పత్రికా స్వేచ్ఛపై జరిగిన అతి దారుణమైన దాడి. అరతేకాదు, ప్రజాస్వామ్యం, పౌరుల హక్కులపై పెరుగుతున్న నిరంకుశ దాడుల్లో భాగం కూడా. అందువల్ల, పూర్తి శక్తియుక్తులతో, నిబద్ధతతో ఈ దాడులను ప్రతిఘటించాలి.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)



హైదరాబాద్‌లో..
బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 60,760	▲	270
22 క్యారెట్లు	- 55,700	▲	250
కిలో వెండి	- 77,500	▲	500



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 104
రిటైల్ (లైవ్)	రూ. 126
స్కిన్‌తో	రూ. 183
స్కిన్‌లెస్	రూ. 208

'జింఖానా'పై కన్ను పడింది

కేంద్రం చేతిలో క్లబ్బు అజమాయిషీ

- బీజేపీ నేతలు ఆడింది ఆట... పాడింది పాట
- లా ట్రిబ్యునల్ ఆదేశాలను సాకుగా చూపి కబళించే యత్నం



న్యూఢిల్లీ : దేశ రాజధానిలో బ్రిటీష్ పాలనలో ఏర్పడిన ప్రతిష్టాత్మక జింఖానా క్లబ్బు ఇప్పుడు కేంద్రంలోని అధికార బీజేపీ ఆజమాయిషీలో నడుస్తోంది. ఆ పార్టీ నేతలు ఆడింది ఆట... పాడింది పాటగా వ్యవహారాలు సాగుతున్నాయి. క్లబ్బు నిర్వహణలో అక్రమాలు జరిగాయని, నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపిస్తూ మోడీ ప్రభుత్వం నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేయడం, విచారణ అనంతరం క్లబ్బు బాధ్యతలను ప్రభుత్వానికి ట్రిబ్యునల్ అప్పగించడంతో ఆ సంస్థ పూర్వ వైభవాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. దీనిపై పలువురు సభ్యులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

గత నాలుగు సంవత్సరాలుగా ఢిల్లీ జింఖానా క్లబ్ న్యాయ వివాదాలలో కూరుకుపోయింది. నిధుల దుర్వినియోగం, నిబంధనల ఉల్లంఘన, చట్టవిరుద్ధమైన సభ్యత్వాలు వంటి ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఒకప్పుడు రికార్డు స్థాయిలో రూ.62 కోట్ల ఆదాయం పొందిన ఈ క్లబ్బు నెలకు కోటి రూపాయల నష్టాన్ని మూటకట్టుకుంటూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే స్థితికి చేరుకుంది. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకున్న కేంద్ర ప్రభుత్వం నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ జరిపిన ట్రిబ్యునల్ అక్రమాలు జరిగిన మాట వాస్తవమేనని తేల్చింది. క్లబ్బు నిర్వహణ బాధ్యతలు చేపట్టేందుకు గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వాన్ని అనుమతించింది. 2022 ఏప్రిల్ 3వ తేదీ నుండి కేంద్రం నియమించిన కమిటీ ఆధ్వర్యంలోనే క్లబ్బు వ్యవహారాలు నడుస్తున్నాయి. ఈ కమిటీలో సుప్రీంకోర్టు న్యాయవాది, బీజేపీ ప్రతినిధి నళిన్ కోహ్లీ కూడా సభ్యుడే.

మసకబారిన ప్రతిష్ఠ

క్లబ్బు సభ్యులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రోడ్డెక్కడంతో దాని ప్రతిష్ఠ మసకబారింది. కోట్లాది రూపాయల సొమ్ము క్లబ్బు నుండి తరలిపోయిందని సభ్యుడైన ఓ మాజీ ఎంపీ ఆరోపించారని ఫైనాన్షియల్ టైమ్స్ ఆరోపించింది.

పట్టించుకునే దిక్కేది?

తాజా పరిణామాలపై 84 సంవత్సరాల రిటైర్డ్ ఆర్మీ మేజర్ అతుల్ దేవ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్లబ్బుతో ఆయనకు యాభై సంవత్సరాల అనుబంధం ఉంది. 'ఈ రోజు మా క్లబ్బుకు జరిగింది.

రేపు ఏ క్లబ్బుకైనా ఇలాంటిదే జరగవచ్చు' అని ఆయన చెప్పారు. క్లబ్బు ఆజమాయిషీ బీజేపీ చేతుల్లోకి వెళ్లడాన్ని వ్యతిరేకిస్తూ మరో తొమ్మిది మంది సభ్యులతో కలిసి ఆయన న్యాయస్థానాన్ని ఆశ్ర యించారు. 'మీరు కమిటీ సభ్యులుగా ఎన్నికైతే కమిటీ లోని మొత్తం పదిహేను వేల మందికీ మీరెవరో తెలు స్తుంది. మీకు అందరితో సంబంధాలు ఉంటాయి. ఫోన్ చేస్తే చాలు...పని జరిగి పోతుంది. మరి ఇప్పుడో? అంతా ప్రచ్ఛన్న యుద్ధమే. అనేక పనులు పెండింగ్‌లో పడిపోయాయి. పట్టించుకునే వారే లేరు' అని వాపోయారు.



పౌర సమాజంపై పెత్తనం కోసమే...

మోడీ ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు, మేధావులు సహా తనను విమర్శించే వారిపై ఉక్కు పాదం మోపుతున్న విషయం తెలిసిందే. జింఖానాలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తే ఇది కేవలం ఓ రిక్రియేషన్ క్లబ్బుపై ఆధిపత్యం చెలాయించడం మాత్రమే కాదని, పౌర సమాజాన్ని పూర్తిగా తన చెప్పుచేతల్లో ఉంచుకునేందుకు చేసిన ప్రయత్నమేనని విమర్శకులు అభిప్రాయపడ్డారు. మరోవైపు ఏదో ఒకటి చేయకపోతే క్లబ్బు పరిస్థితి చేయి దాటిపోతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అయితే అలాంటిదేమీ లేదని క్లబ్బు వాదిస్తోంది. 2021 ప్రారంభం నుండి ఈ క్లబ్బును వివాదాలు చుట్టుముట్టాయి. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ఓ అధికారి పోలీసులు, సీనియర్ అధికారులు, మీడియా ప్రతినిధుల ముందు ప్రధాని మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఈ సంస్థ నిర్వహణను చేపట్టిందని ప్రకటించారు. ఏదేమైనా జింఖానాను తిరిగి తమ చేతుల్లోకి తీసుకోవాలని కొందరు సభ్యులు న్యాయ పోరాటం సాగిస్తున్నారు.

విచారణల పేరుతో...

కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత జింఖానాపై దృష్టి సారించారు. క్లబ్బులో అవకతవకలు జరుగుతున్నాయంటూ విచారణ జరిపించారు. 2000వ సంవత్సరంలో అధికారులు రెండు వేల పేజీల నివేదికను రూపొందించారు. మరో నివేదిక కూడా క్లబ్బుకు అవినీతి మరక అంటించింది. ఒకవేళ తప్పు జరిగి ఉంటే దానిని నిరూపించి, తగిన చర్యలు తీసుకోవచ్చునని, అయితే జింఖానాను ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇవేమీ చేయలేదని అతుల్ దేవ్ విమర్శించారు.

అస్మదీయుల హవా

జింఖానా క్లబ్బులో చేరేందుకు ఓం పాఠక్ అనే వ్యక్తి 1982లో దరఖాస్తు చేశారు. అయితే దానిని క్లబ్బు కమిటీ ఆమోదించలేదు. మాజీ సైనికుడైన పాఠక్ బీజేపీ నాయకుడు కూడా. క్లబ్బు నిర్వహణ బీజేపీ చేతిలోకి రాగానే ఆయన్ని నూతన అడ్మినిస్ట్రేటర్‌గా నియమించారు. అయితే తనను ఎందుకు ఆ పదవిలో నియమించారో తెలియదని, ఎవరో ఫోన్ చేసి చెబితే అంగీకరించానని ఆయన చెప్పుకొచ్చారు. కానీ పదవిలో రాగానే ఆయన తనదైన ముద్ర వేయడం ప్రారంభించారు. అతుల్ దేవ్‌ను, మరికొందరు సభ్యులను ఇబ్బంది పెట్టే చర్యలు చేపట్టారు. క్లబ్బు లౌకిక స్వభావాన్ని దెబ్బతీసేలా లైబ్రరీలో భగవద్గీత ప్రతిని ఉంచారు. బకాయిలు చెల్లించని 400 మందిపై బహిష్కరణ వేటు వేశారు. వీరిలో శక్తివంతమైన కుటుంబాలకు చెందిన సభ్యులు కూడా ఉన్నారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, బీజేపీ మంత్రి కుమారుడు కూడా పాఠక్ బాధితులే. ఇప్పుడు ఈ వ్యవహారం ఢిల్లీ హైకోర్టు విచారణలో ఉంది. తొమ్మిది నెలల పాటు నియంతలా వ్యవహరించిన పాఠక్ చివరికి గత సంవత్సరం ఏప్రిల్‌లో పదవి నుండి వైదొలిగారు. ఆ తర్వాత కమిటీలో మరికొందరు బీజేపీ విధేయులైన అధికారులను చేర్చారు.

కనీస మద్దతు ధరలు బూటకం

- మోడీ ప్రభుత్వ నాటకాలను బయటపెట్టాలి : శాఖలకు ఏఐకేఎస్ పిలుపు

న్యూఢిల్లీ : రైతులకు, రాయితీలతో కూడిన పంటల వైవిధ్యతకు ప్రోత్సాహక ధరలకు హామీ కల్పిస్తూ 2024-25 రబీ మార్కెటింగ్ సీజనుకు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు (ఎంఎస్‌పీ)ను అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ఖండించింది. అఖిల భారత స్థాయిలో సగటు ఉత్పత్తి వ్యయానికి ఒకటిన్నర రెట్లు ఇస్తున్నామంటూ చెప్పడాన్ని తీవ్రంగా విమర్శించింది. గోధుమలు క్వింటాల్‌కు రూ.150 అధికంగా మద్దతు ధర ఇవ్వడం 2014 నుంచి అత్యంత అధికమని ప్రభుత్వం పేర్కొనడం బూటకమని కిసాన్‌సభ విమర్శించింది. పెరిగిన ఉత్పత్తి వ్యయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంఎస్‌పి ప్రకటిస్తారనే వాస్తవాన్ని ఎవరైనా దృష్టిలో పెట్టుకుంటే ఇది బూటకమని స్పష్టంగా వెల్లడవు తుందని ఏఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలె, విజ్జూ కృష్ణన్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉత్పత్తి వ్యయమంటూ ప్రస్తావించినది సమగ్ర సిటు వ్యయం కాదని, అతి తక్కువగా వున్న ఎటు ప్లస్ ఎఫ్ఎల్ అని ఆ ప్రకటన పేర్కొంది. రైతులను మోసగించేందుకు నిజాయితీ లోపించిన ప్రయత్న మని విమర్శించింది. రైతులను ముఖ్యంగా ఎన్నికలు జరుగుతున్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, తెలంగాణా రైతులను తప్పుదారి పట్టించేందుకు బిజెపి ప్రభుత్వం అబద్దాలు చెబుతోందని వారు విమర్శించారు.

సిటూ వ్యయానికి, ఎటూ ప్లస్ ఎఫ్ఎల్ వ్యయానికి చాలా ఎక్కువగా తేడా కనిపిస్తోందని, అలాగే రాష్ట్ర ప్రతిపాదనలకు, సీఏసీపీ ప్రతిపాదనలకు కూడా తేడా బాగా వుందని పేర్కొంది. ప్రతి పంటకు క్వింటాల్‌కు రైతులు ఎదుర్కొనే నష్టాలను ఆ ప్రకటనలో వివరించారు. గోధుమ పంటకు క్వింటాల్ కు సీటూ వ్యయాన్ని రూ.2051గా పంజాబ్ ప్రభుత్వం అంచనా వేసింది.అదే సమయంలో సీఏసీపీ చేపట్టిన ఏటూ ప్లస్ ఎఫ్ఎల్ వ్యయం కేవలం క్వింటాల్‌కు రూ.741గా వుంది. అంటే సీటూ వ్యయాని కన్నా క్వింటాల్‌కు ఏకంగా రూ. 1310 తక్కువగా వుందని ఆ ప్రకటన వివరించింది. పంజాబ్‌లో దాదాపు 35లక్షల హెక్టార్లలో గోధుమ పంట సాగవుతోంది. ఈ రకంగా పంజాబ్ రైతులు ఒక్క గోధుమ పంటకు సంబంధించే ఏకంగా రూ.13,500కోట్లు నష్టపోతున్నారని కిసాన్‌సభ నేతలు వివరించారు. మహారాష్ట్రలో ఏటా గోధుమ రైతుల నష్టం రూ.4640కోట్లుగా వుంది.

చనా (కాబూలీ శనగలు) విషయంలో తెలంగాణా రాష్ట్ర సిటు అంచనా క్వింటాల్‌కు రూ.6055గా వుండగా, ఎటు ప్లస్ ఎఫ్ఎల్ కేవలం క్వింటాల్‌కు రూ. 2290గానే వుంది. అంటే క్వింటాల్‌కు రూ.3765 తక్కువగా వుంది. క్వింటాల్ ఎంఎస్‌పిని రూ.9351 గా ప్రకటించాలని రాష్ట్రం సూచించింది. అంటే ప్రకటించిన ఎంఎస్‌పి కన్నా క్వింటాల్‌కు రూ.3911 ఎక్కువన్నమాట. ఇక్కడ రైతు హెక్టార్‌కు రూ. 58,665 నష్టపోతున్నాడు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అను సరిస్తున్న విధానాల కారణంగా భారతదేశంలోని రైతులు పదే పదే నష్టపో తున్నారు. మోసగించబడుతున్నారు. పైగా రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామంటూ ప్రభుత్వం ఊదరగొడుతోంది.

చివరకు ఏ మాత్రమూ ప్రోత్సాహకరంగా లేని రీతిలో ప్రకటించిన ఎంఎస్‌పి కూడా కేవలం ఊహాత్మకంగానే వుంది. ఎందుకంటే కొనుగోళ్ళు లేనందున మెజా రిటీ రైతులకు ఇది ఎలాంటి లాభాలను ఇవ్వడం లేదు. అందువల్లే ఎంఎస్‌పికి చట్టబద్ధమైన హామీ కల్పించాలని రైతులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారని ఎఐకెఎస్ పేర్కొంది.ప్రభుత్వ వైఖరి బహిర్గతం చేసేలా, సమాజం లోని అన్ని వర్గాలకు ఈ సమాచారాన్ని చేరవేసేలా చర్యలు తీసుకోవాలని, నిరసన తెలియచేయాలని ఎఐకెఎస్ తన శాఖలకు పిలుపునిచ్చింది.

దసరా, దీపావళికి ప్రత్యేక రైళ్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దసరా, దీపావళి పండుగల రద్దీని తగ్గించేందుకు దక్షిణ మధ్య రైల్వే వివిధ మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్టు ఒక ప్రకటనలో తెలిపింది. సికింద్రాబాద్ - సంత్రాగచి (అక్టోబర్ 20న), సంత్రాగచి - సికింద్రాబాద్ (అక్టోబర్ 21న), నాందేడ్-కాకినాడ టౌన్ (అక్టోబర్ 21న), కాకినాడ టౌన్-నాందేడ్ (అక్టోబర్ 22న), సికింద్రాబాద్-నర్సాపూర్ (అక్టోబర్ 22న), విశాఖపట్నం-కర్నూల్ సిటీ (అక్టోబర్ 24న, అక్టోబర్ 31న, నవంబర్ 7న, నవంబర్ 14న), కర్నూల్ సిటీ- విశాఖపట్నం (అక్టోబర్ 25న, నవంబర్ 1,8, 15 తేదీల్లో) మధ్య ఈ రైళ్లు నడుపనున్నారు.

సికింద్రాబాద్-సంత్రాగచి-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు నల్లగొండ, మిర్యాలగూడలో, నాందేడ్ - కాకినాడ టౌన్ - నాందేడ్ రైలు బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్, సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం తదితర స్టేషన్లలో ఆగుతుంది. సికింద్రాబాద్ - నర్సాపూర్ రైలుకు జనగాం, కాజీపేట్, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, రాయనపాడు స్టేషన్లలో, విశాఖపట్నం- కర్నూల్ - విశాఖపట్నం రైలు మిర్యాలగూడ, నల్లగొండ, మల్కాజిగిరి, ఉమ్దా నగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, వనపర్తి రోడ్, గద్వాల స్టేషన్లలో ఆగుతుంది.

అంగన్‌వాడీలకిచ్చిన హామీలను నెరవేర్చాలి

- సమ్మె కాలం వేతనాలను వెంటనే చెల్లించాలి : తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంగన్‌వాడీ ఉద్యోగులకు సమ్మె కాలంలో మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్ ఇచ్చిన నిర్దిష్ట హామీలను అమలు చేయాలనీ, సమ్మె కాలం వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి కోశాధికారి పి.మంగ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో ఐసీడీఎస్ కమిషనర్ శృతికి వారు వినతిపత్రం అందజేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, అంగన్‌వాడీ టీచర్లకు రూ. 2 లక్షలు, ఆయాలకు రూ. 1 లక్ష, ఆసరా పెన్షన్ చెల్లిస్తామన్న హామీ నేటికీ నెరవేరలేదన్నారు. పీఆర్సీ వర్తింపు, మినీ అంగన్వాడీ అప్‌గ్రేడ్, ప్రమాదబీమా, మే నెల సెలవులు, ఆన్‌లైన్ యాప్‌ల సమస్య పరిష్కరిస్తమన్న వాటిలో ఒక్కటీ అమల్లోకి తేలేదన్నారు. వేతనాల పెంపుపై సీఎం కేసీఆర్‌తో చర్చిస్తామన్న ప్రస్తావనే లేదన్నారు. మంత్రుల హామీ ప్రకారం సమ్మెకాలం వేతనాలు రాకపోవడంతో బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో అంగన్‌వాడీలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు.

కాంగ్రెస్‌దే విజయం

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. ధరణి పోర్టల్ పేరుతో పేదల భూములు లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు కాజేస్తున్నారన్నారు. రైతుబంధుతో ధనిక రైతులకే లాభం చేకూరుతోందని, తమ ప్రభుత్వం వచ్చాక భూమిలేని రైతులకూ సాయం అందిస్తామని వివరించారు. దళిత, గిరిజనులకు మూడెకరాల భూమి ఇస్తానని కేసీఆర్, పేదల బ్యాంక్ ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తానని ప్రధాని మోడీ ఇద్దరూ ప్రజలను మోసం చేశారని విమర్శించారు.

రామగుండం సింగరేణి కార్మికులతో తాను మాట్లాడానని, సింగరేణి గనులు ప్రయివేటుపరం కానివ్వబోమని హామీ ఇచ్చారు. సింగరేణిని అదానీకి అప్పజెప్పేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తే అడ్డుకున్నామని తెలిపారు. దేశంలోని గనుల ప్రయివేటీకరణకు తాము వ్యతిరేకంగా పోరాడి ఆపగలుగుతున్నామని వివరించారు. ప్రభుత్వ కంపెనీలకు ఒక రేటుతో, ప్రయివేటు కంపెనీలకు మరో రేటుతో దేశ సంపదను కొల్లగొడుతున్నారని చెప్పారు. ఓబీసీల జపం చేసే ప్రధాని మోడీ ప్రభుత్వంలో 90 మంది కార్యదర్శులు ఉంటే.. వారిలో ముగ్గురే ఓబీసీలు ఉన్నారని తెలిపారు. పేదలకిచ్చే స్కీములకు ఎన్ని నిధులు కేటాయించాలి?., ప్రభుత్వ ఆస్తులు ఏవి అమ్మాలనే లెక్కలు తీస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని తాను ప్రశ్నిస్తే పార్లమెంట్‌లో మోడీ కనీసం సమాధానం ఇవ్వలేదన్నారు. పైగా బీజేపీని ప్రశ్నిస్తున్నాననే కక్షతో తనపై 27అక్రమ కేసులు బనాయించి పార్లమెంట్ సభ్యత్వాన్ని కూడా రద్దు చేసి.. ఇంటిని సైతం ఖాళీ చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా తాను వెనక్కి తగ్గనని, ప్రజల పక్షానే పోరాడుతానని చెప్పారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తామన్నారు. వచ్చిన తొలి రోజుల్లోనే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి ఆయా కులాల వారీగా రాజకీయంగా, ఆర్థికంగా న్యాయం చేకూర్చుతామని అన్నారు.

ఇచ్చిన ప్రతిమాటనూ నిలబెట్టుకుంటాం

'రాష్ట్రంలో మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన ప్రతి మాటనూ నిలబెట్టుకుంటాం. ప్రతిపేద మహిళకు రూ.2500 మొదలుకుని ఆరు గ్యారెంటీ స్కీములను అమలు చేస్తాం' అని రాహుల్‌గాంధీ అన్నారు. ఇందుకు కర్నాటక, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో తమ ప్రభుత్వాల హామీల అమలును ప్రజలు గమనించాలని కోరారు. కేసీఆర్, ఆయన కుటుంబ పరివారం జనం సొమ్మును జేబుల్లో వేసుకుంటున్నారని ఆరోపించారు. కాళేశ్వరం నిర్మాణం పేరుతో రూ.లక్ష కోట్లు అవినీతి చేసినా ఈ సర్కారుపై ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు జరగవని, అదే బీఆర్ఎస్‌కు, బీజేపీకి మధ్య ఉన్న మైత్రిని తేటతెల్లం చేస్తోందని అన్నారు. ప్రతిపక్షాలపై సీబీఐ, ఈడీ, ఐటీ దాడులు చేయిస్తున్న మోడీ ప్రభుత్వం తెలంగాణలో ఎందుకు చేయించట్లేదని ప్రశ్నించారు.

ఏ ఒక్క హామీనీ బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలన కేంద్రంలోని నరేంద్ర మోడీ రిమోట్ కంట్రోల్ ద్వారా పనిచేస్తోందని ఎద్దేవా చేశారు.

దేశంలో అదానీలాంటి పారిశ్రామికవేత్తలు లక్షల కోట్లు అప్పు తీసుకుంటే వారు అడగకుండానే రుణమాఫీ చేస్తున్నారని, రైతులు, మహిళలు, యువకులు రుణాలు తీసుకుంటే రుణమాఫీ ఎందుకు చేయరని ప్రశ్నించారు. ఎంఐఎం, బీజేపీ లోపాయికారి ఒప్పందంతో ముందుకు సాగుతున్నాయని, ఇతర రాష్ట్రాల్లో ఎంఐఎం అభ్యర్థులను నిలబెడుతూ పరోక్షంగా బీజేపీకి సహకరిస్తోందని ఆరోపించారు. దేశ సంపద ఎవరి వద్ద ఉందో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వెలికి తీసి పేద కుటుంబాలకు అందజేస్తామని తెలిపారు.

రాహుల్‌గాంధీ వెంట తెలంగాణ ఇన్‌ఛార్జి మాణిక్‌రావు థాక్రే, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, మధుయాష్కి, ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎన్నికల మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ములుగు ఎమ్మెల్యే సీతక్కతో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు ఉన్నారు.

రాహుల్ గాంధీ బైక్ ర్యాలీలో అపశృతి

- కొండ సురేఖకు తప్పిన ప్రమాదం



నవతెలంగాణ- భూపాలపల్లి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భూపాలపల్లి పర్యటనలో నిర్వహించిన బైక్ ర్యాలీలో అపశృతి చోటుచేసుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా జయశంకర్-భూపాలపల్లి జిల్లా చెల్పూర్ జెన్కో నుంచి జిల్లా కేంద్రంలోని బాంబుల గడ్డ వరకు కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కొండా సురేఖ బైక్ నడుపుతూ కిందపడిపోయారు. కాగా స్వల్ప గాయాలతో ఆమె బయటపడ్డారు.

వెనిజులాపై అమెరికా ఆంక్షల పాక్షిక సడలింపు!

వాషింగ్టన్ : వెనిజులాలోని కొన్ని పరిశ్రమలపై విధించిన ఆంక్షలను ఆరు మాసాల పాటూ సడలిస్తూ అమెరికా ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. వెనిజులా ఇంధన పరిశ్రమకు బుధవారం అమెరికా ఆర్థిక శాఖ తాత్కాలిక ఉపశమనాన్ని ప్రకటించడంతో మరింత పునరుత్తేజంతో చమురు, గ్యాస్ మార్కెట్‌లోకి దేశం ప్రవేశిస్తోందని అధ్యక్షుడు నికోలస్ మదురో ప్రకటించారు. ఎంపిక చేసిన రంగాలపై నిర్దిష్ట ఆంక్షలను నిలుపు చేస్తూ నాలుగు జనరల్ లైసెన్స్‌లను జారీ చేశారు. వెనిజులా ప్రభుత్వం, బార్బడోస్‌లో ప్రతిపక్షం మధ్య కుదిరిన ఎన్నికల ప్రణాళికకు ప్రతిస్పందన గా ఈ ప్రకటన వెలువడింది. ఈ ఒపవందాలు, నిర్ణయాలతో చమురు, గ్యాస్ మార్కెట్‌లో ప్రగతిశీలమైన పద్ధతిలో ప్రవేశిస్తున్నామని మదురో తెలిపారు.ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు ఎంతవరకు నెరవేర్చారో దాన్ని బట్టి లైసెన్సుల పునరుద్ధరణ వుంటుందని ఆర్థిక శాఖ ప్రకటన పేర్కొంది.

ఎన్నికల్లో నేను పోటీ చేయదలుచుకోలేదు

- ప్రొఫెసర్ కోదండరామ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే శాసనసభ ఎన్నికల్లో తాను పోటీ చేయదలుచుకోలేదని టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ తెలిపారు. గురువారం కేజీ టు పీజీ విద్యాసంస్థల జేఏసీ ఆధ్వర్యంలో సోమాజీగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్నికలు మారిన తీరుపై మాట్లాడుతూ ఎన్నికలంటే మొత్తం పైసలాటగా మార్చారని ఆయన వ్యాఖ్యానించారు.

బీఆర్ఎస్ గద్దె దిగితేనే బడ్జెట్ విద్యాసంస్థలకు మనుగడ

- మళ్లీ అధికారంలోకి వస్తే వాటికి చావు తప్పదు : తెలంగాణ కేజీ టు పీజీ విద్యాసంస్థల జేఏసీ సమావేశంలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ ప్రభుత్వం గద్దె దిగితేనే రాష్ట్రంలో బడ్జెట్ విద్యాసంస్థలకు మనుగడ ఉంటుందని పలువురు వక్తలు తెలిపారు. బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి వస్తే ఆ సంస్థల చావు తప్పదని హెచ్చరించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని వారు పిలుపునిచ్చారు. తెలంగాణ కేజీ టు పీజీ విద్యాసంస్థల జేఏసీ కన్వీనర్ గౌరీ సతీష్ అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో 'విద్యావ్యవస్థ నిర్మాణమా? విధ్వంసమా?'అనే అంశంపై చర్చావేదిక నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మెన్ ప్రొఫెసర్ టి.పాపిరెడ్డి, టీఎల్ఎఫ్ గౌరవ అధ్యక్షులు కత్తి వెంకటస్వామి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక మొదటి దాడి విద్యావ్యవస్థపైనే చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోదండరామ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని దింపేందుకు రాష్ట్రంలో సానుకూల వాతావరణం ఉందనీ, అందువల్ల మరింత సాహసంగా ముందుకెళ్లాలని సూచించారు. 1990ల్లో పెరిగిన నిరుద్యోగం నుంచి తప్పుకునేందుకు బడ్జెట్ విద్యాసంస్థలు ఉపయోగపడ్డాయనీ, లెక్చరర్లకు, టీచర్లకు ఉపాధినిచ్చాయని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కార్పొరేట్ల తాకిడికి విలవిలలాడిన ఈ విద్యాసంస్థల ప్రతినిధులు తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములయ్యారని వివరించారు. అయితే స్వరాష్ట్రం వచ్చాక బీఆర్ఎస్ సర్కార్ వేధింపులతో రాష్ట్రంలో దాదాపు 150 ఇంజినీరింగ్, 400 డిగ్రీ , వెయ్యి జూనియర్ కాలేజీలు మూతపడ్డాయని తెలిపారు. వీటిపైకి విజిలెన్స్, పోలీసులను ప్రయోగిస్తున్న సర్కార్ కార్పొరేట్లకు అండగా నిలబడిందని విమర్శించారు. పాపిరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని కాలేజీలు మూతపడే ప్రమాదముందని హెచ్చరించారు. మళ్లీ బీఆర్ఎస్ వస్తే ఆయా సంస్థల చావు తప్పదనుకుంటే, సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. తాను ఉన్నత విద్యామండలి చైర్మెన్‌గా ఉన్న సమయంలో ఆయా కాలేజీలపై విజిలెన్స్ వేయాలని ఒత్తిడి తెచ్చినా తాను వ్యతిరేకించినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రాధాన్యతాంశాల్లో విద్య వైద్యం లేదంటూ, ఇదే విషయాన్ని చాలాసార్లు సమీక్షల్లో కూడా సీఎం చెప్పారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ మళ్లీ వచ్చి ఇవే విధానాలు కొనసాగితే 75 శాతం కాలేజీలు రెండు, మూడేండ్లలో మూతపడటం ఖాయమన్నారు. వాస్తవాల ఆధారంగా ఉన్న అవకాశాలను పరిశీలించాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ నాగయ్య, సీనియర్ కరస్పాండెంట్ సుభాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేదరికం తగ్గలేదు

న్యూఢిల్లీ : ప్రపంచబ్యాంక్ నివేదిక ప్రకారం 2018లో 151.79 మిలియన్ల భారతీయులు పేదరికంతో అలమటించగా 2019లో ఆ సంఖ్య 176.09 మిలియన్లకు పెరిగింది. అంటే ఆ సంవత్సరంలో పేదల సంఖ్య సుమారు 24 మిలియన్లు పెరిగిందన్న మాట. 2018లో మన దేశంలో పేదరిక రేటు 11.09% ఉంటే 2021లో 11.9%గా నమోదైంది. అయితే ఈ రేటు 2020లో చాలా ఎక్కువగా అంటే 14.72%గా ఉంది.

ప్రపంచబ్యాంక్ లెక్కల ప్రకారం కొనుగోలు శక్తి ఆధారంగా తీవ్రమైన పేదరిక రేటు అంటే రోజుకు రూ.180. కేంద్ర ప్రభుత్వం వద్ద 2011-12 నుండి కుటుంబ వినియోగదారుల వ్యయ సర్వే (సీఈఎస్) సమాచారం అందుబాటులో లేదు. దీంతో మన దేశంలో పేదరికానికి సంబంధించిన అంచనాల కోసం 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ' సంస్థ పైనే ప్రపంచబ్యాంక్ ఆధారపడింది. ఈ సంస్థ జరిపిన సర్వేలో వెల్లడైన సమాచారాన్ని తన అంచనాల కోసం ఉపయోగించుకుంది. 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించిన సీఈఎస్‌ల ఫలితాలు సార్వత్రిక ఎన్నికల తర్వాతే వెల్లడయ్యే అవకాశం ఉంది. 2017-18లో ప్రభుత్వం ఇలాంటి సర్వేని జరిపినప్పటికీ వివరాలు బహిర్గతం చేయలేదు. అయితే బయటికి పొక్కిన సమాచారం ప్రకారం పేదరిక స్థాయి బాగా పెరిగింది. గత 45 సంవత్సరాలలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం 2018లో గరిష్ట స్థాయికి చేరింది. కోవిడ్‌కు ముందు 2018-19లో పేదరికం పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయని ఒకప్పటి ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు ఎన్‌సీ సక్సేనా చెప్పారు. ప్రభుత్వం 2017-18లో నిర్వహించిన వినియోగ సర్వే ప్రకారమే పేదరికం పెరి గింది. 2005-15 మధ్యకాలంలో నిర్మాణాలలో పెట్టుబడులు బాగా పెరిగాయి. 2015 తర్వాత అవి తగ్గిపోయాయి. దీంతో నిర్మాణ రంగంలో ఉపాధి పొందిన వారు ఉద్యోగాలు కోల్పోయారు. వాస్తవ వేతనాలలో పెరుగుదల లేదని గణాంకా లు చెబుతున్నాయి. కార్మికుల సంఖ్య కూడా పెద్దగా పెరగలేదు. దీనివల్ల చాలా మందికి ఉద్యో గాలు లేకపోవడమో లేదా వారు ఉద్యోగాల కోసం వెదకడమో జరిగింది. మన దేశంలో 2019లో అత్యంత పేదలుగా ఉన్న వారి సంఖ్యకు సం బంధించి తాను వేసిన అంచనాలను ప్రపంచబ్యాంక్ సవరించింది. కడు పేదరి కాన్ని అనుభవిస్తున్న వారి సంఖ్యను 136.81 మిలియన్లుగా చూపిన ప్రపంచ బ్యాంక్, ఆ తర్వాత దానిని సవరించి 176.09గా నమోదు చేసింది. కోవిడ్ కారణంగా 2020లో 56 మిలియన్ల భారతీయు లు అత్యంత పేదరికంలో మగ్గిపోయారు.

అంతా గోప్యమే...!

(మొదటిపేజీ తరువాయి)

ఈ మార్పులు ప్రారంభమయ్యాయి. పారిశ్రామిక ఉత్పత్తిని లెక్కించే పద్ధతి కూడా మారింది. దీంతో కేవలం 'కాగితాల'పై మాత్రమే ఉత్పత్తి పెరుగుతోంది.2017-18కి సంబంధించి కార్మికుల సంఖ్యపై చేసిన సర్వే ఫలితాలు 2018 చివరలో అందుబాటులో ఉన్నప్పటికీ 2019 ఎన్నికలు పూర్తయ్యే వరకూ వాటిని బయట పెట్టలేదు. ఎందుకంటే ఆ కాలంలో ఉద్యోగ కల్పన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండడమో లేదా తగ్గడమో జరిగింది. మరో దారుణమైన విషయ మేమంటే 2017-18కి సంబంధించి వినియోగ వ్యయంపై జరిపిన సర్వే ఫలితాలను వెల్లడించేం దుకు కూడా ప్రభుత్వం నిరాకరించింది. అయితే ఆ నివేదికను కొందరు పాత్రికేయులు బయటపెట్టారు. 2011-12 నుండి 2017-18 వరకూ గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం తగ్గిందని, అదే సమయంలో పేదరికం పెరిగిందని ఆ సర్వే తెలిపింది. అప్పటి నుండీ నేటి వరకూ దేశంలో వినియోగ సర్వే జరగనే లేదు. పేదరికం, ఆహార వినియోగం, అసమానతలు వంటి విషయాలలో వాస్తవాలు తెలుసుకోవాలంటే ఈ సర్వే జరపడం చాలా అవసరం. అయితే 2011 - 12 తర్వాత అంటే దశాబ్ద కాలం పాటు ఈ కీలక సూచికలపై ఎలాంటి సమాచారం అందుబాటులో లేదు. పేదరికంపై అత్యవసరమైన సమాచారం అందుబాటులో లేకపోవడంతో నీతి ఆయోగ్ సొంత సూచికను అభివృద్ధి చేసింది. అయితే ఈ సూచిక ఏం చెబుతోంది? గత దశాబ్ద కాలంలో పేదరికం తగ్గిందట.

2011 లెక్కలే ఆధారం

కోవిడ్ అనంతరం దేశంలో జనజీవనం సాధారణ స్థాయికి చేరినప్పటికీ జనగణనను వాయిదా వేయడానికి ప్రభుత్వం కోవిడ్‌ను సాకుగా చూపుతోంది. సార్వత్రిక ఎన్నికల తర్వాతే జనాభా లెక్కల సేకరణ జరిపే అవకాశం ఉంది. ఇప్పుడు దేనికైనా 2011 జనగణన లెక్కలే ఆధారంగా ఉంటున్నాయి. అంటే మౌలిక సమాచారం లేకుండానే ప్రభుత్వం పనిచేస్తోందన్న మాట. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టేందుకు ప్రయత్నించగా కేంద్రం అడ్డుకుంది.

ప్రణాళికలు సైతం...

2019-21 సంవత్సరాలకు సంబంధించి జరిపిన కుటుంబ ఆరోగ్య సర్వే ఫలితాలు ప్రభుత్వ వాదనకు భిన్నంగా ఉన్నాయి. దీనిని జీర్ణించుకోలేని మోడీ ప్రభుత్వం సర్వే సంస్థపై పసలేని ఆరోపణలు మోపి సస్పెండ్ చేసింది. తద్వారా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేలా ఉండే ఫలితాలను ప్రచురించవద్దని ప్రస్తుత సర్వే నిర్వాహకులకు పరోక్షంగా సంకేతాలు పంపింది. సర్వేలు నిగ్గు తేల్చిన వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకపోతే వివిధ అంశాలకు సంబంధించి ప్రభుత్వం ఏ విధంగా విధానాలను రూపొందిస్తుందని జయతీ ఘోష్ ప్రశ్నించారు. ప్రభుత్వం రూపొందించుకున్న ప్రణాళికలు కూడా బయటకు రావడం లేదు. గంగ కార్యాచరణ ప్రణాళిక నేటికీ విడుదల కాలేదు.

బిజినెస్

ఆర్ఎంఎస్ఐని మరింత విస్తరిస్తాం



- ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోగలం
- నష్టాలను తగ్గించగల ప్రణాళికలు వేస్తాం
- ఆర్ఎంఎస్ఐ సస్టైనెబిలిటీ ఎస్వీపీ పుష్పేంద్ర వెల్లడి

హైదరాబాద్ : గ్లోబల్ డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్ టెక్ దిగ్గజ సంస్థ ఆర్ఎంఎస్ఐ గ్రూపును మరింత విస్తరించనున్నట్లు ఆ సంస్థ సస్టెయినిబిలిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పుష్పేంద్ర జోహరి తెలిపారు. నోయిడాలోని కార్యాలయాన్ని మరో అంతస్తును పెంచుతున్నామన్నారు. కొత్తగా 500 మంది ఉద్యోగులను తీసుకోనున్నామని చెప్పారు. హైదరాబాద్‌ని హైటెక్స్‌లో వాతావరణంలో మార్పులపై జరిగిన జియోస్మార్ట్ ఇండియా సమావేశానికి హాజరైన జోహరి మీడియాతో మాట్లాడారు. ఆర్ఎంఎస్ఐ విస్తరణ ప్రణాళికలు కొనసాగుతున్నాయన్నారు. ప్రధానంగా మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా దేశాలపై దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు. తమ వ్యాపారాలను కొత్త కోణాల్లో తీసుకెళ్లడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇందుకోసం టెలికం, లార్జ్ మ్యాపింగ్ కంపెనీలతో కలిసి పని చేయనున్నామన్నారు.

"ఆర్ఎంఎస్ఐ ప్రాథమికంగా ప్రకృతి వైపరీత్యాల ప్రభావాలను అంచనా వేస్తుందన్నారు. నోయిడా కేంద్రంగా పని చేస్తోన్న మా సంస్థ హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో కార్యాలయాలను కలిగి ఉందన్నారు. ఆర్ఎంఎస్ఐలో ప్రపంచవ్యాప్తంగా 5వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే 3వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. మరో వెయ్యి మంది నోయిడాలో ఉన్నారు. విదేశాల్లో వెయ్యికి పైగా ఉద్యోగులు పని చేస్తున్నారు. 40 దేశాలతో కలిసి పని చేస్తున్నాం. నోయిడా, హైదరాబాద్, డెహ్రాడూన్‌లో అభివృద్ధి కేంద్రాలను కలిగి ఉన్నాం. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్, మిడిల్ ఈస్ట్, బహ్రెయిన్‌లో అనుబంధ సంస్థలతో జియోస్పాటికల్ రంగంలో రాణిస్తున్నాం" అని జోహరి తెలిపారు. ఆర్ఎంఎస్ఐ క్రాపాలిటిక్స్ సబ్సిడీసంస్థ వ్యవసాయ పరిష్కారాలను అందిస్తుందని జోహరి తెలిపారు. ఈ తరహా స్టార్టప్ సంస్థను ఏర్పాటు చేయడం దేశంలోనే తొలిసారి అని పేర్కొన్నారు.

లాట్ మొబైల్స్‌లో దసరా దమాకా ఆఫర్లు



హైదరాబాద్ : ప్రస్తుత పండగ సీజన్‌ను అందిపుచ్చుకోవడానికి స్మార్ట్ మొబైల్ ఫోన్ల రిటైల్ చెయిన్ లాట్ మొబైల్స్ భారీ ఆఫర్లను అందిస్తున్నట్టు తెలిపింది. దసరా పండుగను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చామని లాట్ మొబైల్స్ డైరెక్టర్ ఎం అఖిల్ తెలిపారు. వినియోగదారులు కొనుగోళ్లపై ఖచ్చితమైన బహుమతితో పాటు రూ.10 వేల వరకు క్యాష్‌బ్యాక్‌ను పొందే వీలుందని పేర్కొన్నారు. ఎంపిక చేసిన మోడల్ మొబైల్స్, ఇతర వస్తువులను కొనుగోలు చేసే వారికి జీరో డౌన్ పేమెంట్‌తో కూడిన రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. 24 నెలల వ్యవధితో కూడిన నో కాస్ట్ ఈఎంఐ సదుపాయాన్ని ఎంచుకోవచ్చన్నారు. అదే విధంగా రూ.999కే స్మార్ట్ వాచ్, సౌండ్ బార్ ఊఫర్‌తో కూడిన స్మార్ట్ టి కాంబో ఆఫర్, అన్ని బ్రాండెడ్ యాక్సెసరీలు, ఇతర వస్తువుల కొనుగోళ్లపై 60శాతం వరకు తక్షణ డిస్కౌంట్‌ను ఇస్తున్నామని అఖిల్ తెలిపారు. రూ.8,999 ప్రారంభ ధరతో స్మార్ట్ టీవీ, రూ.16,500 ధరతో ల్యాప్‌టాప్‌లు లభించనున్నాయని కంపెనీ మరో డైరెక్టర్ సుప్రజ వెల్లడించారు. స్మార్ట్ టీవీపై రూ.7,499 వరకు, ల్యాప్‌టాప్‌పై రూ.4 వేల వరకు క్యాష్‌బ్యాక్, స్మార్ట్ టీవీని కొనుగోలు చేసిన వారికి రూ.17,999 విలువైన సౌండ్ బార్ ఊఫర్‌ను కేవలం రూ.5,999కే అందిస్తున్నామన్నారు. డెబిట్ కార్డ్‌పై రూ.1 డౌన్‌పేమెంట్‌తోనూ ఉత్పత్తులను కొనుగోలు చేయవచ్చన్నారు. ఈ ఆఫర్లను వినియోగదారులు ఉపయోగించుకోవాలన్నారు.

అమెజాన్ పేలో రూపే కార్డ్‌పై ఇఎంఐ..!

న్యూఢిల్లీ : పండగ సీజన్ నేపథ్యంలో అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2023 ఆన్ లైన్ షాపింగ్ వినియోగదారులకు అమెజాన్ పే 'రుపే క్రెడిట్ కార్డ్స్‌పై ఈఎంఐ'ని పరిచయం చేసింది. ఎనిమిది బ్యాంక్‌లు జారీ చేసే రూపే క్రెడిట్ కార్డులపై ఈ సౌలభ్యాన్ని అందిస్తున్నామని అమెజాన్ పే ఇండియా క్రెడిట్ అండ్ లెండింగ్ డైరెక్టర్ మయాంక్ జైన్ తెలపారు. తమ ఖాతాదారులకు అమేజాన్ పే లేటర్, అమెజాన్ పే వాలెట్, యూపీఏ తదితర చెల్లింపు ఆప్షన్స్‌ను కల్పిస్తున్నామన్నారు.

నోకియాలో 14వేల ఉద్యోగులపై వేటు..

న్యూఢిల్లీ : టెక్ కంపెనీల్లో ఉద్యోగాలకు భద్రత లేకుండా పోతోంది. తాజాగా వ్యయ నియంత్రణలో భాగంగా నోకియా తమ 14,000 మంది ఉద్యోగులపై వేటు వేయనున్నట్టు ప్రకటించింది. ఉత్తర అమెరికా సహా కీలక మార్కెట్లలో 5జీ పరికరాలకు డిమాండ్ తగ్గడంతో.. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో అమ్మకాలు 20 శాతం పడిపోయాయి. ఈ క్రమంలో ఖర్చులను తగ్గించుకునే పనిలో వేలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపిస్తోంది. 2026 నాటికి 14 శాతం నిర్వహణ లాభాలను ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 14వేల మంది సిబ్బందికి ఉద్వాసన పలకడం ద్వారా కంపెనీ ఉద్యోగుల సంఖ్య 72వేలకు తగ్గనుందని నోకియా పేర్కొంది. 2024లో 400 మిలియన్ల యూరోలు, 2025లో 300 మిలియన్ల యూరోల మేరకు ఖర్చును తగ్గించుకోవాలని నిర్దేశించుకున్నామని నోకియా సిఇఒ పెక్కా లాండ్‌మార్క్ పేర్కొన్నారు.

మణిపాల్ హెల్త్‌మ్యాప్ చేతికి మెడిక్స్ పాథ్‌ల్యాబ్స్

హైదరాబాద్ : బెంగళూరు కేంద్రంగా పని చేస్తోన్న డయాగ్నొస్టిక్ సేవల సంస్థ అయిన మణిపాల్ హెల్త్‌మ్యాప్ తాజాగా హైదరాబాద్‌లోని మెడిక్స్ పాథ్‌ల్యాబ్స్‌ను స్వాధీనం చేసుకుంది. మెడిక్స్‌లో గతేడాది ఏప్రిల్‌లో 84 శాతం వాటాను రూ.100 కోట్లకు మణిపాల్ హెల్త్‌మ్యాప్ కొనుగోలు చేసింది. మిగిలిన 16 శాతం వాటాను తాజాగా కొనుగోలు చేసి.. సంస్థను పూర్తిగా చేజిక్కించుకుంది. దీంతో 16 రాష్ట్రాల్లో 100కు పైగా డయాగ్నొస్టిక్ సేవల కేంద్రాలతో సంస్థ సేవలు అందిస్తున్నట్టు అవుతుంది. దాదాపు 50 లక్షల మంది వినియోగదార్లకు సేవలు అందించే సామర్థ్యానికి చేరామని మణిపాల్ హెల్త్‌మ్యాప్ సీఈఓ సందీప్ శర్మ పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాల మధ్య 40శాతం పెరిగిన రద్దీ

- రెడ్‌బస్ సీఈఓ ప్రకాష్ వెల్లడి

హైదరాబాద్ : ప్రస్తుత దసరా పండగ సీజన్ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య టికెట్ బుకింగ్‌లలో 40 శాతం పెరుగుదల కన్పించిందని ఆన్‌లైన్ బస్ టికెటింగ్ వేదిక రెడ్‌బస్ తెలిపింది. పరిశ్రమ గణంకాల ప్రకారం.. గడిచిన 14 రోజుల్లో ఈ రద్దీ చోటు చేసుకుందని ఆ సంస్థ గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. హాలిడే సీజన్ సందర్భంగా హైదరాబాదీలు చాలామంది బాపట్ల, మచిలీపట్నం, రామోజీ ఫిల్మ్ సిటీలకు వెళ్తున్నారని పేర్కొంది. మరోవైపు తిరుపతి, శ్రీశైలం, అన్నవరం దేవస్థానాలకు కూడా ఎక్కువగా వెళుతున్నారని తెలిపింది. పండుగల సమయంలో రోజుకు 3.2 లక్షల మంది ప్రయాణిస్తారని రెడ్‌బస్ సీఈఓ ప్రకాష్ సంగం అంచనా వేశారు.

ఇంటి వద్ద నుంచే 30 నిమిషాల్లోనే పసిడి రుణం

- ముత్తూట్ ఫిన్‌కార్ప్ యాప్‌తో అవకాశం

న్యూఢిల్లీ : ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్ ఇటీవల ఆవిష్కరించిన ముత్తూట్ ఫిన్‌కార్ప్ వన్ ద్వారా కేవలం 30 నిమిషాల్లో ఇంటి నుండి లేదా బ్రాంచ్‌లో బంగారం ఋణాలను పొందవచ్చని ఆ సంస్థ తెలిపింది. ఇదే తరహాలో ఎంఎస్ఎంఇలకు కూడా అప్పులు ఇవ్వనున్నట్లు పేర్కొంది. తమ యాప్‌లో డిజిటల్ గోల్డ్, ఎన్‌సీడీ వంటి పెట్టుబడి ఉత్పత్తులను సైతం అందిస్తున్నట్లు వెల్లడించింది.

ఎన్నికల పండుగ



- బతుకమ్మ, దసరా కానుకల జోరు
- దీపావళికీ ఇదే తంతు
- నిన్నటి వరకు వినాయక... ప్రస్తుతం దేవి నవరాత్రుల జాతర
- పండుగల పేర పరోక్షంగా ప్రలోభాలు
- ఓటర్లకు వివిధ రూపాల్లో గాలమేస్తోన్న అభ్యర్థులు
- ఈసీ నిఘా కండ్లు కప్పి పంపిణీకి ఏర్పాట్లు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి (మేకల కృష్ణ)

ప్రతి ఏటా పండుగలు ఆయా సీజన్లలో వస్తుండటం సహజంగా జరిగే ప్రక్రియ.. కానీ.. ఈ సీజన్‌లో ఎన్నికల పండుగకూడా కలిసిరావడం విశేషం. వినాయక, దేవీ నవరాత్రుల ఉత్సవాలు, బతుకమ్మ, దసరా, దీపావళి పండగలన్నీ ఎన్నికల వేళలో రావడంతో పండగే పండగ అన్నట్టుగా జోరు కనిపిస్తోంది. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు అనేక రకాల ఆఫర్లు పెడుతున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఏదో ఒక రూపంలో ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో లీడర్లున్నారు. నగదు, నగలు, కానుకలు, చీరలు, మద్యం, మాంసం ఇలా అనేకం పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈసీ నిఘా పెట్టి ఎంత తనిఖీ చేసినా అనేక మార్గాల్లో వీటిని తరలిస్తూ పంపిణీ చేస్తుండటం గమనార్హం.



దేవీ నవరాత్రి ఉత్సవాల ఖర్చులు భరిస్తున్న లీడర్లు

సాధారణంగా గణేష్, దేవీ నవరాత్రి ఉత్సవాలను ఆయా కాలనీల అసోషియేషన్లు, యువజన సంఘాలు ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహిస్తాయి. వేడుకలకు అయ్యే ఖర్చులు తలా ఇంత చందాల రూపంలో వసూలు చేసి భరిస్తుంటారు. ఈ సారి వినాకయ చవితి సందర్భంగా విగ్రహానికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు టోక్‌గా కవర్లలో పెట్టి పంపిణీ చేశారు. దుబ్బాక, సంగారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఆశావహులందరూ పోటీ పడి విగ్రహాల ఏర్పాటుకు డబ్బులిచ్చారని తెలిసింది. దేవీ నవరాత్రి ఉత్సవాలకు అభ్యర్థులు డబ్బులిచ్చి యువతను, కాలనీ వాసుల్ని ఆకట్టుకుంటున్నారు. ఫౌండేషన్ల పేరిట డబ్బులు కవర్లలో పెట్టి నిర్వాహకులకు అందజేస్తున్నారు. విగ్రహాల వద్దకు పూజలకు హాజరై పొలిటికల్ మైలేజీ పొందుతున్నారు. అన్నదానం పేరిట జరిగే కార్యక్రమాలకు హాజరవుతూ ఖర్చులు అభ్యర్థులే ఇచ్చిపోతున్నారు.

బతుకమ్మ, దసరా కానుకలు

బతుకమ్మ పండగ ఊరూవాడా జరుగుతోంది. దసరా పండగకు కూడా సన్నద్ధమవుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఖరీదైన చీరలు పంచి మహిళల్ని ఆకర్షించేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు పోటీలు పడుతున్నారు. వెండి, బంగారం నగలు పంపిణీ చేసేందుకు నమ్మకమైన ఎస్ఎహెచ్ గ్రూపు లీడర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. బతుకమ్మ చీరల పంపిణీ ఆగిపోయినందున ఖరీదైన చీరల్ని కొనుగోలు చేస్తున్నారు. కొందరేమో చీరలు, బట్టలు కొనేందుకు డబ్బులిస్తున్నారు. టిఫిన్ బాక్సులు, గృహోపకరణాలు, టీవీలు, సెల్‌ఫోన్స్, వంట వస్తువుల్ని కూడా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. దసరా పండగ రోజున ఇంటింటికీ కిలో మటన్, చికెన్‌తో పాటు మద్యం సీసాలు అందజేసేందుకు బూత్ కమిటీల వారీగా బాధ్యతలు అప్పజెప్పి, సరఫరాకూ అవసరమైన ఏర్పాట్లు చేసినట్టు తెలిసింది. పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్, మెదక్, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, నర్సాపూర్ నియోజకవర్గాలతో పాటు సిద్ధిపేట నియోజకవర్గంలోనూ తాయిలాలు ఇచ్చేందుకు అభ్యర్థులు సిద్ధం చేసుకుంటున్నారు. దసరాకే కాదు దీపావళి పండుగ కూడా ఎన్నికల వేళ ఉండటంతో తాయిలాలిచ్చి ప్రచారం చేయాలని చూస్తున్నారు.

పలుకుబడిని బట్టి ఎమౌంట్, గిఫ్టులు

ఎన్నికలొచ్చినందున ఇప్పటి వరకు అసంతృప్తి నాయకుల్ని మచ్చిక చేసుకునేందుకు అభ్యర్థులు బేరసారాలు నడిపారు. రోజువారి ఖర్చులు కూడా చెల్లిస్తున్నారు. ప్రధానమైన రెండు రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో ప్రచారానికి కదలాలంటే ఖర్చులు ఇవ్వాల్సిందే అన్నట్టుగా నడుస్తోంది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మండల పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులకు ప్రజల్లో ఉన్న పలుకుబడిని బట్టి ఖర్చులకు డబ్బులిస్తున్నారు. దేనికైనా అదనంగా డబ్బులు చెల్లిస్తే తప్ప కదలని పరిస్థితి ఉందని ఓ పార్టీకి చెందిన కీలక నాయకుడు తెలిపారు. కొన్నిచోట్ల రెబల్ అభ్యర్థులు కూడా డబ్బులు పంపిణీ చేస్తున్నారు. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాలైన జహీరాబాద్, అందోల్‌లో కూడా పోటీ పడి ప్రలోభాలకు గురిచేస్తూ భారీ ఎత్తున తాయిలాలిస్తున్నారు.

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్నాటక, ఏపీ, ఒడిశా, బీహార్ ఇతర రాష్ట్రాల నుంచి వలసొచ్చి కంపెనీల్లో ఉపాధి పొందుతున్నారు. పారిశ్రామిక వాడల్లో నివాసముంటున్నందున వీరికి ఓటు హక్కు కల్పించారు. ఓటు హక్కు ఉన్న వలస కార్మికులకు రవాణా ఖర్చులతో పాటు పండగ కోసం నగదు, వస్తువులు కూడా ఇస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఆయా పార్టీల అభ్యర్థులు నియోజకవర్గాల వారీగా ఓటు హక్కు ఉన్న వలస కార్మికుల్ని పోలింగ్ బూతు వారీగా జాబితా తయారు చేశారు.

మీకు రూ.6,016 పింఛన్

- వికలాంగులకు మంత్రి కేటీఆర్ హామీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ పార్టీ ముచ్చటగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టటం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఈసారి గెలిచి అధికారంలోకి వచ్చాక వికలాంగుల పింఛన్‌ను రూ.6,016కు పెంచుతామని ఆయన హామీనిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 'వికలాంగుల కృతజ్ఞత' సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ లాంటి నాయకుడు ఉంటేనే వికలాంగులకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఇప్పటి వరకూ వారి కోసం తమ ప్రభుత్వం రూ.10,300 కోట్లను ఖర్చు చేసిందని తెలిపారు. మొత్తం 2.25 లక్షల వాహనాలను వికలాంగులకు అందజేశామని వివరించారు. వారికి వినికిడి యంత్రాలను పంపిణీ చేయటంతోపాటు ఐదు శాతం రిజర్వేషన్లను కల్పించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. గుజరాత్‌లో వైకల్య శాతాన్నిబట్టి పింఛన్లు ఇస్తున్నారని గుర్తు చేశారు. ఛత్తీస్‌ఘడ్‌లో వికలాంగులకు కేవలం రూ.200 పింఛన్ మాత్రమే వస్తోందని చెప్పారు. ఆయా రాష్ట్రాల్లో పరిస్థితి ఇలా ఉంటే... కాంగ్రెస్, బీజేపీ నేతలు ఇక్కడికొచ్చి లేని పోని అబద్దాలు చెబుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు.


రాహుల్‌వి అసంబద్ధపు వ్యాఖ్యలు

- మంత్రి సింగిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పర్యటిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అవినీతి, కుటుంబ పాలన గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని రాష్ట్ర మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఆయన చేసివన్నీ అసంబద్ధపు వ్యాఖ్యలంటూ కొట్టిపారేశారు. గురువారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో సింగిరెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. గతంలో బోఫోర్స్ కుంభకోణంతో తన తండ్రి రాజీవ్ గాంధీ అధికారం కోల్పోయిన విషయాన్ని రాహుల్ మరిచారా..? అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రూ.23 లక్షల మంది రైతులకు తమ ప్రభుత్వం రూ.13 వేల కోట్లను మాఫీ చేస్తే... అసలు రుణమాఫీయే జరగలేదంటూ కాంగ్రెస్ అగ్రనేత మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు.

ఢిల్లీ మద్యం కేసులో సిసోడియా కస్టడీ పొడిగింపు



న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టు అయిన మనీశ్ సిసోదియాకు కోర్టులో మళ్లీ ఊరట లభించలేదు. ఆయనకు విధించిన జ్యుడిషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు పొడిగించింది. నవంబరు 22 వరకు కస్టడీ కొనసాగుతుందని న్యాయస్థానం పేర్కొంది. ఇదిలా ఉండగా.. ఢిల్లీ లిక్కర్ స్కాంలో మనీశ్ సిసోడియాను సీబీఐ ఫిబ్రవరి 26న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ తరవాత ఆయన జైలు శిక్ష కూడా అనుభవించారు. అరెస్టు అయినప్పటి నుంచి ఆయన కస్టడీలోనే ఉన్నారు. సిసోదియాను నిరవధికంగా జైల్లో ఉంచలేమని సుప్రీంకోర్టు ఇటీవల స్పష్టం చేసిన విషయం తెలిసిందే. లిక్కర్ స్కాంలో డాక్యుమెంట్లను తనిఖీ చేయాలని నిందితుల తరపు న్యాయవాదులను కోర్టు ఆదేశించింది. ఢిల్లీ లిక్కర్ స్కాం, మనీలాండరింగ్ కేసుల్లో వేర్వేరుగా దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ల తీర్పును కోర్టు రిజర్వ్ చేసింది. తాజాగా ఢిల్లీ కోర్టు ఈ కేసు విచారణను వాయిదా వేస్తూ.. నవంబరు 22 వరకు కస్టడీని పొడిగించింది.

అరణ్య భవన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

హైదరాబాద్‌లోని అరణ్య భవన్(అటవీశాఖ ప్రధాన కార్యాలయం)లో బతుకమ్మ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్ ఆర్ఎం. డోబ్రియల్, ఉన్నతాధికారులు సువర్ణ, సునీతా భగవత్, రామలింగం, సైదులు, అధికారుల సతీమణులు వినీతా డోబ్రియాల్, సంగీత, కిరణ్, పీకే.ఝా, సీబీ.మాలసి, రంజితారెడ్డి, శర్మపాండే, ఇతర అధికారుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మరో ముగ్గురికి బీఆర్ఎస్ బీ-ఫామ్‌లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ నుంచి గురువారం మరో ముగ్గురు అభ్యర్థులు బీ-ఫామ్‌లను అందుకున్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు, ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు, ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి... సీఎం కేసీఆర్ వాటిని అందజేశారు. దీంతో ఇప్పటి వరకూ ఆ పార్టీ నుంచి బీ-ఫామ్‌లు అందుకున్న వారి సంఖ్య 107కు చేరింది.

ఎన్ఈపీని రద్దు చేయాలి

- పౌర సంఘాల డిమాండ్

చెన్నై : కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకొచ్చిన వివాదాస్పద జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)ను రద్దు చేయాలని పౌర సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు 'ఎన్ఈపీ నుంచి విద్యను కాపాడాలి' పేరుతో చెన్నైలోని లయోలా కాలేజీలో కాన్ఫరెన్సును ఏర్పాటు చేశాయి. 36 పౌర సంఘాలు ఇందులో పాల్గొన్నాయి. విద్యా మంత్రిత్వ శాఖను పక్కకు బెట్టి రాష్ట్రపతి అధ్యక్షతన ఉన్నత స్థాయి రాష్ట్రీయ శిక్షా ఆయోగ్‌ను ఏర్పాటు చేయటంపై పౌర సంఘాలు కేంద్రం తీరును విమర్శించాయి. ఈ సమావేశానికి కేరళ ఉన్న విద్య మంత్రి ఆర్. బిందు ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. ఎన్ఈపీ విద్యా విధానం విషయంలో కేంద్రం అనుసరించిన తీరును ఆమె విమర్శించారు. దీనిపై అధ్యయనం జరగలేదన్నారు. తమిళం, తెలుగు, మళయాలం, కన్నడ, ఒడియా భాషలు కేవలం రూ.29 కోట్లు నిధులను పొందాయని డీఎంకే ఎమ్మెల్యే తిరువళవర్ తెలిపారు. ఈ సమావేశానికి యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జె. గాంధీ రాజ్ అధ్యక్షత వహించారు. విద్యావేత్త అయేషా నటరాజన్, ఆర్థికవేత్త వెంకటేశ్ ఆత్రేయ, రచయిత అద్వాన్ దీక్షన్య, ఇతరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈసీ నుంచి పాస్ పొందిన జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణతోసహా త్వరలో నాలుగు రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా జర్నలిస్టులు, 12 ఇతర విభాగాలకు చెందిన ఉద్యోగులకు ఈసీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించింది. ఎఫ్‌సీఐ, ఏఏఐ, పీఐబీ, ఎయిర్, విద్యుత్ శాఖ, రైల్వే, వైద్యరోగ్య శాఖ, ఆర్టీసీ, పౌరసరాఫరాల శాఖ, బీఎస్ఎన్ఎల్, వార్తల సేకరణ కోసం ఈసీ నుంచి పాస్ పొందిన జర్నలిస్టులు, ఫైర్ సిబ్బందికి కొత్తగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు. వీరంతా నవంబర్ ఏడవ తేదీలోగా ఫారం-12 డీ రూపంలో దరఖాస్తు చేయాలి. కాగా, కొత్త ఓటర్లకు నెలాఖరు నుంచి ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ జరగనుంది. ఈఏడాది రెండు విడతలుగా ఓటర్ల జాబితా ప్రకటించారు. 2023 జనవరి నుంచి కొత్తగా 40 లక్షల దరఖాస్తులను అధికారులు పరిష్కరించారు. జనవరి ఒకటి నుంచి 27 లక్షల 50వేలకు పైగా ఓటరు గుర్తింపు కార్డులను ముద్రించి తపాలా శాఖ ద్వారా ఓటర్ల చిరునామాలకే పంపించారు. ఆ తర్వాత కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారికి సంబంధించిన గుర్తింపు కార్డుల ముద్రణ కోసం ఇప్పటికే ఆర్డర్ చర్యలు తీసుకున్నారు. మిగిలిన వారి కార్డుల ముద్రణ పూర్తి చేసి పంపిణీ చేయనున్నారు.

వచ్చే నెలలో కుల సర్వే సమాచారం బహిర్గతం

- బీహార్ సర్కారు నిర్ణయం

పాట్నా : ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కుల సర్వే(జాతి ఆధారిత్ గణన) సంబంధించిన సామాజిక ఆర్థిక సమాచారాన్ని బహిర్గతం చేయడానికి బీహార్ సర్కారు నిర్ణయించింది. ఈ విషయాన్ని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కేంద్రంలోని బీజేపీని రాజకీయంగా ఎదుర్కోవటానికి, హిందూత్వకు కౌంటర్‌గా ఈ గణాంకాలను వ్యూహాత్మకంగా వినియోగించటానికి బీహార్ సీఎం నితీశ్ కుమార్.. ఆర్జేడీ చీఫ్, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్‌ను ఇటీవల రెండు సార్లు కలిసినట్టు తెలిపాయి. " సామాజిక ఆర్థిక సమాచారంతో పాటు కుల సర్వే సమాచారాన్ని ప్రభుత్వం శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెడుతుంది. భవిష్యత్తులో తీసుకోబోయే తదుపరి కార్యాచరణ గురించి ఇందులో చర్చ జరగనున్నది" అని జేడీయూ అధికార ప్రతినిధి, బీహార్ మాజీ మంత్రి నీరజ్ కుమార్ అన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఇది కీలక మలుపు కానున్నదని ఆయన చెప్పారు. కుల సర్వేకు సంబంధించిన సమాచారాన్ని అసెంబ్లీలో ప్రవేశపెడతామని నితీశ్ సర్కారు గతవారమే స్పష్టం చేసిన విషయం విదితమే. బీహార్ సర్కారు నిర్వహించిన ఈ కులగణన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు వచ్చే ఏడాది జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఇది చర్చకు వచ్చే అవకాశం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు తెలుపుతున్నారు.


నేడు బీజేపి పార్లమెంటరీ పార్టీ బోర్డు భేటీ

- మొదటి జాబితాలో 60 నుంచి 70 సీట్లు ప్రకటించే అవకాశం

న్యూఢిల్లీ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ అభ్యర్థుల ఎంపిక కసరత్తు తుది దశకు చేరింది. నేడు అభ్యర్థుల ఎంపికకు సంబంధించి బీజేపీ పార్లమెంటరీ పార్టీ బోర్డు(సీఈసీ) భేటి కానుంది. దీన్ దయాళ్ మార్గ్‌లోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సీఈసీ భేటి కానుంది. ఈ భేటిలో ప్రధాని మోడీ, పార్టీ అధ్యక్షుడు నడ్డా, పార్లమెంటరీ పార్టీ బోర్డు సభ్యులు అమిత్ షా, శివరాజ్ సింగ్ చౌహాన్, లక్ష్మణ్ తదితరులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల అభ్యర్థుల ఎంపికపై నిర్ణయం తీసుకోనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. అనంతరం అభ్యర్థుల జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది. 119 స్థానాలు ఉన్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు దాదాపు 60 నుంచి 70 మందితో కూడిన మొదటి జాబితా విడుదల చేసే అవకాశముంది. ఇందులో పార్టీ సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలకు చోటు కల్పించనున్నారు.

మరోవైపు బీజేపి పార్లమెంటరీ పార్టీ భేటి నేపథ్యంలో గురువారం బీజేపి రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం జరిగింది. బీజేపి రాష్ట్ర ఎన్నికల ఇంచార్జ్ ప్రకాశ్ జవదేకర్ నివాసంలో సమావేశమైంది. తుగ్లక్ రోడ్డు 2లోని జవదేకర్ నివాసంలో మధ్యాహ్నం 1 గంట నుంచి 4 గంటల వరకు సాగింది. ఈ భేటీలో రాష్ట్ర ఇంచార్జ్ తరుణ్ చుగ్, అధ్యక్షులు కిషన్ రెడ్డి, పార్లమెంటరీ పార్టీ మెంబర్ కె. లక్ష్మణ్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, ఎన్నికల సహ ఇంచార్జ్ సునీల్ బన్సల్ తదితరులు పాల్గొన్నారు. సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో రాష్ట్రంలోని 119 స్థానాలకు సంబంధించిన అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేశారు. సాయంత్రం పలు దఫాలుగా పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో రాష్ట్ర కోర్ కమిటీ భేటీ అయింది. ఈ సందర్భంగా అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన తుది జాబితాపై చర్చించింది. భిన్న అభిప్రాయాలు, క్లిష్టంగా ఉన్న స్థానాలపై నడ్డాల పలు మార్పులు చేర్పులు సూచించినట్లు తెలిసింది. దీని ఆధారంగా నేడు ఉదయం 11 గంటలకు మరోసారి నడ్డాతో రాష్ట్ర కమిటీ భేటి కానున్నట్టు సమాచారం. ఈ భేటిలో తుది జాబితా రూపొందించి, సాయంత్రం జరిగే పార్లమెంటరీ పార్టీ బోర్డు భేటీలో ఈ జాబితాకు ఆమోద ముద్ర వేసే అవకాశం ఉంది.

మంచిర్యాలలో ఎఎంపిఎల్ సర్వీస్ కేంద్రం ఏర్పాటు



హైదరాబాద్ : ఆటోమోటివ్ మాన్యుఫాక్చరర్స్ ప్రయివేటు లిమిటెడ్ (ఎఎంపిఎల్) తన అత్యాధునిక సర్వీసు కేంద్రాన్ని రాష్ట్రంలోని మంచిర్యాలలో ప్రారంభించింది. దీంతో ఈ ప్రాంతంలోని వినియోగదారులకు అసాధారణ రీచ్, సేవలను అందించడంలో తన నిబద్ధతను కొనసాగించనుందని ఎఎంపిఎల్ ఇడి రాజీవ్ సంఘ్వీ తెలిపారు. 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో అశోక్ లేలాండ్‌కు చెందిన అన్ని రకాల వాహనాలకు సర్వీసింగ్‌ను అందించనుందన్నారు. అశోక్ లేలాండ్ వాహనాలకు ఉన్న అతిపెద్ద డీలర్లలో ఒకటైన ఆటోమోటివ్.. వందకు పైగా సర్వీసు స్టేషన్ల విస్తృతమైన నెట్‌వర్క్‌ను కలిగి ఉంది.

హైదరాబాద్ రియాల్టీ అమ్మకాల్లో 30% వృద్ధి

- నైట్‌ఫ్రాంక్ వెల్లడి

హైదరాబాద్ : నగరంలో రియాల్టీ రిజిస్ట్రేషన్లలో వృద్ధి చోటు చేసుకుందని నైట్‌ఫ్రాంక్ ఇండియా వెల్లడించింది. ప్రస్తుత ఏడాది సెప్టెంబర్‌లో నగరంలో రికార్డు స్థాయిలో 30 శాతంగా వృద్ధి చోటు చేసుకుందని పేర్కొంది. తాజా నివేదిక ప్రకారం 2022 సెప్టెంబర్‌లో 4,766 రిజిస్ట్రేషన్లు నమోదు కాగా, ఈ ఏడాది అదే నెలలో 6,185 రిజిస్ట్రేషన్లు జరిగాయని వెల్లడించింది. వీటి మొత్తం ఆస్తుల విలువ రూ.3,378 కోట్లుగా ఉంది. విలువ పరంగా గతేడాదితో పోలిస్తే 42 శాతం పెరిగింది. నివాస గహాల మార్కెట్‌లో హైదరాబాద్ జిల్లాతో పాటు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలను పరిగణలోకి తీసుకుంది.


ఏథర్ కనెక్టర్‌కు బిఐఎస్ ఆమోదం

న్యూఢిల్లీ : దేశంలో తేలికపాటి విద్యుత్ వాహనాల కోసం చార్జింగ్ స్టాండర్డ్‌గా ఏథర్ అభివృద్ధి చేసిన కనెక్టర్‌కు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆమోదం లభించింది. దేశంలోనే తొలిసారిగా దేశీయంగా అభివద్ధి చేసిన ఎసి, డిసి కంబైన్డ్ ఛార్జింగ్ కనెక్టర్‌కు గుర్తింపు దక్కిందని పేర్కొంది. ఇది లైట్ ఎలక్ట్రిక్ వాహనాల కోసం ప్రపంచంలోనే మొట్టమొదటి కంబైన్డ్ ఛార్జింగ్ కనెక్టర్ ప్రమాణమని ఏథర్ పేర్కొంది.

సామ్‌సంగ్ నుంచి కొత్త ఎ05 స్మార్ట్‌ఫోన్

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీదారు సామ్‌సంగ్ గురువారం గెలాక్సీ ఎ సీరిస్‌లో గెలాక్సీ ఎ05ను విడుదల చేసింది. క్వాల్‌కోమ్ స్నాప్‌డ్రాగన్ 680 ప్రాసెసర్, 12జిబి ర్యామ్‌తో దీన్ని ఆవిష్కరించింది.

నవంబర్ 1 వరకూ చంద్రబాబుకు రిమాండ్



రాజమహేంద్రవరం : స్కిల్ స్కామ్ కేసులో నిందితునిగా ఉన్న టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు జ్యుడీషియల్ రిమాండ్‌ను నవంబర్ 1 వరకూ ఏసీబీ న్యాయస్థానం పొడిగించింది. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సెంట్రల్‌జైలులో ఆయన 40 రోజులుగా రిమాండ్ ఖైదీగా ఉన్నారు. గురువారంతో రిమాండ్ గడువు ముగియడంతో చంద్రబాబును జైలు అధికారులు వర్చువల్‌గా ఏసీబీ న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిని ఏసీబీ న్యాయమూర్తి అడిగి తెలుసుకున్నారు. తన భద్రత విషయంలో కొన్ని అనుమానాలు ఉన్నాయని చంద్రబాబు న్యాయమూర్తికి తెలిపారు. ఏమైనా అనుమానాలు ఉంటే రాతపూర్వకంగా ఇవ్వాలని న్యాయమూర్తి చంద్రబాబుకు సూచించారు. చంద్రబాబు రాసే లేఖను తనకు పంపించాలని జైలు అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు. చంద్రబాబు ఆరోగ్యంపై జైలు అధికారులను ప్రశ్నించారు. మెడికల్ రిపోర్టులను ఎప్పటికప్పుడు కోర్టుకు సబ్‌మిట్ చేయాలని ఆదేశించారు. అనంతరం రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారు. లీగల్ ములాఖత్‌ను పెంచాలని, రోజుకు మూడు ములాఖత్‌లు ఇవ్వాలని చంద్రబాబు తరుపు న్యాయవాదులు ఎసిబి కోర్టులో పిటీషన్లు దాఖలు చేశారు.

శ్రీశైలం యాదవ్‌ను పరామర్శించిన నర్సింహారెడ్డి



నవతెలంగాణ- బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ చైర్మన్ యాతం శ్రీశైలం యాదవ్‌ను గురువారం నాదర్గుల్ గ్రామంలో బడంగ్ పేట్ నగర పంచాయతీ మాజీ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి పరామర్శించారు. తర్వాత అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆనంద్ రెడ్డి, తిరుపతి రెడ్డి, బంగారి అశోక్, లింగారెడ్డి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్ యాదవ్ బాబు తదితరులు ఉన్నారు.

మందకృష్ణను కలసిన శ్రీరాములు



నవతెలంగాణ - బడంగ్ పేట్

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగను గురువారం మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోరుతూ అలంపూర్ నుండి హైదరాబాద్ వరకు కృష్ణన్న పాదయాత్ర చేస్తున్నారని చెప్పారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మల్లాపూర్ కడారి బీరప్ప ఫంక్షన్ హాల్లో బస చేసిన మంద కృష్ణ మాదిగతో కాసేపు భేటీ అయ్యామన్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఎస్సీ మోర్చా నాయకులు గడ్డం వెంకటేష్, చిత్రం శ్రీను, కౌన్సిలర్ బుడమల యాదగిరి, బీజేపీ, బీజేవైఎం, ఎమ్మార్పీఎస్ నాయకులు సుజాత, బొర్ర రవి, ఉపేందర్, పి.రాములు పాల్గొన్నారు.

మహేశ్వరం అభివృద్ధి ప్రదాత మంత్రి సబితమ్మ



- జల్‌పల్లి మున్సిపల్ యూత్ వింగ్ అధ్యక్షులు యాంజాల అర్జున్

నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి ప్రదాత మంత్రి సబితా ఇంద్రారెడ్డి అని జల్‌పల్లి మున్సిపల్ యూత్ వింగ్ అధ్యక్షులు యాంజాల అర్జున్ అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన పలువురు, జల్‌పల్లికి చెందిన 40 మంది బీజేపీ కార్యకర్తలు అర్జున్ ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి గులాబీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. బీఆర్ఎస్ పథకాలు గడపగడపకూ చేరవేయాలని సూచించారు. కేసీఆర్ సర్కార్‌ను ఆశీర్వదించి..హ్యాట్రిక్ సీఎం గా గెలిపించాలని కోరారు. తనను కూడా భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మరింత బాధ్యతగా పని చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జల్ పల్లి మాజీ సర్పంచ్, ప్రస్తుతం మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి, జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసి డెంట్ యంజాల జనార్దన్, జల్‌పల్లి మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు దూడల శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయ కులు సూరెడ్డి సత్తిరెడ్డి, పోలేమోని నాగేష్ ముదిరాజ్, సూరెడ్డి గోపాల్ రెడ్డి, యంజాల రవి పాల్గొన్నారు.

వాకర్స్‌ను కలసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ - హయత్‌నగర్

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని హరిణ వనస్థలి నందు పలువురు వాకర్స్ సభ్యులను గురువారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వాకర్స్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న యోగా షెడ్ వెడల్పు, ఓపెన్ జిమ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఈ వాకింగ్ ట్రాక్ నందు యోగా కోసం మేమే షెడ్ వేయించామని గుర్తుచేశారు. షెడ్ వెడల్పు, ఓపెన్ జిమ్స్‌లను కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఈ పార్క్ నందు కాంత్స్ స్థలాన్ని తప్పుడు పత్రాలను సృష్టించి, కొందరు దళారులు అమ్ముకున్నారని చెప్పారు. జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పార్క్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించి..భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, మాజీ అధ్యక్షులు జగదీష్ యాదవ్, విజయ్ భాస్కర్ రెడ్డి, అశోక్ యాదవ్, భాస్కర్ యాదవ్, రాకేశ్, వాకర్స్ సభ్యులు విక్రమ్ రెడ్డి, విద్యాసాగర్ రావు, ఉపేందర్ రావ్, కృష్ణ గౌడ్, భిక్షపతి యాదవ్, మహేందర్ రెడ్డి, నరేందర్ గుప్తా, మల్లేష్, గోపి నాయక్, జగన్ రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రియాల్టర్ల హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు



నవతెలంగాణ- హయత్ నగర్

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం పట్నం నియోజకవర్గ పరిధిలో ఉన్న కర్ణంగూడలోని లేక్‌విల్లా ఆర్చిడ్స్‌లో నెలకొన్న భూ వివాదాలపై శ్రీనివాస్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డిల హత్య కేసులో ప్రధాన నిందితుడు మేరెడ్డి మట్టారెడ్డితో పాటుగా ఖాజా మొయినుద్దీన్, భిక్షపతిలకు రంగారెడ్డి కోర్టు గురువారం జీవిత ఖైదీలుగా తీర్పునిచ్చిందని రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేందర్ సింగ్ చౌహాన్ తెలిపారు. గురువారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో కేసు పూర్వపరాలను సీపీ వెల్లడించారు. ఇబ్రహీం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కర్ణంగూడ గ్రామ సమీపంలో ఇద్దరు భాగస్వాములైన రియల్ ఎస్టేట్ వ్యాపారులు శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిలు 10 ఎకరాల భూమి కొన్నారు. కానీ అప్పటికే ఆ భూమి తనదేనంటూ మట్టారెడ్డి దాన్ని కబ్జా చేశారు. ఈ విషయంలో వీరి మధ్య గొడవలు జరుగుతున్న క్రమంలో శ్రీనివాస్ రెడ్డి మరో వ్యక్తితో కలిసి సైట్ వద్దకు వెళ్లారు. అక్కడే ఉన్న మట్టారెడ్డితో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో 2022 సంవత్సరం మార్చి 1వ తేదీ మంగళవారం ఉదయం మట్టారెడ్డి ఇతరులతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డిపై కాల్పులు జరిపారు. శ్రీనివాస్‌రెడ్డి అక్కడికక్కడే చనిపోగా, రాఘవేందర్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హత్య అనంతరం మృతుల రెండు కుటుంబాల సభ్యులు కూడా మట్టారెడ్డిపైనే అనుమానం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులకు విచారణ మరింత సులువైంది. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ జరపగా మట్టారెడ్డే సుపారీ గ్యాంగ్‌తో ఈ హత్యలు చేయించినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ కేసులో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అప్పటి ఇబ్రహీం పట్నం ఏసీపీ బాలకృష్ణ రెడ్డిని పోలీస్ శాఖ విధుల నుండి తప్పించి, శాఖపరమైన చర్యలు తీసుకుంది. ఆ కేసును ప్రస్తుతం రాచకొండ ఎస్ బీ ఏసీపీ శ్రీధర్ రెడ్డి పర్యవేక్షణలో ఫాస్ట్రాక్ కోర్ట్ ద్వారా నిందితులకు శిక్షలు పడేలా చేశామని సీపీ వెల్లడించారు. తప్పు చేసిన నేరస్తులు ఎంతటి వారైనా చట్టం నుండి తప్పించుకోలేరు అనడానికి ఇబ్రహీం కేస్ నిదర్శనం అని పేర్కొన్నారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో గరుడ వాహనంపై స్వామి



నవతెలంగాణ- వనస్థలిపురం

వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు 5వ రోజు అంగరంగ వైభవంగా జరిగాయి. గురువారం ఉదయం 5 గంటలకు మంగళ వాయిద్యాలు, సుప్రభాత సేవ, తిరువారాధన, సహస్ర నామార్చన, స్వర్ణ పుష్పార్చన ఉత్సవమూర్తులకు అభిషేకం, హాయ గ్రీవ హోమం, గరుడ వాహనంపై తిరువీధి ఉత్సవం, శ్రీవారి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం తిరువీధి ఉత్సవం, యాగశాల నందు పంచసూక్త హోమములు, రాత్రి 9:30 గంటలకు పవళింపు సేవ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేద పండితుల నేతృత్వంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ కమిటీ చైర్మన్ కే. లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, కో- చైర్మన్ కేఎల్ గణపతి, వైస్ చైర్మన్లు జగదీష్ కుమార్, పాపారావు, కే.సత్తయ్య, కోశాధికారి కే. శ్రీధర్, సంయుక్త కార్యదర్శి పి. శ్యామల, సహాయ కోశాధికారి కే. రామలక్ష్మి, సాంబ శివరావు, సునీల్ కుమార్ గౌడ్, వెంకటేశ్వరరావు, రమేష్ బాబు, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.13కోట్ల నగదు, మద్యం పట్టుకున్నాం

సీపీ దేవేందర్ సింగ్ చౌహాన్



నవతెలంగాణ - హయత్ నగర్

రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకూ అక్రమంగా రవాణా చేసిన నగదు, బంగారం, వెండి, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, మొత్తం వాటి విలువ రూ.13కోట్లు ఉంటుందని సీపీ దేవేందర్ సింగ్ చౌహన్ చెప్పారు. గురువారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతీ ఓటరు తమ తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా వుండే విధంగా చూడాల్సిన బాధ్యత రాచకొండ పోలీసులపై ఉందన్నారు. అందుకు ప్రజలు సైతం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం రూ.9కోట్ల నగదు, 3500లీటర్ల మద్యం, 5కేజీల బంగారం, వెండి స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. గురువారం చైతన్య పురి స్టేషన్ పరిధిలో ఓమ్ని హాస్పిటల్ వద్ద సికింద్రాబాద్ కు చెందిన కడిరిక రాజేష్ నుండి 97,16,865లక్షల నగదు ను పట్టుకున్నట్లు తెలిపారు. ఒక రూ.లక్షకు మించి నగదు ఎవరైనా తమ వెంట తీసుకుని వెళ్ళేటప్పుడు తగిన ఆధారాలను కలిగి ఉండాలని సూచించారు.

వాహనాల తనిఖీల్లో రూ.2 లక్షల 41వేలు స్వాధీనం



నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ జలంధర్ రెడ్డి నేతృత్వంలో గురువారం వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐలు మాధవరెడ్డి, జగన్, ఏడుకొండలు, నర్సింగ్ రాథోడ్‌లు సాయిబ్ నగర్ హనుమాన్ విగ్రహం వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా స్నేహమై నగరకు చెందిన వెంకటేశ్వరరావు కారులో రూ.1,20,000లను స్వాధీనం చేసుకున్నారు. సుష్మా చౌరస్తా వద్ద చేసిన తనిఖీల్లో మొహమ్మద్ అబ్దుల్ బషీర్ కారులో రూ.లక్ష ఇరవై ఒక్క వెయ్యి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సమర్పిస్తే బాధితులకు ఆ నగదును అందజేస్తామని సీఐ జలంధర్‌రెడ్డి తెలిపారు.

'కేసీఆర్ నియంత పాలనకు చరమగీతం పాడాలి'



నవతెలంగాణ- బడంగ్ పేట్

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ నియంత పాలనకు చరమగీతం పాడాలని బడంగ్ పేట్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 12, 13, 14 వార్డులకు చెందిన పలువురు భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. బీఆర్ ఎస్ ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయి ఉన్నారని, వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని అధిక మెజార్టీతో గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలరాజు గౌడ్, హాలిమ్, అంజయ్య శ్రీశైలం యాదవ్, వినయ్ యాదవ్, వెంకటేష్, హరి బాబు, బాబు, ఎం.డి ఇబ్రాహీం తదితరులు పాల్గొన్నారు.

'అత్యధిక మెజార్టీతో సబితమ్మను గెలిపించుకుంటాం'



నవతెలంగాణ - చైతన్యపురి

విద్యా శాఖ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సబితా ఇంద్రా రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ఆర్కే పురం డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ జాహిద్ అన్నారు. ఈ మేరకు గురువారం మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. 100 పడ కల ఆసుపత్రి, మెడికల్ కాలేజ్, ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కళాశాల, మెట్రో రైలు విస్తరణ లాంటి పథకాలు తీసుకురావడంతో భవిష్యత్‌లో తుక్కు గూడ మరో హైటెక్ సిటీగా మారబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జహంగీర్, సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

ఇంద్రసేనారెడ్డిని కలసిన శ్రీరాములు



నవతెలంగాణ- బడంగ్ పేట్

మలక్‌పేట మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ అధ్యక్షులు నల్లు ఇంద్రసేనా రెడ్డిని గురువారం మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడానికి ఎన్నో కార్యక్రమాలను ప్రతీ ఇంటికి సుపరిచితమైన ఇంద్రన్నకు భగవంతుని దీవన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టులో ఏర్పాటు చేసిన రీ-చెక్ యువర్ ఓటు కౌంటర్ పరిశీలన

- న్యాయవాదులకు అవగాహన కల్పించిన ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్





నవతెలంగాణ-సిటీబ్యూరో

ఓటరు ఐడీ కార్డు ఉన్నంత మాత్రాన మీ ఓటు చెల్లదని తుది ఓటరు జాబితాలో మీ పేరును రీ-చెక్ చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. గురువారం హైకోర్టులో స్వీప్ ఆక్టివిటీ కింద ఏర్పాటు చేసిన రీ-చెక్ యువర్ ఓట్ కౌంటర్‌ను డిప్యూటీ డీ.ఈ.ఓ అనుదీప్ దురిశెట్టితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రిజిస్టర్ ప్రొటోకాల్ శ్రీధర్ రావు, ప్రొటోకాల్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ నర్సింగ్ రావులతో పాటు హైకోర్టు జడ్జీలు, న్యాయవాదులు, సిబ్బందితో మాట్లాడి ఓటరు జాబితాలో తమ పేరును ఎలా చెక్ చేసుకోవాలో అవగాహన కల్పించారు. **voter.eci.gov.in, voter helpline app** ద్వారా ఓటరు జాబితాలో మీ పేరును చెక్ చేసుకోవచ్చని తెలిపారు. ఇతర సందేహాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1950 ను సంప్రదించాలని ఎన్నికల అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న, స్వీప్ నోడల్ ఆఫీసర్ అబ్దుల్ వకీల్, డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్, జాయింట్ కమిషనర్ మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి.. మరింత అభివృద్ధి చేస్తా

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి



నవతెలంగాణ-తుర్కయంజాల్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి అవకాశం ఇవ్వండి.. మరింత అభివృద్ధి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని గురువారం తుర్కయంజాల్‌లోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్‌లో మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వేముల అమరేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పార్టీ ఎన్నికల ఇంచార్జి తీగల కృష్ణారెడ్డితో కలిసి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ చైర్ పర్సన్ అధికారంలో ఉన్నప్పటికీ ప్రత్యేక నిధులు కేటాయించి..ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఇంటింటికీ తాగునీరందించాలనే ఉద్దేశంతో తుర్కయంజాల్ మున్సిపాలిటీకి రూ.96 కోట్లు నిధులు కేటాయించామని గుర్తు చేశారు. గ్రామ పంచాయతీలుగా ఉంటే నష్టం జరుగుతుందనే దూరదృష్టితో నియోజకవర్గంలో నాలుగు మున్సిపాలిటీలు ఏర్పాటు చేశామన్నారు. రొక్కం భీంరెడ్డి పార్టీలో చేరడంతో బీఆర్ఎస్ పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ఒక్క రోజు ముందు రూ.15 కోట్ల ప్రభుత్వ నిధులు తెచ్చుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ట్రంక్ లైన్ నిర్మాణానికి రూ.7 కోట్ల నిధులు కేటాయిస్తే, నిలుపుదల చేసి అభివృద్ధికి అడ్డంకిగా కాంగ్రెస్ కౌన్సిలర్లు మారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌కే దిక్కులేదు.. ఆరు గ్యారెంటీలు ఎక్కడనుండి ఇస్తారని ఎద్దేవా చేశారు.

ప్రభుత్వం మారితే అభివృద్ధి మందగిస్తుంది...

ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదరిస్తే కొనసాగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేసుకుంటామన్నారు. ప్రభుత్వం మారితే అభివృద్ధి మందగిస్తుందన్నారు. నిధుల కొరత ఏర్పడుతుందని చెప్పారు. మున్సిపాటీలో ఉన్న 129 కాలనీలు కాక విస్తరిస్తున్న కాలనీలను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 90 నుండి 100 సీట్లు బీఆర్ఎస్ పార్టీ గెలిచి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పే మోసపూరిత మాటలకు లొంగకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మంచిరెడ్డి కిషన్ రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, సహకార బ్యాంకు డైరెక్టర్ జక్క రాంరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు పోరెడ్డి నర్సింహ రెడ్డి, గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ మాజీ చైర్మన్ ముత్యం రెడ్డి, కౌన్సిలర్లు వేముల స్వాతి, పుల్ల గుర్రం కీర్తన విజయానంద్ రెడ్డి, సిద్దాల జ్యోతి, సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ కందాడ లక్ష్మారెడ్డి, నాయకులు రొక్కం చంద్ర శేఖర్ రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, బొక్క గౌతమ్ రెడ్డి, పల్సమ్ బుచ్చయ్య గౌడ్, కాకుమాను చిన్నయ్య, పోలిశెట్టి ప్రేమ్ కుమార్, గుండ్ల రాజిరెడ్డి, జొన్నాడ సుదర్శన్ రెడ్డి, బొడ్డు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని మార్చాలంటూ ఆ పార్టీ శ్రేణుల ధర్నా



- రేవంత్ రెడ్డి టికెట్ల దందా అంటూ వెల్లువెత్తిన ఆగ్రహం..
- సునీతారావును ఓడిస్తామంటూ మిన్నంటిన నినాదాలు

నవతెలంగాణ - ధూల్ పేట్

గోషామహల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీతారావును వెంటనే మార్చి, స్థానికులకే టికెట్ ఇవ్వాలని ఆ పార్టీ శ్రేణులు గురువారం డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి తమకిచ్చిన హామీకి భిన్నంగా వ్యవహరిస్తున్నారంటూ తీవ్ర స్థాయిలో దుయ్యబట్టారు. టికెట్ దందాకు తెరలేపి కోట్ల రూపాయలు, స్థలాలు తీసుకుని అభ్యర్థిత్వాలు ఖరారు చేశారంటూ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. రేవంత్ రెడ్డి నీ రేటు ఎంత అంటూ నినాదాలు చేస్తూ నాంపల్లి గాంధీ భవన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ లోకల్, నియోజకవర్గం భౌగోళిక ఎల్లలు, ఎన్నివార్డులున్నాయో తెలియని సునీతారావుకు టికెట్ ఇవ్వడం సరికాదన్నారు. దరఖాస్తు పెట్టుకోకున్నా పార్టీ టికెట్ ఇవ్వడాన్ని తాము ఎట్టిపరిస్థితుల్లో సహించేదిలేదన్నారు. ఆమెను ఎన్నికల్లో ఓడిస్తామని, రేవంత్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోషామహల్ మినీ ఇండియాలా అన్ని వర్గాలు, జాతులు, రాష్ట్రాల వారున్నారని, బస్తీలు, కాలనీలు, ఏరియాపై అవగాహన ఉండాలన్నారు. సునీతారావును వెంటనే మార్చి, స్థానికులకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పలు చోట్ల అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన నాయకులు



నవతెలంగాణ - వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్ శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో మహాలక్ష్మి రూపంలో ఉన్న అమ్మవారిని రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిలు గురువారం దర్శించుకున్నారు. తర్వాత ప్రత్యేక పూజలు చేశారు. కాలనీ ప్రధాన కార్యదర్శి ముడుపు సందీప్ రెడ్డి, సంతోష్ రెడ్డి, పార్టీ నాయకులు అశోక్, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు కిశోర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - సంతోష్ నగర్



మలక్ పేట్ నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుక ఎల్లమ్మ ఆలయం కమిటీ సభ్యులు డి. శ్యామ్ కుమార్ ఆలయంలో కమిటీ సభ్యులు ప్రవీణ్, శేఖర్, యాదన్న, మల్లేష్, బాబు, అమర్, వెంకటరెడ్డి, మైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నవతెలంగాణ - చైతన్యపురి



మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ పరిధిలోని మార్గదర్శి కాలనీలో భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాతను గురువారం రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి దర్శించుకున్నారు. తర్వాత ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు శ్రావణ్, మహేష్, నాగరాజు, ప్రవీణ్ , నానవల జ్ఞానేశ్వర్ యాదవ్, శేఖర్ ముదిరాజ్, విప్లవ్, నగేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - నాగోల్



హైదరాబాద్‌లోని కొత్తపేట, మోహన్ నగర్‌లో శ్రీశ్రీశ్రీ చిత్తారమ్మ దేవాలయంలో గురువారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత కార్పొరేటర్ పవన్‌తో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు

నవతెలంగాణ- సంతోష్ నగర్



మలక్‌పేట్ నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో కళాశాల చైర్మన్ డాక్టర్ కె. శ్రీనివాసరావు, సెక్రెటరీ ఎమ్. కృష్ణ కుమార్, జైంట్ సెక్రెటరీ ఎంపి వాసుదేవరావు, ట్రెజరర్ జై. సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ డి. హనుమంతరావు పాల్గొన్నారు.

నవతెలంగాణ - నాగోల్



లంగర్ హౌస్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం వైభవంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ఐవీఎఫ్ అధ్యక్షులు, టూరిజం మాజీ చైర్మన్ శ్రీ ఉప్పల శ్రీనివాస్ గుప్త, హైదరాబాద్ రేంజ్ డీఐజీ (జైల్) డాక్టర్ దుదిల్ల శ్రీనివాస్ డిఐజి (జైల్) హైదరాబాద్ రేంజ్‌లు, బీజేపీ రాష్ట్ర సెక్రెటరీ ఉమా రాణి, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఐటీసి తెలంగాణ తోట కిరణ్ కుమారి, లంగర్ హౌస్ ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - ధూల్ పేట్



ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో బతుకమ్మ సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి నాగేందర్, ఆర్ఎంఓలు, సిబ్బంది, యంత్రాంగం బతుకమ్మ దాండియా ఆడి సందడి చేశారు.

'చంద్రబాబు సంపూర్ణ ఆరోగ్యంతో బయటకు రావాలి'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఏపీ మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా చంద్రబాబు నాయుడు సంపూర్ణ ఆరోగ్యంతో బయటకు రావాలని కోరుతూ జూబ్లీహిల్స్ లోని పెద్దమ్మ తల్లికి బంగారు బోనం సమర్పించినట్లు సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ జాతీయ అధ్యక్షులు గొంటి కుమార్ చౌదరి యాదవ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు విక్రమ్ కుమార్ యాదవ్, మారమోని శ్రీశైలం యాదవ్, గోపాలకృష్ణ చౌదరి, గౌరీ శంకర్ నాయుడు, చంద్రశేఖర్ నాయుడు, శ్రీష, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



కోఠి సుల్తాన్ బజార్ మెటర్నటీ ఆస్పత్రిలో గురువారం ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ -సుల్తాన్ బజార్

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను అన్ని వసతులతో సిద్ధం చేయాలి



- ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్
- డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈవీఎం ల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను (డీ.ఆర్.సీ) అన్ని వసతులతో సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా ఉప ఎన్నికల అధికారి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య, అదనపు పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్ లతో కలిసి నగరంలోని పలు నియోజకవర్గాలకు సంబంధించిన ఏర్పాటు చేసే డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మొదటగా ఎల్బీస్టేడియంలోని ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి డి.ఆర్.సి లను సందర్శించి ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన డీ.ఆర్.సి కేంద్రాన్ని ఏవీ కాలేజీలో ఏర్పాటుకు ప్రతిపాదించారు. నిజాం కాలేజీలో ఏర్పాటు చేసే చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల డీఆర్సీలను సందర్శించి ఏమైనా మరమ్మతులు ఉంటే త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గోషామహల్ నియోజకవర్గానికి కోటి ఉమెన్స్ కాలేజ్ లో డి.ఆర్.సి కేంద్రం, కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసే చార్మినార్, సరోజినీ నాయుడు వనిత మహా విద్యాలయంలో ఏర్పాటు చేసే యాకత్ పుర నియోజకవర్గం డి.ఆర్.సి కేంద్రాలను తనిఖీ చేశారు. జే.ఎన్.టీ.యూ ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటుచేసే నాంపల్లి నియోజకవర్గ డీ.ఆర్.సీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ మాసబ్ ట్యాంక్ లో ఏర్పాటు చేసే కార్వాన్ నియోజకవర్గం డీ.ఆర్.సీ, సాంకేతిక విద్య భవన్‌లో ఏర్పాటు చేసే బహదూర్ పుర నియోజకవర్గం డీ.ఆర్.సీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఎన్నికల అధికారులు, పోలీసు అధికారులు తప్పిదాలు జరగకుండా జాగ్రత్తగా ఈవీఎంలను భద్రపరిచే కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరారు. ఈ.వీ.ఎం లను భద్రపరిచే భవనాలలో ఏవైనా మరమ్మతులు ఉంటే త్వరగా పూర్తిచేసి డీ.ఆర్.సీ కేంద్రాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర బలగాలను 24 గంటల పాటు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్‌ను కోరారు.

నిరుద్యోగులను విస్మరించిన పార్టీలను చిత్తుగా ఓడిస్తాం



- రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య

నవతెలంగాణ-అంబర్‌పేట

రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నిరుద్యోగులను పూర్తిగా విస్మరించాయని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆరోపించారు. ఆ పార్టీలు విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోలో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి ఊసే లేదని ధ్వజ మెత్తారు. నిరుద్యోగులను విస్మరించిన పార్టీలను చిత్తుగా ఓడిస్తామని ఆయన హెచ్చరించారు. గురువారం కాచి గూడ అభినందన్ గ్రాండ్ హొటల్లో బీసీ సంక్షేమ సం ఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీలా వెంకటేష్ సంయుక్త ఆధ్వర్యంలో బీసీ సంఘాలు నిరుద్యోగుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు నిరుద్యోగులకు ప్రాధాన్యత ఇచ్చాయని ప్రస్తుత ఎన్నికల్లో మాత్రం ఏ పార్టీ కూడా నిరుద్యోగులను పట్టించుకోవటం లేదన్నారు. బీఆర్ఎస్. కాంగ్రెస్ పార్టీలు మ్యానిఫెస్టోలలో ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేస్తారో స్పష్టం చేయలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, టీచర్ పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేసి ప్రభుత్వ విద్యను కాపాడాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులను విస్మరిస్తే, సహిం చేది లేదని, ప్రజలను చైతన్య వంతం చేసి ఆయా పార్టీలను ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామ హెచ్చరించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులుగా భువనగిరి సాయిబాబా నూతనంగా నియమితు లయ్యారు. ఎంపి ఆర్ కష్ణయ్య నియామక పత్రం అందజేశారు. వేలు బీసీ సం ఘాల నాయకులు కోట్ల శ్రీనివాస్ శివమ్మ నాని, శ్రీదేవి, రాజేందర్ నందగోపాల్, హేమంత్ కుమార్, శివ కృష్ణ ముదిరాజ్, మల్లేష్ యాదవ్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.





అంబర్‌పేట మునిసిపల్ గ్రౌండ్‌లో బతుకమ్మ సంబరాల అంబరాన్నంటాయి. గురువారం రాత్రి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలు సందడిగా జరిగాయి. వందలాది మంది మహిళలు పాల్గొని రంగురంగుల బతుకమ్మలను తీసుకొచ్చి, ఆడి సంబరాల చేసుకున్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట

విద్యార్థినిపై లైంగిక వేధింపులు జరిగాయంటూ విద్యార్థుల ఆందోళన

- విద్యార్థులకు రక్షణ కల్పించని వీసీ, ప్రొక్టార్ రాజీనామా చేయాలని విద్యార్థుల డిమాండ్

నవతెలంగాణ-ఓయూ

ది ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో ఓ ఎంఏ విద్యార్థిపై అర్ధరాత్రిపూట గుర్తుతెలియని వ్యక్తులు లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఇఫ్లూలో విద్యార్థులు శుక్రవారం ఆందోళనకు దిగారు. క్యాంపస్‌లో విద్యార్థులకు రక్షణ కల్పించడంలో విఫలమైన వీసీ, ప్రొక్టార్లు వారి పదవులుకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇఫ్లూలో ఎం.ఏ చదువుతున్న ఓ విద్యార్థిని గురువారం రాత్రి వాకింగ్ చేస్తున్న వేళ గుర్తు తెలియని వ్యక్తులు తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని తోటి విద్యార్థులకు తెలుపగా వారు ఓయూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. కాగా విద్యార్థినిని లైంగిక వేధింపులకు గురిచేసినవారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు పరిపాలనా భవనం ఎదుట ఆందోళనకు దిగారు. అయితే శుక్రవారం ఉదయం నుంచే ఆందోళన చేపట్టినా అధికారులు మాత్రం స్పందించడం లేదని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సంఘటనకు కారణమైన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకునే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని విద్యార్థులు తెలిపారు. ఇదిలా ఉండగా, ఇఫ్లూ క్యాంపస్‌లో విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఇఫ్లూకు వెళ్లి ఆందోళన విరమించాలని కోరారు.

వీసీ మిస్సింగ్ అంటూ పోస్టర్లు...

ఉదయం నుంచి రాత్రివరకు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని, వీసీ తన చాంబర్లో ఉంటే రావాలంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. అయితే ఎంతకు అటువైపు నుంచి స్పందన రాకపోవడంతో ఆగ్రహించిన విద్యార్థులు వీసీ మిస్సింగ్ అంటూ ఇఫ్లూ క్యాంపస్‌లో వీసీ ఫోటోతో కూడినపోస్టర్లు వేశారు. కాగా ఈ ఆందోళనపై వివరణ కోసం ప్రయత్నించగా అధికారులు ఎవరూ అందుబాటులోకి రాలేదు.

ఇఫ్లూలో ఏంఏ ఇంగ్లీష్ చదువుతున్న ఓ విద్యార్థిని బుధవారం రాత్రి 10 గంటలకు క్యాంపస్‌ఆవరణలోనే వాకింగ్కు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. సదరు విద్యార్థిని వాకింగ్ చేస్తుండగా లైటింగ్ సరిగా లేని ప్రాంతానికి రాగానే కొందరు వ్యక్తులు తనను లైంగికంగా వేధించారని సదరు విద్యార్థిని ఫిర్యాదు చేసినట్టు పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకుని బాధిత విద్యార్థిని మెడికల్ టెస్టుల కోసం గాంధీకి తరలించి అక్కడ నుంచి ఆమెను భరోసా సెంటర్ కు పంపించినట్లు ఓయూ పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. కాగా పోలీసులు సంఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్నా పుటేజీ చీకటి గా ఉందని, దీంతో ఎవరు స్పష్టంగా కనిపించడం లేదని తెలిసింది. దీనిపై పోలీసులు నిందితులను గుర్తించేందుకు దర్యాప్తును ముమ్మరం చేస్తున్నట్లు ఓయూ ఇన్స్పెక్టర్ ఆంజనేయులు పేర్కొన్నారు. మరోక వైపు గురువారం రోజంతా ఇఫ్లూ లోనే దర్యాప్తు చేస్తున్న పోలీసులకు ఎలాంటి ఆధారాలు దొరక్కలేదని తెలిసింది.

'దళితుడిని సీఎం చేయడమే లక్ష్యం'

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో దళితుడిని సీఎం చేయడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కష్ణ స్వరూప్ చెప్పారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమ సమయంలో దళితుడిని సీఎంగా చేస్తానని ప్రగల్భాలు పలికి తానే సీఎం అయి దళితులకు తీరని అన్యాయం చేశారని ధ్వజ మెత్తారు. గురువారం హిమాయత్ నగర్ లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆలేరు అసెంబ్లీ నియోజక వర్గం అభ్యర్థి పల్లవి సాంబయ్య వడ్డెరకు తొలి బీ-ఫారంను అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ, కాంగ్రెస్ వంటి దోపిడీ పార్టీలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు అత్యంత ప్రమాదకరమన్నారు. తెలంగాణలో అంబేద్కర్ సమతా రాజ్య స్థాపనే ప్రధాన లక్ష్యంతో ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పోటీ చేస్తామన్నారు. సామాజిక న్యాయ సాధన కోసం రానున్న ఎన్నికల్లో డీబీపీ అభ్యర్థులకు ఓటు వేసి ఆదరించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మనువాద పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించకపోతే దళిత బహుజన జాతులకు భవిష్యత్తు లేదని, బానిసత్వం తప్పదని చెప్పారు. ఈ సమావే శంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరం సతీష్ కుమార్, అధికార ప్రతినిధి దేవునూరి శ్రీనివాస్, సుబ్బారావు, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య నిపుణులకు వృత్తి నైపుణ్య శిక్షణ అవసరం



- ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ రెడ్డి

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

నేటి సమాజంలో అకస్మాత్తుగా వ్యాపించే వ్యాధుల పట్ల వైద్య నిపుణులకు వత్తి నైపుణ్య శిక్షణ ఎంతో అవసరమని ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ రెడ్డి అన్నారు. గురువారం కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాలలో మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎంఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు పరస్పర చర్చలతో పలు వైద్య కళాశాల వైద్య నిపుణులతో గ్రూప్ డిస్కషన్లు నిర్వహించారు. వ్యాధుల వ్యాప్తి నిర్వహణలో మైక్రో బయాలజిస్టులు, ఎపిడ మీయాలజిస్టుల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు ఈ కార్యక్రమంలో పూణే నేషనల్ ఇన్సిట్యూట్ ఆఫ్ వైరాలజీకి చెందిన సైంటిస్ట్ డాక్టర్ బాబాసాహెబ్ విశ్వనాథ్, తిరుపతి ఎస్వీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ మూర్తి, ఉస్మానియా మెడికల్ కళాశాల మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ బి.ఎం శంకర్ వెంకటేష్, వీడీఆర్ ఎల్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ సుధారాణి అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ పావని హరిత సునీత అసిస్టెంట్ ప్రొఫెసర్లు సుజాత మిష, సయ్యద్ అహ్మద్ మోహిద్దిన్ విఆర్డిఎల్ శాస్త్రవేత్తలు డాక్టర్ మొహరీన్ శ్రీనాథ్ వేముల రవి జయ సన్ సూర్య ప్రేమ్ కుమార్ రాష్ట్రంలోని వివిధ వైద్య కళాశాల వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

'మరాఠీలకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి'



నవతెలంగాణ-అంబర్‌పేట

అన్ని కులాలకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించినట్టే మరాఠీ భాష మాట్లాడే బహుసార్ క్షత్రియ సమాజ్ కులానికి కూడా ఒక ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని బవూసర్ క్షత్రియ రంగ్రేజ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సీఎం కేసీఆర్ కు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణ వ్యాప్తంగా 30 లక్షల మంది తమ కులం వారు ఉన్నారని తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ వారందరి తరపున గోషా మహల్ లో 20 సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీకి పనిచేస్తు పేదల పక్షాన సంక్షేమం కోసం కషి చేస్తున్న దిలీప్ గణాతే కు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని సీఎం కేసీఆర్ కు వారు విజ్ఞప్తి చేశారు. మహారాష్ట్రలో బీఆర్ఎస్ పార్టీకి మరాఠీ మాట్లాడే 30 లక్షల మంది తమ కుల సభ్యులు అండగా ఉండి మహారాష్ట్రలో బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తారని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సమాజ్ నాయకులు జనరల్ సెక్రెటరీ రాజేష్ కుమార్ జవల్కర్, కోశాధికారి అశ్విన్ కుమార్ పతంగే, వసంత్ బాసుద్కర్, దిలీప్ గణాతే తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల సుధాకర్ రెడ్డి ఆరోపణలు నిరాధారమైనవి



నవతెలంగాణ-అంబర్‌పేట

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి చేసిన ఆరోపణలు నిరాధారమైనవని బాగ్ అంబర్పేట్ డివిజన్ కార్పొరేటర్ పద్మావతి, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు వెంకట్ రెడ్డి అన్నారు. ఆరోపణలన్నీ నిరాధారమైనవని నిరూపించకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఏ ఆలయంలోకైనా సరే వచ్చి ఆరోపణలు చేసిన వారు తనతో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. గురువారం వారు మాట్లాడుతూ బీజేపీకి గత 40 సంవత్సరాలుగా సేవలందించానని, అంబర్‌పేట్ టికెట్ ఆశించానన్నారు. పార్టీ నుంచి ఎలాంటి స్పందన లేనందు వల్లే పార్టీ మారాల్సి వచ్చిందని తెలిపారు. పార్టీలో కార్పొరేషన్ పదవి ఇచ్చానని చెబుతున్న కిషన్ రెడ్డి పార్టీలోకి తన తర్వాతే వచ్చారని చెప్పారు. 1980లో వచ్చి పార్టీ కోసం అనేక సేవలందించానని, తన తర్వాత 2004లో వచ్చిన కిషన్ రెడ్డికి టికెట్ కేటాయించారని తెలిపారు. పార్టీలో నాకు సరైన గుర్తింపు రానందు వల్లే పార్టీ మారాల్సి వచ్చిందని తెలియజేశారు. ఓడిపోయే మలక్ పేట అసెంబ్లీ సీటులో కిషన్ రెడ్డి పోటీ చేసి తనకు అంబర్ పేట టికెట్ కేటాయించాల్సిందని.. అలాకాకుండా మలక్ పేట సీట్ కేటాయించి అసెంబ్లీ టికెట్ ఇచ్చామని ఆరోపించడం కిషన్ రెడ్డికి తగదని వెంకటరెడ్డి అన్నారు. తనకు ఎలాంటి డబ్బులు అవసరం లేదని, తన వ్యాపారాలు తనకు ఉన్నాయని, తనకు డబ్బు కొదవలేదన్నారు. ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేయడం ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు.

ఎస్.ఎఫ్.సి. పూర్వ ఉద్యోగుల అపూర్వ కలయిక



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

స్టేట్ ఫైనాన్షియల్ కార్పోరేషన్ వెటరన్స్ గిల్డ్ వారు మన దేశానికి స్వాతంత్ర్యం లభించి 75 సంవత్సరాలు అవుతున్న శుభ తరుణంలో గురువారం విశ్రాంత ఉద్యోగుల్లో 75 సంవత్సరాలు నిండిన తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లోని టి. సత్యనారాయణ, సిహెచ్. వెంకట రామయ్య, కెవిఎస్. శాస్త్రి, ఎ. పి. కుమార్, ఎం. రాజశేఖర్, సి. సత్యమూర్తి, టి.పి. బారు, వి.ప్రసాదరావు, సీతారాం బాయి, శంకు, కె. సుబ్బిరెడ్డి, ఎం. వి. నాగేశ్వరరావు, డి.కిషన్ రావు లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎం.వి. బ్రహ్మానందరావు అధ్యక్షత వహించగా, డాక్టర్. రాపోలు సుదర్శన్ వ్యాఖ్యాతగా వ్యవహరించి సభను జనరంజకంగా నడిపారు. కష్ణవేణి ప్రార్థనాగీతాన్ని ఆలపించారు. ఇంకా గిల్డ్ అధ్యక్షులు కె.ఎం. జయరావు, యువి ఎ. బాబు, ఆర్వీ రమణప్రసాద్, కె. హరిరాజు, కె.రాము, బి. సత్యనారాయణ, బాప నయ్య, ఆర్. సత్యనారాయణ, కాశీవిశ్వేశ్వరరావు, చెంగల్రాయులు, వి.రాంచందర్, ఓపి. గుప్త, బి. కష్ణయ్య, సత్యప్రసాద్, మరియమ్మ, మంజులత, టి. మల్కయ్య ఇఆర్ ఎస్.రెడ్డి, ఆచార్య జి.సురేందర్ రెడ్డి, పిఎలివి. సుబ్బారావు, వి. కష్ణమోహన్, ఎం.వి. వేణుగోపాల్, షేక్ ఆజాద్, చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. తమ ప్రసంగాల్లో ఎస్.ఎఫ్.సి.తో తమకున్న అనుబంధాన్ని, సంస్థ ఔన్నత్యాన్ని, సహ ఉద్యోగుల, ఉన్నతాధికారుల ఆత్మీయతను వ్యక్తం చేశారు.



ముషీరాబాద్ డివిజన్ కమలా నెహ్రూ నగర్ పార్సిగుట్ట వద్ద జై భవాని యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారి మండపాన్ని దర్శించుకుని పూజలు చేస్తున్న టీడీపీ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ తలారి శ్రీకాంత్ ముదిరాజ్, అసోసియేషన్ సభ్యులు యశ్, మహి, రాము, నరేష్ తదితరులు. నవతెలంగాణ - ముషీరాబాద్

తెలుగు సినీ అండ్ టీవీ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ ఎన్నికల్లో సీఐటీయూ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలుగు సినీ అండ్ టీవీ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్‌కు అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పోస్టులకు ఎన్నికలు అక్టోబర్ 29న జరుగుతున్నాయి. ఈ ఎన్నికలలో సీఐటీయూ బలపరిచిన అభ్యర్థులు అధ్యక్షులుగా సుంకరి రవీందర్, ప్రధాన కార్యదర్శిగా కె. రమావేణి, కోశాధికారిగా బి అశోక్ గురువారం జాయింట్ లేబర్ కమిషనర్ (జంట నగరాలు) లేబర్ కమిషనర్ కార్యాలయం ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద నామినేషన్ వేశారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా విచ్చేసిన సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఈశ్వర్ రావు, సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం వెంకటేష్ లు జూనియర్ ఆర్టిస్టులను ఉద్దేశించి మాట్లాడారు.

సీఐటీయూ బలపరిచిన ముగ్గురు అభ్యర్థులను జూనియర్ ఆర్టిస్టులు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 29వ తేదీన జరగనున్న ఎన్నికలు జూనియర్ ఆర్టిస్టుల తలరాతలు మార్చే ఎన్నికలని అన్నారు. ఎన్నికలలో అవకతవకలకు పాల్పడుతూ అనేక సంవత్సరాల నుంచి నాయకత్వ స్థానంలో పాతుకుపోయిన స్వామి గౌడ్, వల్లభనేని అనిల్ కుమార్‌లు పైసలకు కక్కుర్తి పడి అవినీతికి పాల్పడుతూ కార్డు హెూల్డర్స్‌ను కాకుండా నాన్ కార్డు హెూల్డర్లను షూటింగులు పంపిస్తూ నిజమైన జూనియర్ ఆర్టిస్టుల పొట్టగొడుతున్నారని విమర్శించారు. సీఐటీయూ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే కార్డు హెూల్డర్లకు మాత్రమే షూటింగులు ఇప్పిస్తామని తెలియజేశారు. ఈ ఎన్నికలు మార్పునకు నాంది పలకాలని అన్నారు. కావున ప్రతి ఒక్క జూనియర్ ఆర్టిస్టు ఓటు వేసే సందర్భంగా ఆలోచించి ఓటు వేయాలని, ఒక్కసారి సీఐటీయూ బలపరిచిన అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రస్తుత అధ్యక్షులు స్వామి గౌడ్, ప్రధాన కార్యదర్శి వల్లభనేని అనిల్ కుమార్ ల దుర్మార్గాలను ఎదిరించి, పోరాడి సీఐటీయూ తెలుగు సినిమాకు సంబంధించిన 24 క్రాఫ్ట్ యూనియన్లలో ఎప్పుడు లేని విధంగా తెలుగు సినీ అండ్ టీవీ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ ఎన్నికలను లేబర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జరిగే విధంగా కృషి చేసిందని అన్నారు. కార్మిక శాఖ అధికారులు గతంలో ఎన్నికల సందర్భంగా జరిగిన అవకతవకలను దృష్టిలో పెట్టుకొని ఈసారి ఎన్నికల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కోరారు.

ఆరోగ్యవంతమైన బాదం ఆధారిత వంటకాలను తయారీతో నవరాత్రి..

నవతెలంగాణ-సిటీబ్యూరో



నవరాత్రులు దేశంలో పండుగ మాత్రమే కాదు, విశ్వాసం, సంప్రదాయాల వేడుక. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ పండుగ ఉత్సాహభరితమైన నృత్యాలు, రంగురంగుల దుస్తులు, దుర్గా దేవి కి సామూహిక పూజల ద్వారా గుర్తించబడుతుంది. సంతోషకరమైన వేడుకల మధ్య, ఉపవాసం ఒక ప్రత్యేక సంప్రదాయంగా మిగిలిపోయింది. కానీ, ఈ వేడుకల వేళ మధురమైన కోరికలు బయటకు వస్తాయన్నది ఎవరూ కాదనలేని వాస్తవం. ఈ అభిరుచులకు అడ్డుకట్ట వేసి ఆరోగ్యకరమైన పదార్థాలను అర్థం చేసుకోవడం ముఖ్యం.

బాదంపప్పులు రుచిగా ఉంటాయి, అన్ని రకాల ఆహార పదార్థాలతో జతగా ఉంటాయి. బాదం అనేక ఆరోగ్య ప్రయోజనాలు అనేక ఆయుర్వేదం, యునాని , సిద్ధ గ్రంథాలలో వెల్లడి చేయడం జరిగింది. ప్రతిరోజూ బాదంపప్పును తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, బరువు , టైప్-2 మధుమేహం నిర్వహణలో కూడా సహాయపడుతుంది. అంతే కాకుండా, బాదంలో విటమిన్ బి2, విటమిన్ ఈ, మెగ్నీషియం, ఫాస్పరస్ పుష్కలంగా ఉన్నాయి. నవరాత్రి కోసం బాదం చన్నా మసాలా, బాదామి సంభారై వంటి ఆరోగ్యకరమైన బాదం ఆధారిత వంటకాలను ప్రయత్నించండి. వీటిని తయారు చేసుకోవటం సులభం. పోషకాలు కూడా అధికంగా ఉంటాయి. ఈ ఉపవాస వేళ ఇవి ఆరోగ్యమూ అందిస్తాయి

అన్ని పార్టీలు బీసీ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించాలి



నవతెలంగాణ - ముషీరాబాద్

అన్ని పార్టీలు బీసీ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించాలని, ఎన్నికలలో బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వకపోతే ఓడిస్తాం అని బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి. రాజ్ కుమార్ తెలిపారు. విద్యానగర్ బీసీ భవన్ లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శిగా నియమితులైన పగడాల సుధాకర్‌ను బీసీ నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం రాష్ట్ర కన్వీనర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ.అన్ని పార్టీలు బీసీలకు 20 శాతం టికెట్లు కూడా ఇవ్వడం లేదని, ఏదో ఒక సాకుతో బి.సి. లకు మొండి చెయ్యి చూపుతున్నారని అన్నారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని 40 సంవత్సరాలుగా ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో బీసీ సంఘాలు హైదరాబాద్, ఢిల్లీ పార్లమెంట్ వద్ద 900 సార్లు ధర్నాలు ప్రదర్శనలు నిర్వహించామని తెలిపారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెడితే ప్రతీ రాష్ట్రంలో బీసీలకు 50 శాతం అసెంబ్లీ స్థానాలు రిజర్వు అవుతాయని, అన్నీ రాజకీయ పార్టీలు తప్పని పరిస్థితిలో కేటాయించిన నియోజకవర్గాలు బీసీలకే ఇవ్వవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. బి.సి బిల్లుకై పోరాడదాం అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నీరడి భూపేష్ సాగర్, రాజేందర్, నాని, శివ,బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి బీజేపీ కార్యక్రమంలో భాగంగా చిక్కడపల్లి బాపూనగర్ బస్తీలో కార్పొరేటర్ పావని బీజేపీ నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో యువ నాయకులు వినయ్ కుమార్, జి.శ్రీకాంత్, ఉమేష్, సత్తి రెడ్డి, ఆకుల సురేందర్, రాజేందర్, నర్సింహ తదితర నాయకులు పాల్గొన్నారు.
నవతెలంగాణ - ముషీరాబాద్

నిమ్స్‌లో డెంటల్ క్లినిక్ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

నిమ్స్‌లో గురువారం నుండి డెంటల్ సర్వీసెస్ అందుబాటులోకి వచ్చాయి. నిమ్స్ డైరెక్టర్ బీరప్ప డెంటల్ క్లినిక్‌ని స్పెషాలిటీ బ్లాక్‌లోని గ్రౌండ్ ఫ్లోర్ రూమ్ నెంబర్ 11లో ప్రారంభించారు. ఈ క్లినిక్ రిజిస్ట్రేషన్ ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు ఉంటుంది. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డా.నిమ్మ సత్యనారాయణ, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్స్ డా.లక్ష్మీ భాస్కర్, డా.కృష్ణారెడ్డి, అసోసియేట్ డీన్ డా.సాయి సతీష్, డాక్టర్ సాయి బాబా, ఏపిఆర్ఓ ఆషారాణి, ప్రస్తుత డెంటల్ డాక్టర్ మహమ్మద్ క్వాజా మొయినుద్దీన్ పాల్గొన్నారు.

మర్రిని సన్మానించిన కార్పొరేటర్



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డిని గౌతమ్ నగర్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ బుధవారం సన్మానించారు. 141 గౌతం నగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ ఆధ్వర్యంలో BRS పార్టీ నుండి మర్రి బీ ఫామ్ తీసుకున్న సందర్భంగా ఘనంగా సన్మానించిన కార్యకర్తలు నాయకులు అభినందనాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మర్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. మల్కాజిగిరిలో తనకు మద్దతు గెలిపించాలని కోరారు. తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజక వర్గాన్ని మోడల్ మల్కాజిగిరిగా తీర్చి దిద్దుతానని తెలిపారు.

నీటి సమస్యను పరిష్కరిస్తా : ఎమ్మెల్యే



నవతెలంగాణ-మల్కాజిగిరి

ఇందిరా నెహ్రూ నగర్‌లో నీటి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం రాత్రి గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఐఎన్ నగర్‌లో బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సభలో అయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహిళా అధ్యక్షురాలు సుమలత యాదవ్ బాలరాజు యాదవ్, భరత్, విజయ్, నరేష్, శ్రీను, నిర్మల, బాలాజీ, నర్సింహా, కవిత, భాగ్య, సరళ, వజ్ర, బిక్షపతితో పాటు, సుమారు 300 మందితో ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐఎన్ నగర్ గుట్టపైన రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని ఐఎస్ నగర్‌లో వాటర్ సమస్య పరిష్కరించాలని ఇండ్లను రెగ్యులేషన్ చేయాలన్నారు. గౌతమ్ నగర్‌లో ఆర్‌యుబీ ఏర్పాటు చేయాలని తదితర సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం, చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు పథకాలను వివరించి ఐఎన్ నగర్ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, జి.ఎస్.వి సతీష్ కుమార్, పిట్ల శ్రీనివాస్, కన్నెమల్ల నాగరాజు, సంతోష్ రాందాస్, వినోద్ యాదవ్, బి కే శ్రీనివాస్, సత్యనారాయణ, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

139 డివిజన్‌లో...

139 డివిజన్ ప్రేమ్ విజయనగర్ కాలనీలో బుధవారం రాత్రి బతుకమ్మ వేడుకలలో ముఖ్యఅతిథిగా మైనంపల్లి వాణి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ డివిజన్ అధ్యక్షుడు సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, రోజా, రమణి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఢిల్లీలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆఫీసులో సుప్రీంకోర్టు అడ్వకేట్ జగన్ తెలంగాణ లో ఎన్నికల నిర్వహణ పై కేంద్ర ఎన్నికల సంఘానికి పిర్యాదు చేశారు. తెలంగాణ ఎన్నికలకు సర్వం సిద్ధం అవుతున్న వేళ, కొన్ని విషయాల్లో కేంద్ర ఎన్నికల సంఘం నిక్కచ్చిగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా 2018 లో పోటీ చేసిన అభ్యర్థుల ఆధాయాలు, ఇప్పుడు అంటే ఈ ఐదేళ్లలో విపరీతంగా పెరిగి పోయాయని, గత అఫిడవిట్, తాజాగా సమర్పించే అఫిడవిట్లను పోల్చి చూడాలని కోరారు. ఈ ఐదేళ్లలో ఆదాయం ఏ విధంగా పెరిగింది.. అక్రమ పద్ధతిలోనే, సరయిన మార్గంలోనా అనే విషయాన్ని ముందే పరిశీలించాలని కోరారు. చాలా మంది అభ్యర్థులు ఎన్నికల నియమావళి ను సరిగ్గా ఫాలో కావడం లేదని, పైగా డబ్బులు, మద్యం పంచడం తెలంగాణలో సాధారణంగా మారిపోయిందని, ఇలా చేస్తూ ఎన్నికలను ప్రహసంగా మారుస్తున్నారని, దయచేసి డబ్బు, మద్యం ప్రవాహాన్ని అరికట్టి ఓటర్లను ప్రభావితం చేయకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్ దే అని కోరారు. ప్రస్తుత సమయంలో ఎన్నికల అధికారుల నిఘా చాలా కీలకం అని తెలిపారు.

కేంద్ర ఎన్నికల సంఘానికి ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలు

1.ఓట్ల కోసం ప్రకటనలు చేసే పత్రికలు, టి.విల్లోనే క్రిమినల్ కేసులపై కూడా ప్రకటనలు ఇవ్వాలి.

1. అభ్యర్థి ఆదాయ ధృవీకరణపై పూర్తి స్థాయి పరిశీలన అవసరం 2. ఎలాంటి క్రిమినల్ కేసులు లేని అభ్యర్థులను సరయిన విధానంలో నిర్ధారించాలి. 3. ఎన్నికల్లో నేరస్థులు పోటీ చేయకుండా చూడాలి. 4. అభ్యర్థుల అఫిడవిట్‌ల పరిశీలన నిక్కచ్చిగా ఉండాలి. స్క్రూటినీ పకడ్బందీగా జరపాలి. 5. గత ఎన్నికల సందర్భంగా జరిగిన అన్ని అంశాలను ఈ సారి ఎన్నికల్లో అనుభవ పాఠాలుగా చూడాలి 6. ఎన్నికల ఖర్చులను తప్పుగా చూస్తున్న అభ్యర్థులే ఎక్కువ. అభ్యర్థులపై పర్యవేక్షణ పెంచాలి 7. తెలంగాణలో ఎన్నికల సమయంలో మద్యం పంపిణీని నియంత్రించాలి. 8. చట్టవిరుద్ధమైన చర్యలను ఎదుర్కోవాలి.

హైపోస్పాడియాస్ ఇంటర్నేషనల్ సొసైటీ అంతర్జాతీయ సదస్సుకు వివి.చంద్రశేకరం ప్రాతినిధ్యం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇటీవల టర్కీలో ముగిసిన 'వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ హైపోస్పాడియాస్ ఇంటర్నేషనల్ సొసైటీ (హెచ్ ఐ ఎస్)'లో ఆహ్వానించబడిన ఫ్యాకల్టీ మెంబర్‌గా భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం ద్వారా అంకుర హాస్పిటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ కి చెందిన చీఫ్ పీడియాట్రిక్ సర్జన్, పీడియాట్రిక్ యూరాలజిస్ట్ డాక్టర్ వీవీఎస్ చంద్రశేఖరం దేశానికి గర్వ కారణంగా నిలిచారు. డాక్టర్ చంద్రశేఖరం హైపోస్పాడియాస్ (అధశ్శిశ్న మూత్రమార్గం) పై అతిథి ఉపన్యాసం ఇచ్చారు. సైంటిఫిక్ సెషన్‌లకు అధ్యక్షత వహించారు. హైపోస్పాడియాస్ శస్త్రచికిత్స సూక్ష్మ నైపుణ్యాలపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులతో అనేక చర్చలలో పాల్గొన్నారు. అతను, అంకుర హాస్పిటల్ నుండి అతని బృందం కూడా ఈ కాంగ్రెస్ సమయంలో హైపోస్పాడియాస్‌పై రెండు పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఇది తీవ్రమైన హైపోస్పాడియాస్ యొక్క చికిత్స ఫలితాల గురించి మాట్లాడింది. హైపోస్పాడియాస్ చికిత్స పరంగా డాక్టర్ చంద్ర శేఖరం చేసిన కృషి, ఆయన అందించిన సహకారాన్ని సమావేశంలో అందరూ అభినందించారు. అతను హెచ్ ఐ ఎస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యునిగా ఏకగ్రీవంగా ప్రతిపాదించ బడటంతో పాటుగా ఎన్నుకోబ డటం మన దేశానికి గౌరవం. ఆయన ప్రపంచ కాంగ్రెస్ సమ యంలో హైపోస్పాడియాస్ పరంగా అంతర్జాతీయ వేదికపై భారతదేశం నుండి పాల్గొన్న ప్రముఖ నిపుణుడిగా నిలిచారు. ఈ సందర్భంగా అంకుర హాస్పిటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ రావు వున్నం మాట్లాడుతూ, "డాక్టర్ వివిఎస్ చంద్రశేఖరం అంకుర హాస్పిటల్‌కు మాత్రమే కాకుండా దేశం మొత్తానికి ప్రాతినిధ్యం వహించినందుకు మేము గర్విస్తున్నాము. డాక్టర్ చంద్రశేఖరం ప్రపంచవ్యాప్తంగా హైపోస్పాడియాస్ చికిత్సలో మార్గదర్శకులలో ఒకరిగా ఉద్భవించినందుకు మేము సంతోషిస్తున్నాము. హైపోస్పాడి యాస్ ఇంటర్నేషనల్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా అతని ఎన్నికను అంకుర హాస్పిటల్ వద్ద మేము అభినందిస్తున్నాము" అని అన్నారు.

హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటాం



- శ్రీ కృష్ణ నగర్ అండ్ భవాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సూరారం 129 డివిజన్ పరిధిలోని శ్రీ కృష్ణ నగర్, భవాని అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ని, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ నివాస కార్యాలయం వద్ద కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..తమకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. అడిగిన వెంటనే తమ కాలనీలో మౌలిక వసతులు కల్పించి, అభివృద్ధికి సహకరిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమ పథకాలను బస్తీ వాసులుకు అందించడానికి కృషి చేస్తునందుకు, రానున్న ఎన్నికలలో బస్తీ వాసులు అందరు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ కలిసికట్టుగా పనిచేసి ముచ్చటగా మూడవసారి అత్యధిక భారీ మెజారిటీతో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించు కుంటామని తెలిపారు. తమ బస్తీ అభివృద్ధిని ఇలాగే కొనసాగించుకుంటామని ఏకగ్రీవ తీర్మానం చేసారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, హెచ్ఏఎల్ బషీరుద్దీన్, సింహాద్రి, శ్రీనివాస్, మాణిక్యం, శీలాదేవి, లతా దేవి, సంధ్య సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి గాంధీనగర్ ప్రాంతంలో స్థానిక కల్చరల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత ఆలయం వద్ద కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గురువారం స్థానిక కార్పొరేటర్ బి. విజయ శేఖర్ గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య లు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు జల్దా రాఘవులు స్థానిక నాయకులు చింతయ్య, జల్దా లక్ష్మీనాథ్, సాయి గౌడ్, తుమ్మ నవీన్, తిమ్మయ్య, జగన్, బాలు నేత, విజయ్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

లెక్కకు మించిన నగదు సమాచారాన్ని అందించాలి

- బ్యాంకు అధికారులు తరలిస్తున్న నగదుకు సైతం డాక్యుమెంట్లు తప్పనిసరి
- గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే లావాదేవీలపై దృష్టి పెట్టాలి
- బ్యాంక్ మేనేజర్లకు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ ఆదేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల్లో అనుమానిత నగదు లావాదేవీలు, లెక్కకు మించిన నగదు అకౌంట్‌ల సమాచారాన్ని ఎన్నికల నోడల్ ఆఫీసర్ అకౌంటింగ్‌కు రోజువారీగా రిపోర్ట్ ద్వారా అందించాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ తెలిపారు. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పన్వర్‌హాల్‌లో హైదరాబాద్ జిల్లాలోని అన్ని బ్యాంకు మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ... ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బ్యాంకులలో జరిగే డిజిటల్ లావాదేవీలలో అనుమానిత, లెక్కకు మించిన నగదు అకౌంట్‌లపై నిఘా ఉంచి వాటి సమాచారాన్ని ప్రతి రోజు ఉదయం 10 గంటలలోపు జిల్లా ఎన్నికల అధికారికి పంపించాలని తెలిపారు. యూ.పీ.ఐ (గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే)ల ద్వారా ఎక్కువ అకౌంట్ లకు నగదు ట్రాన్స్‌ఫర్ అయ్యే అకౌంట్‌లకు సంబంధించిన స మా చా రా న్ని అందిచాలని తెలిపారు. ఏ.టీ.ఎంలలో నగదు డిపాజిట్ చేయడానికి వినియోగించే వాహనాలకు ఆయా బ్యాంకులు తప్పనిసరిగా జీ.పీ.ఎస్‌ను ఏర్పాటు చేసి వాహనాలను పరిశీలించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి ప్రతి వాహనాన్ని తనిఖీ చేయడం జరుగుతుందని, బ్యాంకు అధికారులు తరలిస్తున్న నగదుకు తప్పనిసరిగా డాక్యుమెంట్‌లు, క్యూఆర్ కోడ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ నగదుకు సంబంధించి రిసిప్ట్‌లను తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. డిప్యూటీ డీ.ఈ.ఓ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నగరంలో పట్టుబడుతున్న నగదును పరిశీలించి ఎటువంటి సమస్య లేనప్పుడు వాటిని వేగవంతంగా రిలీజ్ చేస్తున్నామని తెలిపారు. అభ్యర్థుల తుది జాబితా నవంబర్ 13 నుండి 30 వరకు పోటీలో పాల్గొనే రాజకీయ పార్టీల అభ్యర్థుల అకౌంట్ నెంబర్లను సంబంధిత బ్యాంకులకు అందించడం ద్వారా వారి లావాదేవీలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. అభ్యర్థి, అభ్యర్థి సంబంధికుల అకౌంట్ల నగదు లావాదేవీలను అందించాలని తెలిపారు. పొలిటికల్ పార్టీలు ఒక లక్షకు మించిన నగదు లావాదేవీలపై సమాచారం అందించాలని తెలిపారు. అన్ని బ్యాంకులు అనుమానిత, ఎక్కువ మొత్తంలో నగదు డిపాజిట్ అయిన అకౌంట్‌లు, రాజకీయ పార్టీల అకౌంట్‌లపై సమచారాన్ని ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో నోడల్ ఆఫీసర్ శరత్ చంద్ర, అడిషనల్ కమిషనర్ ఎలక్షన్ శంకరయ్య, ఐ.టీ అధికారులు మనీష, ఆర్.బీ.ఐ మేనేజర్, హైదరాబాద్ జిల్లాలోని అన్ని బ్యాంకుల మేనజర్లు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌ను కలిసిన జగదీష్ గౌడ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్‌లో ఉండే నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అకోడే కిషన్ రావును ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కిషన్ రావు ఆయనను శాలువా కప్పి సత్కరించారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తే "కురుమ" కుల సోదరుల సంక్షేమానికి కృషి చేస్తా



- ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

చేతి గుర్తుకు ఓటు వేసి తనను ఈసారి మల్కాజిగిరి నియోజక వర్గంలో భారీ మెజారిటీతో గెలిపిస్తే "కురుమ" కులసోదరుల సంక్షేమానికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు స్పష్టం చేశారు. గురువారం ఆయన, వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయి నగర్ కమ్యూనిటీ హాల్‌లో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతథిగా హజరై కురుమ సంఘ సభ్యులను మద్దతు కోరారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ... కమ్యూనిటీ హాల్ పనులు మధ్యలోనే ఆగి పోయాయని తెలిపారు. ఈ పనులు పూర్తి చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ... కురుమ సంఘం అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని చెప్పారు. ఎన్నికల తర్వాత తన సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలోని ఆరు పథకాలను వివరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ చేతి గుర్తుకు ఓటేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో పిట్ల నాగ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత మహాచండీ హెూమం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి విజయనగర్ కాలనీ, లో స్థానిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత వద్ద గురువారం నాడు మహాచండీ హెూమం ప్రత్యేక పూజలను కమిటీ ప్రధాన కార్యదర్శి మల్లం శ్రీనివాస్ గౌడ్ దంపతులు, భవాని స్వాములు, సభ్యులు నిర్వహించారు. అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు మొహమ్మద్ రియాజ్, కమిటీ సభ్యులు బాలునేత, మదన్ గౌడ్ ,శ్రీధర్, భవాని స్వాములు సాయి తేజ, శ్రీకాంత్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, దొడ్ల వెంకటేష్ గౌడ్, తులసిరావు తదితరులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, ముచ్చటగా మూడోసారి ముఖ్య మంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేయాలని కోరారు. కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామిని కోరుకుంటున్నానని ,కోరుకున్నది జరిగితే కూకట్‌పల్లి నుంచి తిరుమల వెంకటేశ్వర స్వామి గుడి వరకు పాదయాత్ర చేస్తానని మొక్కుకోవడం జరిగిందన్నారు. నవతెలంగాణ-కూకట్‌పల్లి



తెలంగాణను ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్సే..



- ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

స్థానికేతరులకు టికెట్ కేటాయిస్తే పార్టీ మనుగడ కోల్పోయే ప్రమాదం ఉందని ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి అన్నారు. గురువారం స్వామిట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ టికెట్‌ను స్థానికేతరులకు కేటాయిస్తే దాని ఫలితాలు చవిచూసామన్నారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలీయమైన శక్తిగా తెలంగాణలో అధికారంలోకి రావడానికి శక్తి యుక్తులను కూడగడుతుందని అన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీకి ప్రజల్లో వ్యతిరేకత ఉన్నందున ఆ పార్టీకి ఎదురుగాలి వీస్తుందన్నారు. ప్రధానంగా అభివృద్ధి పేరుతో అవినీతికి పాల్పడుతున్న బీఆర్ఎస్‌ను ఈ ఎన్నికలలో ప్రజలు ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గం కూకట్‌పల్లి నియోజకవర్గంలో స్థానికులైన సీనియర్ నాయకులకు ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. లేదా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు, లేదా మహిళలకు అవకాశం కల్పిస్తే కూకట్‌పల్లి లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడితే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, దళితులకు మూడు ఎకరాల భూమి, అంతేకాకుండా నిరుద్యోగ భృతి, కేజీ టు పీజీ వంటి హామీలను రెండు పర్యాయాలు ముఖ్య మంత్రి పదవినీ అనుభవిస్తూ ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చకుండా ఓట్లు అడిగే అర్హతను కోల్పోయారని అన్నారు. ప్రస్తుత రానున్న ఎన్నికలలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో అధికార పార్టీని ఓడించాలని, వాటిపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలంతా ఏకతాటిపై నిలిచి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెంట్ ఎమ్మెల్యే గొట్టిముక్కల పద్మారావు, ఫతేనగర్ డివిజన్ అధ్యక్షుడు కే రమేష్, నియోజకవర్గ యూత్ నాయకులు చిటకోరు కృష్ణ, జిల్లా ఎస్సీ విభాగం నాయకులు మధుమోహన్, రమేష్ బాబు, జిల్లా ఫిషర్మెన్ కమిటీ వైస్ చైర్మెన్ ఆకుల నరేందర్, డివిజన్ మైనార్టీ అధ్యక్షుడు ముక్తార్, బేగంపేట్ డివిజన్ యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను అఖండ మెజార్టీతో గెలిపించాలి



- కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు

నవతెలంగాణ, కేపీహెచ్‌బీ

నవంబర్ 30న జరిగే శాసన సభ ఎన్నికల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును అఖండ మేజార్టీతో గెలిపించాలని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు అన్నారు. గురువారం కేపీహెచ్‌బీ డివిజన్ 9వ ఫేస్ లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ ఆధ్వర్యంలో కాలని 4,7 వ ఫేస్‌ల బూత్ స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి.. పేదలకు అందిన సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి వివరించాలని తెలిపారు. ఎమ్మెల్యేను మూడోసారి గెలిపించేందుకు నాయకులు కార్యకర్తలు అంతా బాధ్యతగా పనిచేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేను భారీ మెజార్టీతో గెలిపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, సురేష్ రెడ్డి, సాయిబాబా చౌదరి, కట్ట నర్సింగ రావు, రాజేష్, వెంకట్ రెడ్డి, సాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్తేజం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ కొలన్ హన్మంత్ రెడ్డికి పార్టీ అధిష్టానం టికెట్ కేటాయించడంతో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ మేరకు నియోజకవర్గంలోని వివిధ కాలనీలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో గురువారం కోలను హన్మంత్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలపడంతో పాటు తమ పూర్తి మద్దతు ఉంటుందని వాగ్దానాలు చేస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఇతర పార్టీల నేతలు సైతం కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి కొలన్ హన్మంత్ బరిలో నిలవడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ఖచ్చితంగా గెలుస్తుందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు.. నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడే కొలన్ హన్మంత్ రెడ్డికే తమ పూర్తి మద్దతు ఉంటుందని నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలుపుతుండటం కాంగ్రెస్ పార్టీలో మరింత జోష్‌ను పెంచుతోందని పార్టీ శ్రేణులు తెలియజేస్తున్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ పుట్టినరోజు సందర్భంగా కె.పి. యువసేన సభ్యులు విజయ్, గౌతమ్ వారి ఆధ్వర్యంలో ప్రముఖ సినీ గాయకులు గీతా మాధురి, పర్ణిక నేపథ్య గాయంతో రూపొందించిన " అన్నొచ్చిండు వివేకానొచ్చిండు " అని పాటని గురువారం పెట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కెపి యువసేన నాయకులు, సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శుక్రవారం | అక్టోబర్ 20 2023 | www.navatelangana.com

ఆదాం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



నవ తెలంగాణ, ఓయూ:-
మనికేశ్వర్ నగర్ లో నరేష్, రవి, బోదాస్ నరసింహ ఆధ్వర్యంలో 200 మంది యువకులు కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఆదాం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదం. సంతోష్ కుమార్ మాట్లాడుతూ. గడపగడపకు వెళ్లికాంగ్రెస్ ఆరు గ్యారెంటీ లను ప్రతీ ఒక్క ఓటరుకు వివరిస్తూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ గెలుపునకు కషి చేయాలని, యువతకు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు



నవతెలంగాణ-బంజారాహిల్స్
ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వెంకటేశ్వర నగర్ డివిజన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు జెట్టి భారతి ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి విజయ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మహిళా గ్రూప్ నాయకురాలు భాగ్య కూడా భీమ్రావు,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు వచ్చినప్పుడే ఆ పార్టీలకు ప్రజలు గుర్తుకొస్తారు



- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్
ఎన్నికలు వచ్చినప్పుడే కాంగ్రెస్, బీజేపీ పార్టీల నేతలకు ప్రజలు గుర్తుకొస్తారని బీఆర్ఎస్ సనత్ నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని మొండా మార్కెట్ డివిజన్‌లో పాదయాత్ర ద్వారా ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదటిరోజు ప్రచారంలో బండిమెట్, మారుతివీధి, నాలా బజార్, ఓల్డ్ జైల్ ఖానా తదితర ప్రాంతాలలో ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేశారు. ప్రచారం ప్రారంభం నుంచి చివరి వరకు మంత్రికి ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. బతుకమ్మలు, డప్పు చప్పుళ్ళతో ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులు పట్టి మంత్రికి నుదుటన తిలకం దిద్దారు. భవనాల పై నుంచి మంత్రి పైకి పూలవర్షం కురిపించారు. ఆయనను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. తమ సమస్యలు పరిష్కరించిన, తమ బతుకుల్లో వెలుగులు నింపిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని, తమ ఓటు కారు గుర్తుకే అని మద్దతు తెలిపారు. పాదయాత్ర, ప్రచారంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ లకు చెందిన కార్పొరేటర్‌లు, మాజీ కార్పొరేటర్ లు, డివిజన్ అద్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతినెల పెన్షన్ క్రింద ఆర్థిక సహాయం అందిస్తూ తమ గౌరవాన్ని మరింత పెంచిందని పలువురు వద్దులు కతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలో 50 సంవత్సరాలలో జరగని అభివద్ధిని 10 సంవత్సరాల కాలంలో చేశామని చెప్పారు. గతంలో ఇక్కడి నుంచి గెలుపొంది ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా, మంత్రులుగా చేసిన వారు సైతం చేయలేని అభివద్ధి పనులను సీఎం కేసీఆర్ సహకారంతో చేసినట్టు తెలిపారు. అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థను అభివద్ధి చేశామని, తాగునీటి సమస్యను కూడా పరిష్కరించామని చెప్పారు. అభివద్ధి పనులు కండ్ల ముందే ఉన్నాయని, ముమ్మాటికి గెలుపు తనదేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు చూపెడుతున్న ఆదరణ చూస్తుంటే భారీ మెజారిటీతో ఘన విజయం ఖాయమని అన్నారు.

కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే మాయమాటలతో ప్రజల వద్దకు వచ్చే కాంగ్రెస్, బీజేపీ పార్టీల ను ప్రజలు నమ్మబోరని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పుడు ఒక్క చాన్స్ ఇవ్వమని కోరుతున్న కాంగ్రెస్ 45 నుంచి 50 సంవత్సరాల పాటు అధికారంలో ఉండి ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. అధికారంలో ఉన్ననాడే ప్రజలకు మేలు చేయలేనోళ్ళు ఇప్పుడు కొత్తగా గ్యారెంటీ, వారంటీ అంటూ కొత్త కొత్త పేర్లతో వస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రాష్ట్ర బీజేపీ నేతలు ఎన్ని నిధులు తీసుకోచ్చారో చెప్పాలని అన్నారు. ప్రజలు అభివద్ధిని కోరుకుంటున్నారని, మూడోసారి రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం పక్కా అని, హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపడతారని చెప్పారు. ఈ ప్రచారంలో మంత్రి వెంట బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, కార్పొరేటర్‌లు కొలన్ లక్ష్మి, హేమలత, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్‌లు ఆకుల రూప, నామన శేషుకుమారి, కిరణ్మయి, పార్టీ డివిజన్ అధ్యక్షులు ఆకుల హరికష్ణ, కొలన్ బాల్ రెడ్డి, గుర్రం పవన్ కుమార్ గౌడ్, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, నాగులు, రాములు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడానికి కృషి



- షెర్రీ జైరత్..

నవ తెలంగాణ-బంజారా హిల్స్...
మెరుగైన వైద్యం అందించడానికి ఉద్దేశించి ప్రసిద్ధ ప్రసూతి ఆస్పత్రుల చైన్ ,ఫెర్నాండెజ్ హాస్పిటల్‌తో శిశువులు,చిన్నారుల కోసం భారతదేశంలో మొట్టమొదటి సర్టిఫైడ్ ఆర్గానిక్ పర్సనల్ కేర్ అండ్ న్యూట్రిషన్ బ్రాండ్,హెర్బీ ఏంజెల్ భాగస్వామ్యం చేసుకున్నట్టు హెర్బీ ఏంజెల్ షెర్రీ జైరత్ వెల్లడించారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెర్బీ ఏంజెల్ బ్రాండ్ యాక్సెసిబిలిటీ అవగాహనను మెరుగుపరచడానికి ఈ భాగస్వామ్యం ఎంతగానో సహకరిస్తుందని తెలిపారు. ఆర్గానిక్, ఆయుర్వేద పదార్థాలతో తయారు చేయబడిన సురక్షితమైన బేబీకేర్ ఉత్పత్తులను అందించడంలో చూపుతున్న నిబద్ధతకు ప్రసిద్ధి చెందింది. హెర్బీ ఏంజెల్ బేబీ కేర్ పట్ల వారి నిబద్ధత , నైతిక విలువలను ప్రోత్సహించే, రిటైల్ ఏర్పాటు చేయబడిన సంస్థ, ఫెర్నాండెజ్ హాస్పిటల్ విలువలతో బాగా మిళితం అవుతుందన్నారు. వారి సంయుక్త ప్రయత్నాల ద్వారా, ఈ ప్రసిద్ధ సంస్థలు తల్లిదండ్రులకు ప్రీమియం,సహజమైన బేబీకేర్ ఉత్పత్తులకు తగిన అవకాశాలను అందించాలని భావిస్తున్నాయని, అలాగే ఆరోగ్యానికి హాని కలిగించకుండా చిన్నారుల శ్రేయస్సుకు మెటర్నిటీ కేర్‌లో పేరున్న ఫెర్నాండెజ్ హాస్పిటల్‌తో కలిసి పని చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఫెర్నాండెజ్ హాస్పిటల్ అనుభవం, విశ్వసనీయత ద్వారా వారు సురక్షితమైన బేబీకేర్ నిర్ణయాలు తీసుకుంటున్నారనే విశ్వాసాన్ని తల్లిదండ్రులకు దించడమే

ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న మాగంటి గోపీనాథ్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్
జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. రహమత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ సి ఎస్ రెడ్డితో కలిసి, బ్రహ్మ శంకర్ నగర్ నుంచి రాజీవ్ గాంధీ నగర్, తదితర ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తూ ప్రచార రథంపై ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను కలిసి బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరును, నియోజకవర్గంలో చేసిన అభివద్ధి పనులను వివరించారు. కరపత్రాలను రహమత్ నగర్ డివిజన్ ప్రజలకు అందజేశారు. ప్రచారానికి స్థానిక ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని మాగంటి గోపీనాథ్ కు పూర్తి మద్ధతు తెలుపుతు ప్రచారాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, నజీర్, నాగరాజు, కష్ణ, పరుశురాం, ధనుజ, మన్సూర్, స్రవంతి,రాకేష్, అరుణ్, విలియమ్స్,లక్ష్మయ్య, శాంతకుమార్, కుమార్, ఫయాజ్,జబ్బార్ ,గఫూర్,రవిశంకర్, సమీనా తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ స్టూడెంట్ మ్యానిఫెస్టో విడుదల



నవతెలంగాణ-ఓయూ
ఓయూ ఆర్ట్స్ కళాశాల న్యూస్ సెమినార్ హాల్లో ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం స్టూడెంట్ మ్యానిఫెస్టో విడుదల చేశారు. మేనిఫెస్టోలో ముఖ్యంగా విద్యార్థిని ఉద్యోగం అంశాలను చేర్చారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ మాట్లాడుతూ స్టూడెంట్ మ్యానిఫెస్టోను రాజకీయ పార్టీలు అన్ని విధిగా వారి వారి మ్యానిఫెస్టోలో చేర్చాలని, లేనిపక్షంలో రాబోవు ఎన్నికల్లో విద్యార్థులు అందరూ కలిసి ప్రజల్లో చైతన్యాన్ని నింపి గుణపాఠం చెప్పాల్సి వస్తుందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులను నిరుద్యోగులను పూర్తిగా విస్మరించి , విద్యాలయాలను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ మాట్లాడుతూ. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలో బోధన బోధనేతర ఖాళీలను భర్తీ చేసి 8624 పాఠశాలలను పున: ప్రారంభించాలన్నారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి ఖాళీగా ఉన్న ఒక లక్ష 91 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పత్వి తేజ,కమల్ సురేష్, శ్రీనాథ్ ,జీవన్ శ్రీరామ్, రాజు మహేష్ ,హరిప్రసాద్ సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ సాధించిన ఓయూ పూర్వ విద్యార్థులు



నవతెలంగాణ-ఓయూ
ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు డాక్టర్ గాజుల ప్రభాకర్, డాక్టర్ పాపతోటి నరేంద్రకుమార్‌లు మరో ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ సాధించారు. బ్యాక్టీరియా మెటబొలైట్ నుంచి బయో పెస్టిసైడ్ తయారుచేసి, కెమికల్ పెస్టిసైడ్ కన్నా త్వరగా, మెరుగ్గా పనిచేసే విధంగా తయారు చేయుటకు వారు రూపొందించిన ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఐ.ఎఫ్.సి.ఐ (ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) వెంచర్ క్యాపిటల్ స్కీం కింద ఎంపిక చేసి రూ 30 లక్షలు గ్రాంట్ ను మంజూరు చేసింది. వివిధ దశలలో వారి ప్రతిభను ప్రదర్శించి విజయవంతంగా ప్రాజెక్టు గ్రాంట్‌ను సాధించారు. రెండు తెలుగు రాష్ట్రాల తరపున గ్రాంట్ కి ఎంపికైన ఏకైక ప్రాజెక్టుగా ఈ ప్రాజెక్టు నిలవడం విశేషం. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో మారుమూల గ్రామాలైన డోర్నకల్, నెల్లికుదురు మండలం శ్రీరామగిరి నుండి వచ్చి వ్యవసాయ రంగంలో మెరుగైన ఫలితాలు సాధించడానికి అనేక పరిశోధనలు చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా కెమికల్ పెస్టిసైడ్ వాడటం వలన మానవులు అనేక రకాల ఆరోగ్య సమస్యలు, క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. అంతేకాకుండా వాటి వల్ల పర్యావరణానికి కూడా నష్టం వాటిల్లుతోందని, కావున కెమికల్ పెస్టిసైడ్‌ల వాడకం నిర్మూలించి బయోపెస్టిసైడ్స్ వాడటం వల్ల పైన పేర్కొన్న ఆరోగ్య సమస్యలను అధిగమించి మెరుగ్గా పనిచేసే ఎకో ఫ్రెండ్లీ ప్రోడక్ట్ ను తయారు చేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం వీరు మిర్చి, మామిడి పంటలపై తీవ్ర ప్రభావం చూపించే నల్ల పురుగును నిర్మూలించేందుకు చేసిన ప్రాజెక్ట్ కేంద్ర ప్రభుత్వ సంస్థ అందించే 50 లక్షల బయో టెక్నాలజీ ఇగ్నిషన్ గ్రాంట్‌కి ఎంపికై పరిశోధనలు చేస్తుండటం గమనార్హం. గతంలో కూడా వీరు కేంద్ర ప్రభుత్వ సంస్థ అందించే ప్రాజెక్ట్ గ్రాంట్ లకు ఎంపికై విజయవంతంగా పూర్తి చేశారు. డాక్టర్ నరేంద్ర కుమార్ ప్రస్తుతం థాయిలాండ్ సురనరీ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ క్రాఫ్ ప్రొడక్షన్‌లో పోస్ట్ డాక్టరల్ గా చేస్తుండగా, డాక్టర్ గాజుల ప్రభాకర్ శ్రీ జీ. పి. అవెన్స్ లైఫ్ సైన్సెస్ ప్రయివేటు లిమిటెడ్ అనే సంస్థని స్థాపించి అనేక రకాల వ్యవసాయ సంబంధిత ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. వీరు చేసిన పరిశోధనలు 25కి పైగా జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితం అయినాయి. వీటితో పాటు ఇప్పటివరకు 5 పుస్తకాలను ప్రచురించడంతో పాటు, 6 పేటెంట్లను కూడా పొందారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం లభిస్తే రైతులకు ఉపయోగపడే మరిన్ని పరిశోధనలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వీరు తెలిపారు.

ఓయూలో బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-ఓయూ
ఓయూలో మూడు బోధనేతర ఉద్యోగ సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఓయూ ప్రధాన పరిపాలనా భవన ఆవరణలో నిర్వహించారు. మహిళా ఉద్యోగులు పెద్ద ఎత్తున బతుకమ్మ ఆడారు. ముఖ్య అతిథిగా హాజరైన ఓయూ వీసీ ప్రో.రవీందర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కతి, సంప్రదాయాల్లో బతుకమ్మ ప్రపంచ స్థాయి గుర్తింపు దక్కించుకుందని అన్నారు.బతుకమ్మ దసరా పండుగ వచ్చిందంటే ఊళ్లల్లో ఉండే ఉత్సాహమే వేరన్నారు. బాల్యంలో ఊళ్లో జరిగే బతుకమ్మ పండుగకు మిత్రులతో కలిసి చేసే హడావుడిని ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఉద్యోగులకు బతుకమ్మ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పి. లక్ష్మీనారాయణ, ఎస్బీఐ మేనేజర్ శివంగి కుమార్, ఓయూ మహిళా కమిటీ నుంచి ప్రణీత, హైమావతి, ప్రీతి తివారి, వరలక్ష్మి, స్వాతి రెడ్డి, సుధ పాల్గొన్నారు. ఎన్జీఓస్, టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్, ఎంప్లాయీస్ యూనియన్ల నాయకులు బియ్యాని జ్ఞానేశ్వర్, రవి, నాగరాజా రావు,విజయ్ కుమార్, శివ శంకర్, నాగరాజరావు, రవి, అక్బర్ బేగ్ మహిళ ఉద్యోగులు,సిబ్బంది భారీగా తరలివచ్చారు. బతుకమ్మ సంబరాలతో పాటుగా దాండియా తో సందడి చేశారు.

కార్మిక కర్షకులు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయొద్దు



- ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ డాక్టర్ సమీరా..

నవతెలంగాణ - బంజారాహిల్స్
నగరంలో ప్రభుత్వం నిర్మిస్తున్న భారీ ఆస్పత్రిలో ఒకటైన టిమ్స్, సనత్ నగర్ భవన నిర్మాణ కార్మికులు కర్షకుల ఆరోగ్యం పై నిర్లక్ష్యం వహించవద్దంటూ అమీర్‌పేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత హెల్త్ క్యాంప్‌లో వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గురువారం ఏర్పాటు చేసిన ఈ ఉచిత వైద్య శిబిరానికి తెలంగాణా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వెయ్యి పడకల ఆస్పత్రి సనత్ నగర్ సైట్‌లో పని చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు, ఇతరత్రా సిబ్బందికి ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ ఆప్టోమెట్రిస్టు తస్నీమ్ వైద్యులు సమీర ఆధ్వర్యంలో ప్రాథమిక పరీక్షలతో పాటూ కంటి పరీక్షలు కూడా ప్రత్యేకంగా నిర్వహించారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ నిరంతరం కాలుష్యంతో కూడిన వాతావరణంలో పని చేసే భవన నిర్మాణ కార్మికులు నియమిత కాలంలో ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలని సూచించారు. అంతే గాకుండా భవన నిర్మాణ కార్మికులు ప్రమాదాల భారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ప్రమాదం జరిగినా ఆరోగ్య సమస్య తలెత్తినా స్వీయ వైద్యం చేసుకోకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించిన ఈ హెల్త్ క్యాంపులో సుమారు 500 మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ నర్సింగ్ సిబ్బంది తాతాజీ, దుర్గ, సునీత, బర్షా రాణి లతో పాటూ క్యాంపు కోఆర్డినేటర్ పెంచల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు వేతనాలు సకాలంలో చెల్లించాలి



- ఓయూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు. టి.మహేందర్

నవతెలంగాణ-ఓయూ
ఓయూలో ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు సకాలంలో చెల్లించాలని ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్ట్,ఔట్ సోర్సంగ్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్ యూనియన్ అధ్వర్యంలో సైన్స్ కాలేజ్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు టి.మహేందర్ మాట్లాడుతూ ఓయూలో మెస్, హాస్టల్ లలో ఉద్యోగులు సాయి సెక్యూరిటీ కాంట్రాక్టర్ పరిధిలో దాదాపు 60 మంది పని చేస్తున్నారు అని అన్నారు. వీరికి దాదాపుగా మూడు నెలలుగా నుంచి సమయానికి వేతనాలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నెల 19 వ తేది దాటినా నేటికీ వేతనాలు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జీతాలు వెయ్యాలని డిమాండ్ చేశారు. వేతనాలు రాకపోవటం వలన కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలను పోషించడం ఇబ్బందికరంగా మారిందన్నారు. వీరికి వేతనాలు ప్రతి నెల 10వ తారీకు లోపల రావాలన్నారు. కాంట్రాక్టర్‌లో మాట్లాడి వెంటనే వేతనాలు వెయ్యాలని సైన్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రో. వీరేశంను కలిసి మాట్లాడారు. సైన్స్ కాలేజ్ ప్రో.వీరయ్య సానూకులంగా స్పందించి వేతనాలు సకాలంలో వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రావు,ఉపాధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్,అంజమ్మ,జయమ్మ,చ్.ఉమ,అనురాధ, .,అజీమ్,పాల్గొన్నారు.

భారత స్విమ్మర్ క్విని విక్టోరియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలి



- తెలంగాణ స్విమ్మింగ్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి వెల్లడి

నవతెలంగాణ-అంబర్‌పేట
అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పతకాలు సాధించిన క్విని విక్టోరి యాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన గుర్తింపు ఇవ్వాలని తెలంగా ణ స్విమ్మింగ్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్య క్షుడు చంద్రశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ నుంచి అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీలలో 17దేశాల నుంచి పాల్గొన్న క్విని విక్టోరియా గోల్డ్ మెడల్ సాధించడం అభినంద నీయమని, రాష్ట్రంలోని ఏకైక స్వి మ్మింగ్ క్రీడాకారిణిగా చరిత్ర సష్టించారన్నారు. ఇటీవల సెర్బియా రాజధాని బెల్గ్రేడ్ జరిగిన ఫిన్ స్విమ్మింగ్ పోటీలలో గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ సాధించిన హైదరాబాద్ బర్కత్ పురాకు చెందిన గంధం క్విని విక్టోరియాను గురువారం ఫెడరేషన్ బందం మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న ఫిన్ స్విమ్మింగ్ క్రీడాకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ప్రోత్సహించాలన్నారు. క్విని విక్టోరియా 43 వయస్సులో 3 కిలో మీటర్లు మహిళా విభాగంలో బంగారు పతకం, 1 కిలోమీటర్ విభాగంలో సిల్వర్ పతకం సాధించ డం గొప్ప విషయం అన్నారు. ఓపెన్ వాటర్ ఫిన్ స్విమ్మింగ్ చాంపియన్షిప్ పోటీలలో క్విని విక్టోరియా రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించిన క్విని విక్టోరియాను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు. రేపటి భవిష్యత్తులో క్విని విక్టోరియా ఇలాంటి మరెన్నో విజయాలు సాధించి దేశ ప్రతిష్టతను పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా స్విమ్మింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు సతీష్ మట్టా, టిడిఎ ఎస్ ఫౌండర్ సంజయ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సూత్రాతో దసరా దీపావళి పండుగ సందడి...



నవతెలంగాణ-బంజారా హిల్స్
ఈ సారి సూత్రాతో దసరా దీపావళి పండుగలను కలర్ ఫుల్‌గా చేసుకోవాలని సూత్ర ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఉమేష్ మధ్యాన్ తెలిపారు.గురువారం బంజారాహిల్స్ తాజ్ కష్ణ హెూటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోడల్స్ రిషిత,మనీషా,దీపిక,వాన్యా అగర్వాల్, షారోన్,రియాలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా సూత్ర ప్రదర్శనను ప్రారంభించారు. చేనేతలకు సహకారం అందిస్తూ 'మేడ్ ఇన్ ఇండియా'ప్రాంతీయ వస్తువుల ఫ్యాషన్ ఫెయిర్లలో దేశవ్యాప్తంగా ఉన్న దుస్తులు, లైఫ్‌స్టైల్ రిటైలర్లను ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ చేనేతలకు అండగా ఉంటూ వారు తయారు చేసిన ప్రత్యేకమైన మహిళ లదుస్తులు ,సాంప్రదాయ దుస్తులు, ఫ్యూజన్ దుస్తులు,ఉపకరణాలు, అలాగే ఆభరణాలు,సంచులు, గహ అలంకరణతో పాటు ప్రస్తుత జీవనశైలి అనుగుణమైన వస్తువులు ఇతరులకు ఇవ్వాలనుకునే బహుమతి వస్తువులతో సహా పండుగ ఉత్పత్తి విభాగాలపై ఈ కార్యక్రమం దష్టి పెట్టిందన్నారు. ప్రదర్శనలో సుమారు 3 వేల కంటే ఎక్కువ సందర్శకులు అలాగే 60కి పైగా ప్రదర్శకులు వారి ఉత్పత్తులను ప్రదర్శిస్తారన్నారు.కోల్‌కతా ప్రధాన కార్యాలయం అయిన సూత్రా ఎగ్జిబిషన్ ఈ కార్యక్ర మాలను నిర్వహిస్తోందని, డిజైనర్లు, ఇన్స్పైర్డ్ చీరలు,సల్వార్ సూట్లు, లెహెంగాలు, పాదరక్షలు, ఇతర యాక్సెసరీల స్పెక్ట్రంను మీ కోసం మాత్రమే ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రదర్శకులు సుమారు సాఖ్ విలక్షణమైన దుస్తులు, వస్త్రం బోటిక్, హార్ష్ డిజైనర్ బోటిక్,మహాలక్ష్మీ జ్యువెలర్స్,సిమ్రాన్ డమ్రా,గ్లాం వరల్డ్, హియా క్రియేషన్ ముంబై హురైన్ క్రియేషన్, ఎలిగెన్స్ అహ్మదాబాద్,కేవై కలెక్షన్,మాక్ వస్త్ర వాఫే కోల్‌కతా, జువెలరీ వరల్డ్ బై ఉస్మాన్ జరీవాలా పల్లవి పీయూష్ లఖ్నవూ కుర్టీస్,ప్లాజో ది క్రియేటివ్ హబ్ అన్నారు. సరదాగా ప్రదర్శననూ తిలకించాలని నగరవాసులకు కోరారు.

